# యండమూరి కథాస్రవంతి

కథలు

\- డా.యండమూరి వీరేంద్రనాథ్



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 224

కౌముది మాసపత్రికలో

జనవరి 2019 సంచిక నుంచి డిసెంబర్ 2019 సంచిక వరకూ

వచ్చిన కథలు

# ముసురు పట్టిన రాత్రి

## (ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక ఆగష్టు 20, 1969 సంచికనుంచి)

**రాత్రి పదిన్నర అయింది !**

వర్షం అప్పుడే వెలిసింది. ఈదురుగాలి బయట చల్లగా బలంగా వీస్తూంది. గాలికి ఊగుతున్న చెట్ల ఆకుల శబ్ధం తప్పితే వాతావరణం ప్రశాంతంగా ఉంది.

బయట చలి... ఎముకలు కొరికే చలి... రూమ్ లో కూర్చోని ట్రాన్సపరెంట్ అద్దాల్లోనించి బయటకు చూస్తున్నాను. సగం తెరిచిన వెనీషియన్ బ్లైండ్స్ లోనించి తడిసిన సిమెంట్ రోడ్డు మెరుస్తూ కనబడుతూంది. పచ్చటిలాన్ మీద ముత్యాల్లాంటి నీటి బిందువులు అందంగా మెరుస్తున్నాయి.




గది అంతా లేత లేత నీలిరంగు మందంగా వ్యాపించి ఉంది. టేబిల్ మీద కాక్టస్ ప్లాంట్ అందంగా మెరుస్తూంది. స్టీరియోగ్రామ్ ఆన్ చేసి, దోసిళ్ళలో గెడ్డం ఉంచుకొని బయటకు చూస్తూ కూర్చున్నాను.

మనస్సంతా అదోలా ఉంది. ఇలాటి రాత్రి... వర్షం ... ఈ ప్రశాంతత ... వీటిని చూస్తే నాకు భయం...

ఇలాటి రాత్రే నా జీవితంలో అనుకోని మార్పు తెచ్చింది. ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం ... ఇలాగే ముసురు పట్టిన రాత్రి ...

అయిదు సంవత్సరాల క్రితం ... ఆ రాత్రి ...

ఇలాగే ఈ కుర్చీలోనే కూర్చొని బయటకు చూస్తున్నాను. బయట మెరిసినప్పుడల్లా గది అంతా వెలుగు ఒక్క క్షణంలో నిండిపోతూంది.

నా వెనకే వచ్చి నిలబడింది మాలతి ! తెల్లటి నైలాన్ చీరలో మెరిసిపోతూంది ఆ రోజు.

ఒక్క క్షణం మా ఇద్దరిమధ్యా మౌనం రాజ్యం చేసింది. కాంపౌండ్ వాల్ ని ఆనుకొని ఉన్న గులాబీ చెట్టుమీద తన దృష్టి నిలవడం గమనించాను. దానికున్న ఒకే పూవు గాలికి ఏ క్షణమైనా రాలిపోయేలా ఉంది.

మాలతికి ఇలా చిన్న చిన్న ఎడ్వంచర్స్ అంటే ఇష్టం. తలుపు తెరుచుకొని గార్డెన్ లోకి వెళ్ళింది. ఇంత ఈదురుగాలిలో ఈ హిల్ స్టేషన్ లో బయట ఎంత చలిగా ఉంటుందో ఊహించగలను.

కాంపౌండ్ వాల్ కి బయటవైపు తాటిచెట్టు గాలికి బలంగా ఊగుతూంది ఇటూ అటూ.

చెవుల చుట్టూ పైట నిండుగా కప్పుకుని పువ్వు కొయ్యడానికి వంగుతూంది మాలతి ...

నా మనస్సెందుకో కీడు శంకించింది. అప్రయత్నంగా కుర్చీలోంచి లేచాను.

ఉన్నట్టుండి ఒక్క గాలి కెరటం బలంగా ఉప్పెనలా వీచింది, అంతే !

కెవ్వుమనే ఆర్తనాదం గాలిలోనించి వచ్చింది. బయటకు పరుగెత్తాను, కానీ ...

అంత ఎత్తుమీదనుంచి పడిన తాటిపండు, తన కసి తీర్చుకొని నీళ్ళలో ఎటో పడిపోయింది.

ఎర్రటి రక్తం ... నీళ్ళలో కలిసి పల్చబడిన రక్తం ...

తల విదిలించాను. ఆ స్మృతే భయంకరంగా ఉంటుంది.

లేచి ఫ్రిజిడేర్ లోనించి కొంచెం స్కాచ్ తీసి గ్లాసులో పోసుకొన్నాను.

మాలతి చచ్చిపోలేదు. కుడిచేయి నరం మడత పడింది. ఎప్పుడూ నవ్వుతూ ఉండే మాలతి కళ్ళస్థానే గాజుకళ్ళు స్థిరనివాస మేర్పరుచుకొన్నాయి.!

కానీ మాలతి బ్రతికింది! జీవచ్ఛవంలా బ్రతికింది!

ఒక అంతస్తు మీద ఇంకొకటి కట్టుకొంటూ వచ్చిన నా కలల భవంతి పునాదులతో సహా కూలిపోయింది. నేను మిగిలేను. నాకు తోడుగా మాలతి ఒంటిచేత్తో తడుముకొంటూ నన్ను చేరే మాలతిని చూస్తే భయం వేయటం మొదలుపెట్టింది. భయం తగ్గడానికి ఈ త్రాగటం నేర్చుకొన్నాను. క్లబ్ ... ప్లేయింగ్ కార్డ్స్ ... కాక్ టెయిల్ పార్టీలు ...

అప్పుడు పరిచయమయింది హెలెన్ తో!

హెలెన్ నన్ను తన బోయ్ ఫ్రెండ్స్ తో చేర్చుకొన్నప్పుడు సంతోషించేను. కొంతకాలానికి పెళ్ళి చేసుకుంటానన్నప్పుడు అదో గర్వకారణంలా భావించాను.

నా ప్రేమలోని కపటత్వం మాలతి చేరువగా ఉన్నప్పుడు చేతుల్లో కంపనాన్ని కల్గించేది. తను చేసే ప్రతి పనీ నాలో విసుగుకు కారణమయ్యేది. కానీ ఆ విసుగుకు కారణం మాలతి కాదు .... ఏదో తెలియని కసి ... !

మాలతి ముగ్ధత్వం, మాలతి చేతుల్లో అమాయకత్వం గుర్తించటం మానేశాను. మాలతికీ నాకూ మధ్య దూరం ఎక్కువ అవసాగింది ... ఊహూఁ ... కాదు నేనే దూరంగా వెళ్ళిపోసాగాను.

ఈ బీజానికి హెలెన్ తో స్నేహం నీళ్ళు పోసింది.

ఇప్పుడది మహా వృక్షం !

తెలివైన అమ్మాయి మాలతి ... విషయం తొందరలోనే గ్రహించింది. కూతుర్ని పోషించలేనంత బీదవాడు కాదు మామయ్య.

నేనూ సంతోషించాను ... చట్టబద్ధంగా ఏర్పాటు.

బయట చలిగాలి బలంగా వీస్తూంది. కొద్దిగా తుంపర పడుతూంది.

ఫోటోలో హెలెన్ నవ్వుతూంది. హెలెన్ కి ఎరుపంటే ఇష్టం. మాలతికి తెలుపంటే ప్రాణం. అప్పట్లో నాకు తెల్లటి బేబీ ఆస్టిన్ ఉండేది. ఇప్పుడు పోర్టికోలో పింక్ కలర్డ్ కాంటెస్సా మెరుస్తూంది.

కారిడార్ తలుపు కొట్టుకొంటూంది ఇంకా.

నిద్ర రావటం లేదు. వచ్చే సూచనలు కూడా లేవు. తలుపు వెయ్యడానికి లేచాను. నేలమీద అస్తవ్యస్తంగా పడి ఉన్నాయి ప్లేబాయ్ ... టిట్ బిట్స్.

ఎందుకో బయటకు వెళ్ళాలనే బుద్ధి పుట్టింది. అప్రయత్నంగా నడిచాను.

ఒక్కసారి వెచ్చని గదిలోంచి బయటకు వచ్చేసరికి ఒళ్ళంతా చలికి వణికింది.

సరీగ్గా ఇలాటి రాత్రే .. ఇలాటి ముసురే! పోర్టికో స్తంభాన్ని పట్టుకొని నిలబడ్డాను.

అదే గులాబీ చెట్టు ... కొత్త రెమ్మలు వేసి ఏపుగా పెరిగింది.

నరాలు జివ్వుమనే చలిగాలి కెరటాల్లా వీస్తూంది. నేలంతా తడిగా ఉంది. వర్షం నీరు కాలువలు కట్టి ప్రవహిస్తూంది.

ఒక్కసారి మెరిసింది. .. రెండు సెకన్లపాటు ప్రపంచం అంతా వెలుగుతో నిండిందా అన్నట్టు మెరిసింది.

ఆ వెలుగులో చూచాను. దాదాపు పదేళ్ళ పాప ... చీకట్లో ఒంటరిగా రోడ్డుమీద నిలబడి ఉంది. వర్షం వల్ల బట్టలు ఒంటికి అతుక్కుపోయి ఉన్నాయి. ముద్దగా తడిసిపోయింది.

నాకు ఆశ్చర్యంగా ఉంది.

కాంపౌండ్ వాల్ గేటుతీసుకుని బయటకు వచ్చాను. ఆ పాప దగ్గిరకు చేరుకున్నాను. తడిసిన జుట్టు పాయలుగా మొహం మీదకు పడుతూంది. నీటి చుక్కలు బొట్లు బొట్లుగా రాలుతున్నాయి కిందికి! నా వైపు బెదురుగా చూచింది.

“ఎవరు నువ్వు?” అడిగేను. సమాధానం ఆశించలేదు నేను. ఇంకొంచెం సేపు ఆ గాలిలో ఉంటే నాకే న్యుమోనియా వస్తుందేమో అన్న భయం వేసింది నాకు.

వంగి తన చేయి పట్టుకొని నా బంగళావైపు దారి తీశాను.

నిజానికి ఏ సాయంత్రంపూటనో నా కాంటెస్సా క్లబ్బువైపు దారి తీస్తున్నప్పుడు, ఇదే పాప కాంపౌండ్ వాల్ గేటు దగ్గిర నిలబడి ఏదైనా యాచించి ఉంటే అసహ్యించుకొని ఉండేవాణ్ణేమో !

కానీ ఈ నిశ్శబ్ద నిశీధిలో, ఒంటరిగా నిస్సహాయంగా నిలబడ్డ ఆ పాపని చూస్తే నాలో ఏదో మానసికోద్వేగం కలిగింది.

బయట ప్రకృతి చేస్తున్న తాండవానికి భయపడిన ఆ పాప కూడా ఏమీ మాట్లాడకుండా నాతోనే నడిచింది ...

హీటర్ ఉండటం వల్ల గది అంతా వెచ్చగా ఉంది. రూమ్ అంతా లైట్ సెంటెడ్ ఆడర్ మత్తుగా వ్యాపించింది. బయటనుంచి రావడంవల్ల దాన్ని గమనించగలిగాను.

ఆ పాపని ఈ ఊళ్ళోనే ఎక్కడో చూశాను! ఎంత ఆలోచించినా జ్ఞాపకం రావటం లేదు. తను గుండెలనిండా మత్తుగా, బరువుగా ఊపిరి తీయటం గమనించాను.

“తప్పిపోయావా?” అడిగాను తువ్వాలు చేతిలోకి తీసికొంటూ.

తను మాట్లాడలేదు.

“అమ్మా... నాన్నా...? “ మళ్ళీ అడిగాను.

లేరన్నట్టు తల ఊపింది.

జాలేసింది నాకు. జీవితంలో ఒంటరితనం ఎంత బాధాకరమో నాకు తెలుసును! తమ చుట్టూ తాము గూడు అల్లుకొని జీవించే వారికి మరీ ... ! ఏదైనా తోడు దొరుకుతుందేమోననీ, తమ సర్వస్వం అర్పించుకొందామనీ చూస్తూంటారు.

ఆ పాపని చూస్తూంటే నాలో ఏదో స్నేహ పూర్వకమైన భావం కలుగుతూంది. లేమి సృష్టించిన మేలి ముసుగును తొలగిస్తే ... అప్పుడే తడి ఆరుతున్న జుట్టూ, గుండ్రటి మొహం ... అమాయికంగా, ఏదో పోగొట్టుకొన్నట్టు చూచే కళ్ళు ...

నాలాగే ఒంటరి ...

ఫ్లాస్క్ లోంచి టీ పోసి ఒక గ్లాసు పాపకిచ్చాను. జాగ్రత్తగా రెండు చేతులతోనూ పట్టుకొని తాగటం ప్రారంభించింది.

నా దగ్గిర బెదురు తగ్గినట్టుంది. రూమ్ నలువైపులా పరికించి చూడసాగింది. నెమ్మదిగా కబుర్లలోకి దింపాను.

"నీ పేరేమిటి పాపా?" అని అడిగాను.

"బిందూ."

"మీ ఇంట్లో ఇంకా ఎవరెవరుంటున్నారు?" విషయం తెలుసుకోవడానికి ఇంక ఎలా అడగాలో తెలియలేదు.

"నేనూ, రాకా అంతే___" అంది.

"రాకా... అంటే... " సందిగ్ధంలో ఆగాను. అప్పుడు జ్ఞాపకం వచ్చింది ఈ పాప ఎవరో ...

గాంధీ బొమ్మ పక్కన రాకా ... ఈ పాప పాడుతూ ఉంటే చుట్టూ చేరిన వాళ్ళ దగ్గిర డబ్బులు అడుక్కొంటూ నాకు నాలుగయిదు సార్లు కనిపించాడు.

రాకా అంటే తెలియని వాళ్ళు ఈ ఊళ్ళో లేరు...

ఆరడగుల ఎత్తూ ... చారల బనీనూ... ! అమాయకుల దగ్గిర్నుంచి డబ్బు ఎలా పొందవచ్చో వాడికి బాగా తెలుసు! కానీ సంవత్సరం క్రితం ... వాడికి అకస్మాత్తుగా జబ్బుచేసింది. వాడు యౌవనంలో ఆడిన ఆటల ఫలితాలూ, త్రాగుడూ సరి అయిన సమయం చూచుకొని ఒక్కసారి ఎదురు తిరిగేసరికి అంత మనిషీ ఒక్కసారి పీనుగైపోయాడు. అప్పటినించీ వాడు జీవనోపాధికోసం ఈ పాపని ఉపయోగించుకోవటం మొదలు పెట్టాడు.

కానీ ఈ పాప ఎక్కడిది వాడికి ? వాడు ఒంటరి అని తెలుసు నాకు ! అదే ప్రశ్న అడిగాను. నా ఊహ నిజమయింది. తను చెప్పిన దాన్నిబట్టి నాకు అర్థమయింది ఏమిటంటే ...

ఒక రైలు ప్రమాదంలో తను దొరికింది రాకాకు. మొదట్లో ఈ పాపని పెంచటం అసలు సమస్యే కాలేదు. ఆరు నెలలనుంచీ ... అంటే, రాకా ఆరోగ్యం బాగా పాడైన కొద్దీ __ ఈ పాపే ఒక విధంగా అతన్ని పోషిస్తూంది అని చెప్పొచ్చు!

బిందూ మొహంలోకి చూస్తూంటే ధనవంతుల పాపలా కనబడింది... ఇంత చిన్న వయసులోనే జీవనోపాధికి కష్టపడే తనని చూస్తే జాలేసింది.

అప్రయత్నంగానే అడిగేను,

"నాతో ఉండిపోకూడదూ, బిందూ?" అని. ఈ ఆలోచన వచ్చినందుకు నన్ను నేనే అభినందించుకొన్నాను.

బిందూ ఆశ్చర్యంగా చూసింది నా వైపు ...

ఒక్క క్షణం మాట్లాడలేదు.

ఆ మాత్రం విరామాన్ని కూడా భరించలేక పోయాను.

తరువాత నెమ్మదిగా అంది "మరి ... రాకా?"

ఈ ప్రశ్న అసలు ఊహించలేదు. నన్ను అవహేళన చేస్తున్నట్టు అనిపించింది ఆ ప్రశ్న.

ఆ పాపే నిజానికి రాకాని పోషిస్తున్న సంగతి నాకు తెలుసు. కానీ వాళ్ళిద్దరి మధ్యా పెరిగిన అనుబంధం వయస్సు ఒక సంవత్సరం. రాకాని పోషించవలసిన అవసరం తనకేముంది? ఇప్పటి వరకు తను పోషించినది చాలు. ఇంత అందమైన గులాబీ పూవు సరియైన పోషణలేక తొందరగా వాడిపోవటం నా కిష్టంలేదు.

నాలో పట్టుదల హెచ్చింది. అనునయిస్తున్నట్టు అన్నాను. "చూడు బిందూ! రాకా ఇంకెంతకాలమో బ్రతకడు. ఇప్పుడు వాడి ఆరోగ్యం ఎంత హీనంగా దిగజారిపోయిందో, వాడితో కలిసి ఉంటే నీకు వచ్చే నష్టాలేమిటో తెలుసుకునేటంతటి వయసు లేదు నీకు. హాయిగా నాతో ఉండిపో! కొన్ని రోజుల్లోనే నీకో పిన్ని కూడా వస్తుంది. హాయిగా చదువుకోవచ్చు! ఆడుకోవచ్చు! ... ఇంకా రాకా సంగతంటావా, ఒకప్పుడు వాడు చేసిన ఘోరాలన్నిటికీ వాడు ఫలితం అనుభవించక తప్పదు .. అనుభవిస్తాడు!" అంతకంటే సులభమైన భాషలో చెప్పటం నా వల్ల కాలేదు.

ఒక్క క్షణం బిందూ మాట్లాడలేదు.

ఫ్రిజిడేర్ లోంచి ఒక ఆపిల్ తీసి ఇచ్చాను. "చూశావా... ఈ గది ఎంత వెచ్చగా ఉందో ... ఆ మూల చూడు. అది హీటర్ ... దానివల్లే ఈ గది వెచ్చగా ఉంది. ఇదిగో ఇది బ్యూటేన్ లైటర్ ... ఈ చేప చూశావా ఎలా మెరుస్తూందో ... "

ఒక్కో ఆకర్షణా బిందూని అయిస్కాంతంలా లాగుతాయి నా వైపుకి తను జీవిస్తున్నది ఎంత హేయమైన శూన్యమైన బ్రతుకో అర్థమై ఉంటుంది ఈ పాటికి ...

ఆసక్తికరంగా చుట్టూ ఉన్న వస్తువుల్ని చూస్తూంది !

స్టీరియో గ్రామ్ లోంచి ... "ఇట్ హాజ్ బీన్ ఎ హార్డ్ డేస్ నైట్ ... అండ్ ఐ హావ్ బీన్ ..." బీటిల్స్ గొంతు గిటార్ ధ్వనుల మధ్య వినిపిస్తూంది. ఎక్వేరియమ్ లో ఆక్సిజన్ బబుల్స్ ఒకదానినొకటి తరుముకొంటూ పైకి వెదుతున్నాయి. టేబిల్ మీద కేక్టస్ ప్లాంట్ అందంగా మెరుస్తూంది.

రేడియం వాచీ పన్నెండు చూపుతూంది...

"ఇది నీ పక్క ..." అన్నాను. బిందూ బరువుకి స్ప్రింగ్ కాట్ కిందికి దిగింది. బెడ్ లైట్ ఆన్ చేసి నేనూ పక్కమీద వాలాను.

అకస్మాత్తుగా మెలుకువ వచ్చింది. ఆరయింది. కొద్దిగా వెలుతురు లోపలికి పదుతూంది. అప్రయత్నంగా ప్రక్కకి తిరిగి చూశాను. బిందూ లేదు పక్కమీద.

ఒక్క గెంతులో దిగాను క్రిందికి గేటు దగ్గిర మాలితో వాదిస్తూంది బిందూ. నా దగ్గిరకు తీసుకొని రావటం కోసం తన చేయి పట్టుకొని లాగుతున్నాడు మాలీ.

మాలీ ని వెళ్ళిపొమ్మని బిందూ చెయ్యి పట్టుకొన్నాను. ఒక్క నిమిషం పాటు తన కళ్ళల్లోకి తదేకంగా చూస్తూ ఉండిపోయాను. ఒక్కసారి నా కళ్ళలోకి చూసి తల వెంటనే దించేసుకొంది!

నేను ఓడిపోయాను !

"వెళ్ళి పోతావా?" అడిగేను. తల ఊపింది.

"ఏం ఇక్కడ నచ్చలేదా?" నాలో కోపం రాజు కొంటూంది. తను ఓడిపోతున్నానని తెలినప్పుడు మనిషికి ముందు కలిగేది కోపం, తర్వాత నిస్పృహ.

"చెప్పు ...!" నా కంఠం నాకే వికృతంగా వినిపించింది.

"మరి ..." ఏదో అస్పష్టంగా అంది బిందూ!

"ఏం? ఆ రాకాని వదిలి ఉండలేవా? రాకా నీకేమవుతాడనీ? ఇంత పెద్ద ఇల్లు .. ఈ తోట .. వీటిని వదిలేసి ... ఆ వెధవ ... నిన్నెత్తుకొచ్చి పెంచుతున్న ఆ రాకా దగ్గిర ఏముందనీ ..." ఆ కోపంలో నేను ఏం మాట్లాడుతున్నానో నాకే తెలియటం లేదు.

బిందూ మాట్లాడలేదు.

ఒక్క క్షణం నిశ్శబ్దం! తన చెయ్యి వదిలేశాను.

"వెళ్ళు!" అన్నాను. నా వైపు తల ఎత్తి చూసింది. కదల్లేదు.

"గెటౌట్"

ఇంకో క్షణం నెమ్మదిగా గడిచింది.

రెండు పిడికిళ్ళూ గట్టిగా బిగించి అరిచాను __ "ఐ సే, గెట్"

బిందూ వెళ్ళిపోయింది, నీడలా కదిలి, అస్పష్టంగా కనిపిస్తూ, కనిపించటం మానేసింది.

గదిలోకి వచ్చాను. చాలా ఒంటరిగా ఉంది. ఈ అనుభవం ఒక స్మృతిలా మిగిలిపోతుంది. అంతే!

అదోలా ఉంది యాతన! అందరూ నానుంచి దూరంగా వెళ్ళిపోతున్నారు. నా అంతరంగంతోనే నాకు సత్సంబంధాలు కుదరటం లేదు. నా మనస్సెప్పుడో నా మీద పగ తీర్చుకొంటుంది.

ఈ ఆలోచనలు తెగటం లేదు.

అప్రయత్నంగా హెలెన్ నెంబర్ డయల్ చేశాను.

"హల్లో ..." అన్నాను. "యస్ ... హల్లో..." అవతలివైపునుంచి మగ గొంతు వినిపించింది. ఉలిక్కిపడ్డాను. ఆ రోజు వెన్నెలలో నాకు హెలెన్ చేసిన వాగ్దానం జ్ఞాపకం వచ్చింది.

ఇంత పొద్దున్నే హెలెన్ ఇంట్లో ... ఎందుకో మనస్సు సరిపెట్టుకో బుద్ధివేయలేదు.

"బాస్టర్డ్ ... వా డ్డూ యూ వాంట్ ... ?"

రాత్రి పుచ్చుకొన్న మందు మత్తు ఇంకా వదల్లేదు గొంతులో ... నా పిడికిలి మూసుకొంది. అంతలోనే హెలెన్ అతని చేతుల్లోంచి రిసీవర్ తీసుకొన్న ధ్వని వినిపించింది. అంతలో ఆమె గొంతు ... "హల్లో"

నే మాట్లాడలేదు ... ఫోన్ పెట్టేశాను ...

నాకు కోపం రాలేదు ... భయం వేసింది. తను ఊహించినదంతా ఒక్కసారి ఎదురు తిరిగితే కలిగేది భయం. మాలతి ఒంటి చేత్తో తడుముకొంటూ, నన్ను చేరేటప్పుడు కూడా ఇలానే భయం వేసేది.

కసిగా ఉంది హెలెన్ మీద ? బిందూ మీదా ?

బిందూ, మమత అనురాగం ఎలాటివో ఎంత బలంగా ఉంటాయో తనకు సర్వస్వం అర్పించిన పూవుని వదిలి ఇంకో అందమైన పుష్పాన్ని చేరే తుమ్మెదకీ, మనిషికీ భేదం ఏమిటో ఊహించుకోవటానికి దారి చూపింది.

బిందూ కోసం రాత్రి అంతా ఎదురు చూసి ఉంటాడు రాకా... తన అవసరం నిజంగా ఎవరికుందో వాళ్ళ కోసం వెళ్ళిపోయింది.

మరి నాకోసం మాలతి ? ...

ఈ ఆలోచన వచ్చేసరికి ఉలిక్కిపడ్డాను.

హెలెన్ ఫోటోలో నవ్వుతూంది. ఆ కళ్ళ వెనక ఎన్ని రహస్యాలు! మాలతి కళ్ళ వెనక ఎంత ముగ్ధత్వం!

తన అనురాగంతో నాకోసం స్వర్గాన్ని సృష్టించి ... తన సర్వస్వాన్ని నాకు అర్పించి .. నా కౌగిలిలో పూవులా ఒదిగిపోతూ ... నా కళ్ళతోనే ప్రపంచాన్ని చూద్దామనుకొన్న మాలతి ... కానీ ... కానీ ... నేను చేసిందేమిటి? నిర్లక్ష్యంగా ... నిర్దాక్షిణ్యంగా ...

"ఛా" నా మీద నాకే అసహ్యం వేస్తూంది.

బిందూ వెళ్ళిపోయింది ... మరి నేను ?

టాంక్ లో పెట్రోలు ఉందో లేదో చూడటానికి లేచాను . . . .

జీవితం ఇండెక్స్ లేని బైండ్ బుక్కు. జాగ్రత్తగా చూస్తే కావలసిన పదాలు వేర్వేరు పుటల్లో దొరక్కపోవు! చేయవలసిందల్లా వాటిని సమన్వయించు కోవడమే!

# నీకు..

## (ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, మార్చి 7, 1979 సంచికనుంచి)



ప్రభా...

దయచేసి దీన్ని చింపివెయ్యకు. నామీద దయవుంచి దీన్ని పూర్తిగా చదువు. ఒకసారి పైనుంచి కిందికి చూసేసి 'ఏమిటీ సొద' అని ఉండచుట్టి నీ ఆఫీసు అయిదో అంతస్థునుంచి విసిరెయ్యకేం.

నీ రూమ్ బైటనున్న విజిటర్స్ నీ, నిముషానికొకసారి మోగే నీ టెలిఫోన్ నీ కొద్దిగా పక్కకు పెట్టి దీన్ని శ్రద్ధగా చదువు. నాకు వ్రాయటంగానీ, మనసులో మాట విపులంగా చెప్పటంగానీ రాదు. ఈ 'సరీగా చెప్పలేక పోవటమే' గా మన మధ్య దూరాన్ని పెంచింది. మన మధ్య దూరం ఏమిటి అని ఆశ్చర్యపోకు ప్రభా. ఉంది. కొద్దికొద్దిగా.. కొద్దికొద్దిగా ఇది పెరిగింది ఈ రాత్రి దీన్ని బ్రద్దలు కొట్టాలనే నిశ్చయించుకొన్నాను.

ప్రభా.. ఎన్నో విషయాలు ఎప్పటికప్పుడు చెప్పాలని అనుకొని కూడా చెప్పలేక పోతూ ఉంటాను. అయినా ఈ విషయాలన్నీ ఎలా చెప్పటం? కొంచెం భయం, కొంచెం సిగ్గు కూడా వేస్తుంది. అందులో నువ్వు ! ఏదైనా మాట్లాడబోతే తలతిప్పి ఒక్క క్షణం సూటిగా 'ఇది జీవితం అనే బిజినెస్ లో పనికి వచ్చే మాటేనా' అన్నట్టు చూస్తావు. అంతే ! ఇక నోటి వెంట మాటరాదు. అందుకే యీ నిశ్శబ్దపు అర్ధరాత్రి యిలా ఒంటరిగా కూర్చొని ఇది వ్రాస్తున్నాను. అంత నిశ్శబ్దంగానూ దీన్ని నీ బ్రౌవును కోటు జేబులో పెట్టేస్తాను. నీ టైం టేబిల్ ప్రకారం మంగళవారం నువ్వు తొడుక్కొనేది బ్రౌవును కోటేగా.

క్షమించు ప్రభా, నీ విలువైన సమయాన్ని వృధా చేస్తున్నాను. ఎన్నో చెప్పాలి. ఎలా మొదలు పెట్టాలో అర్థం కావడం లేదు. అసలు ఈ చెప్పాలనుకొన్నవి కొత్త సంగతులేమీ కావు. మనిద్దరికీ తెలిసినవే, కానీ వాటి గురించి ఒకసారయినా నువ్వు ఆలోచిస్తావా అని నా అనుమానం అయినా నా గురించి ఆలోచించడానికి నీ టైంటేబిల్ లో సమయం కేటాయింపబడ లేదుగా.

లైఫ్ ని చాలా మామూలుగా తీసుకుంటావు నువ్వు. ఏదో పుట్టినందుకు కొన్ని పనులు చెయ్యాలి కాబట్టి రొటీన్ గా చేసుకుపోతావు. ఆ చేసే దానికి ఓ ఫీలింగ్ అనేది ఉండదు అదే నాకు బాధగా ఉంటుంది.

నీకు తెలీదు కానీ, నేను ఒక్కదాన్నీ చేసుకునే ప్రార్థనలో నీ గురించి ఏం చేస్తానో తెలీదు కదూ "దేవా, నేనంటే నా భర్తకు కొద్దిగా ప్రేమా, కొంచెం దయా, జాలి, అనురాగం అనేవి పుట్టించు. ఈ ఇంట్లో నేను అనేదాన్ని ఒకదాన్ని ఉన్నానని గుర్తింపు కలిగించు" అని ప్రార్థిస్తూ ఉంటాను.

నీకిదంతా ఆశ్చర్యంగా ఉంటుంది. 'ఇప్పుడు నువ్వేం కష్టపడుతున్నావ్?' అని అడుగుతావ్ కష్టమంటే పెద్ద కష్టమేమీ లేదు. ఈ ఏమీ లేకపోవటమే నన్ను బాధిస్తుంది. ఎప్పుడూనూ. ఏదో సంపాదించుకోవటం, తినటం, పడుకోవటం అయిపోయింది. నాకు పిల్లలు. నీకు ఆఫీసు.. అంతే.

నేను ఎంతగా ఎదురు చూస్తానో తెలుసా ప్రభా. ఇంటి చాకిరీతో అలసిపోయి నీక్కనిపించినప్పుడు దగ్గరకు తీసుకుని ఒక్కమాట అంటావేమోనని ఎంతో ఎదురు చూస్తాను. దినం అంతటిలో ఒక్క క్షణం ఎక్కువసేపు కాదు. ఒక్క క్షణం ప్రేమతో చూస్తావని ఆశపడతాను కానీ నువ్వు నా అలసటని గుర్తించవు. ఇల్లు సర్దుకోవటం నా బాధ్యత. ఆఫీసు కెళ్ళటం నీ బాధ్యత. ఇద్దరం మన పనులు ఎంత క్యాజువల్ గా చేసుకుపోతున్నామో ఇన్ని సంవత్సరాలలో ఎప్పుడైనా గుర్తించావా? గుర్తించవు ! బైట ఎన్నో పనులు నీకు. అసలు నీకా ధ్యాసే ఉండదు. షేవింగ్ క్రీమూ, న్యూస్ పేపరూ, రాత్రి డిన్నర్ లోకి సూపూ, కళ్ళజోడూ, భార్యా అంతా ఒకే వరుసలో ఉంటాం.

ప్రొద్దున్నే ఆఫీసుకు వెళ్తూ, గుమ్మం వరకూ సాగనంపటానికి వచ్చినదాన్ని ఒకసారి దగ్గరకు తీసుకొన్నా వెళ్తూవెళ్తూ తిరిగి నా వైపు చూసి నవ్వినా ఇక మళ్ళీ నువ్వు తిరిగి వచ్చేవరకూ ఎంత సంతృప్తిగా ఉంటుందో! నువ్వేమో హడావుడిగా వెళ్ళిపోతావ్. నాకేమో అంతా రొటీన్, రొటీన్, రొటీన్.

ఈ విషయమే ఎప్పుడైనా ప్రస్తావిస్తే "ఆ ఏముంది అందులో?" అంటావు. ఏమీలేక పోతే మరి రోజు పెళ్ళయిన కొత్తలో ఎందుకు ఎప్పుడూ ఆ ఒంటరితనం కోసమే ఎదురుచూసే వాడివి. నేను ఏ మాత్రం ఒక్క అడుగు వెనక్కి వేసినా ఎందుకు నీకంత కోపం విసుగూ వచ్చేవి ? దీనికి నువ్విచ్చే సమాధానం " నా ఆవేశాన్ని వేడినీ పాడుచేసింది నువ్వే" అని. మరి దానికి నా సమాధానం చెబుతాను విను.

ప్రభా, ఇవన్నీ చెప్పుకుంటున్నందుకు నన్ను బొత్తిగా సిగ్గులేని దాన్నిగా అనుకొంటున్నావా ? అయినా నా సంగతులు నీకు గాక ఇంకెవరికి చెప్పుకోను ?

మన పెళ్ళయిన కొత్త జ్ఞాపకం ఉందా ప్రభా, నీలో ఎంత ఆవేశం ఉండేదో. నాకైతే ఏమీ తెలీదు. ముద్దు పెట్టుకుంటే పిల్లలు పుడతారని చిన్నప్పుడెప్పుడో బామ్మ చెప్పిన మాట తప్ప. అదే అనుకొనేదాన్ని. కడుపు చీల్చి కుట్టటం గురించి, పిల్లలు పుట్టడం గురించీ ఎంత భయపడేదాన్నో.

ప్రేమని ప్రకటించడం సరీగ్గా రాకపోవటం నా తప్పా ప్రభా? ముద్దు పెట్టుకుంటున్నప్పుడు మెడచుట్టూ చేతులు వెయ్యాలన్న సంగతి పెళ్ళయిన రెండు నెలలవరకూ నేను గుర్తించలేదే అనుకో మామూలుగానే నిలబడి ఉండి పోయానే అనుకో, అదేమంత తప్పని? మొదటి రోజు నీ కళ్ళలో కనపడిన అసంతృప్తి ఇన్నేళ్ళయినా ఇంకా నాకు జ్ఞాపకం ఉంది. నిజం చెప్పొద్దూ. ఆ రోజు నువ్వు ఒక్కో అడుగూ ముందు వస్తూంటే ఎవరో పెద్ద రాక్షసుడు మీదకొస్తున్నట్టు భయం వేసింది. (ప్రేమెక్కడా? అంతా భయమే) కళ్ళు గట్టిగా మూసుకున్నాను. వళ్ళంతా చల్లగా అయిపోయింది. అలాటి దాని దగ్గర్నుంచి నువ్వేం 'ఎక్స్ పెక్ట్' చేస్తావు ప్రభా! దానికి తోడు నీ తొందరపాటు నిజంగా ఆ నెలరోజులూ ఎంత నరకం అనుభవించేనో... నాలో ఏదో తప్పుందేమో అన్న భయం. అందరిలాటి ఆడదాన్ని కాదేమో అన్న అనుమానం... ఏమీ తెలియక పోవడం ఎంత బాధాకరం !

ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం.

పెళ్ళయిన నెల రోజులకు !

కిన్నెరసాని పక్క గెస్ట్ హౌస్ లో అద్దాల గదిలో వెన్నెల నిండుగా లోపలికి పడ్తూన్న సమయాన పెద్ద పెద్ద చెట్ల నీడలు నిశ్శబ్దంగా మనని గమనిస్తూన్న సమయాన. చంద్రుడి తాలూకు కిరణం అద్దాల కిటికీలోంచి పక్కమీద ఎర్రగా విశ్లేషించిన సమయాన. జ్ఞాపకం ఉందా ప్రభా?

ఏదో గొప్ప విజయం సాధించిన వాడిలా నువ్వు హాయిగా పడుకొన్నావు. ఎందుకో తెలీదుగానీ, ఎంత ఏడుపొచ్చిందనీ! ఏడ్చీఏడ్చీ సొమ్మసిల్లి పడుకొన్నాను. నన్ను వోదార్చాలన్న ధ్యాసే నీకు లేకపోయింది. హాయిగా నిద్రపోయావు మళ్ళీ తరువాత ఒక గంటకి మెలకువ వచ్చింది. నువ్వేమో వెల్లకిలా పడుకొని నిద్ర పోతున్నావు (నవ్వకు) లాగ్ మొద్దులా. చాలా సేపు నిన్ను చూస్తూ కూర్చున్నాను. అరణ్యంలా రొమ్ముల మీద పెరిగిన జుట్టు అక్కడ తలపెట్టి పడుకొని కళ్ళెత్తి చూస్తే మొనదేలిన గడ్డం, ముదురైన చెంపలు, నెమ్మదిగా ముందుకు జరిగి నీకు నిద్రాభంగం కలిగించకుండా ముద్దుపెట్టుకున్నాను. అదే ప్రభా మొదటి సారి నా అంతట నేను నిన్ను ముద్దు పెట్టుకోవటం. ఆరోజు, తారీఖూ, సమయం అన్నీ నాకు గుర్తే. మన ఈ నిస్సారమైన జీవితంలో కొద్దిగా సంతోషం కలిగించేవి అలాంటి (చాలా కొద్ది) మధుర క్షణాలే.

ఆ రోజుల గురించి ఇప్పటికీ నన్నేడిపిస్తూ వుంటావు. చెప్పు ప్రభా. అదేమీ లేకుండా, మొదటి రోజే నేను చాలా అనుభవంతో నిన్ను సంతృప్తి పరిచి ఉంటే నువ్వు సంతోషించి ఉండేవాడివా? ఇప్పటి ఈక్యాజువల్ నెస్ లేకుండా ఉండేదా. ఈ నెమ్మది నెమ్మదిగా దగ్గరికి రావడం నీకు ఇష్టం లేకపోయిందా ?

నా పట్ల నీకు ఆసక్తి లేకపోవటాన్ని నెమ్మది నెమ్మదిగా ప్రదర్శిస్తూ వస్తున్నావు. అంటే నీకు వేరే ఇంకో స్త్రీతో సంబంధం ఉందని గానీ, లేక ఏ వ్యసనానికో అలవాటు పడ్డావని గానీ నిందవెయ్యటం లేదు. నేను. కానీ జాగ్రత్తగా గమనిస్తే మనింట్లో ఒక రకమైన నిశ్శబ్దం. శ్మాశానాల్లో వినిపించేది ఇక్కడా తాండవిస్తున్నట్టు అనిపించడం లేదూ... నిర్లిప్తంగా ఎవరి పని వారు చేసుకుంటూ పోవటం... మొదట్లో నువ్వెంత హుషారుగా ఉండేవాడివి నా పట్ల !

ఏం చెయ్యను ప్రభా. అప్పటికి నా మైండ్ అంత మెచూర్ కాలేదు. నా వయసెంతని అప్పుడు? పద్దెనిమిది. నువ్వు పదే పదే కోరుకోవడాన్ని వద్దనేదాన్ని. నిన్ను ప్రేరేపించాల్సినంత హుషారు నాకు లేకపోయింది ఆ రోజుల్లో.

నేనెప్పుడైతే మేల్కొని నువ్వున్న స్టేజ్ లోకి వచ్చేనో, దురదృష్టం కొద్దీ నువ్వా స్టేజి దాటి ముందుకు వెళ్ళిపోయావు. ఇల్లూ నేనూ మామూలై పోయాం. కానీ ఆనాడు నీలో ఎంత వేడి ఉండేదో ఇప్పుడు నాకూ ... (అదిగో నవ్వుతున్నావ్ కదూ ప్లీజు నవ్వకు) నిన్ను ఊరికే చూడాలనీ నిన్ను తాకాలని ఒకోసారి ఎంత పిచ్చి కోర్కె పుడుతుందో. అప్పట్లో నా తాలూకు ఏ చిన్న విషయమైనా నిన్నెలా కదిలించేదో ఇప్పుడు నాకు అర్థమవుతూంది. నాయీ చిన్ని ప్రపంచంలో నువ్వు తప్ప ఇంకెవరున్నారు ? నీ సంగతి వేరు. నీకెన్నో వ్యాపకాలు.

నీ వైపు నుంచి సమర్థించుకోవడానికి చాలా ఉండొచ్చు. కానీ ప్రభా.. ఈ పరస్పర నిందలూ సమర్థించు కోవటాలు వద్దు. ఇద్దరం ఆలోచిద్దాం ఇన్ని కొద్ది సంవత్సరాల్లోనే ఒకరికొకరం సాధారణ వస్తువులమై పోయామా? మనిద్దరం రాత్రిపూట కలుసుకోవటానికి సాయపడే సత్రం తప్ప ఇంకేమీ కాదా ఈ ఇల్లు. ఇదంతా వ్రాసినందుకు నామీద కోపం తెచ్చుకోకు ప్రభా. ఇప్పుడు నువ్వు నన్ను సంతృప్తి పరచడం లేదని నేనననను. కానీ కొంచెం ప్రేమగా, ఇంకొంచెం సరదాగా, కొంచం దయగా చాలు. ఇంతకన్నా నాకేమీ వద్దు. నన్ను మాటి మాటికీ తీసి పడెయ్యకుండా నన్ను అర్థం చేసుకుంటూ నా ఫీలింగ్స్ ను కొద్దిగా గౌరవిస్తూ అంతే! అంతకన్నా నేనేమీ ఎక్కువ కోరుకోను.

ప్రభా !

పెళ్ళయిన పది సంవత్సరాల తర్వాత నేను నీకు వ్రాస్తూన్న ఈ మొదటి ఉత్తరంలో నేను నీకు చెప్పగలిగేది ఒకటే అర్థం చేసుకొంటావా? జీవితాన్ని ఎప్పటికప్పుడు ఫ్రెష్ గా మొదలు పెట్టడం. అది అలా జరిగి పోతూనే ఉంటుంది. ఇంతకన్నా ఇంకేం విడమర్చి ఏం చెప్పను?

ముడతలు పడ్డ కాగితాన్ని సాఫీ చేసి, చదివి ఇచ్చేస్తూ, "ఎక్కడ దొరికిందిది నీకు?" అని అడిగేడు రామ్మూర్తి.

"ఆఫీసు నుంచి బైటకొస్తుంటే పైనుంచి ఉండ చుట్టి విసిరేసేరెవరో. చాలా రోజుల క్రిందట" అన్నాను. చాలా టచింగా ఉంది ఆ ఉత్తరం. అందుకే దాచేను.

"ఆ ప్రభ ఎవడో ఇడియట్ లా ఉన్నాడు" అన్నాడు.

నేను మాట్లాడలేదు.

ఇద్దరం ఇంటివైపు నడవటం ప్రారంభించేం. సాయంత్రం సిటీ బస్సుల కోసం ఎదురు చూడడం కన్నా నడకే మంచిది.

రెండు కిలో మీటర్లు నడవడానికి గంటపట్టింది. బాగా చీకటి పడింది.

ఎప్పుడూ మాట్లాడుతూ ఉండే రామ్మూర్తి కొంచం మూడీగా, ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు అంతసేపూ. ఇళ్ళకి విడిపోయే టైం వచ్చినప్పుడు, ఎంతో స్ట్రగుల్ పడి, చెప్పాలనే నిర్ణయానికి వచ్చిన వాడిలా, "కొంచెం ఆలోచిస్తే మా ఆవిడా ఇదే అభిప్రాయంలో ఉన్నట్టు ఉందోయ్" అన్నాడు. అస్పష్టమైన చీకటి నీడల్లో అతడి మొహం వాడిపోయి ఉంది. కొంచెం కాన్ఫ్లిక్టు. కొంచెం ఘర్షణ.

నేనేం మాట్లాడలేదు.

"గుడ్ నైట్" అన్చెప్పి అతను వెళ్ళిపోయాడు...

నే నలాగే నిలబడి ఉన్నాను.

నేనూ అలాగే...

.... అందుకేగా దాచి ఉంచింది.

# డప్పు..

## (జ్యోతి మాసపత్రిక నవంబర్ 1979 సంచిక నుంచి)




డప్పేశ్వర్రావు మా సెక్షన్లో పనిచేస్తున్నాడనీ, నా కిందేననీ తెలియటంతో పొంగిపోయాను. డప్పు వాయించేవాళ్ళంటే నేను చెవి తెగ్గోసుకుంటాను వేళ్ళతోనూ, అరిచేత్తోనూ శృతి బద్ధంగా వాయిస్తూంటే వినటానికి ఎంత సొంపుగా ఉంటుందో..!. అసలు డప్పు వాయించటం అనేది అన్నిటికన్నా ఉత్తమోత్తమమైన కళ అని నా ఉద్దేశ్యం. అంత గొప్ప కళాకారుడు నా సెక్షన్ లో ఉన్నందుకు యెంతో గర్వించి, వెంటనే నాల్గు ఇంక్రిమెంట్లు జారీ చెయ్యవలసిందిగా నా పై అధికారులకి విన్నవించుకున్నాను. నా సిఫార్సుని అంగీకరించి పైవాళ్ళు సదరు ఇంక్రిమెంట్లు జారీచేసేరు.

కళకి తగిన గుర్తింపు లభించినందుకు నేను మహదానందం చెంది, డప్పేశ్వర్రావుని నా గదిలోకి పిల్చి అతనికి ఇచ్చిన ఇంక్రిమెంట్ల సంగతి చెప్పేను. అతడు కూడా అమితానందం చెందినవాడై నా గదిలోనే నా బల్లమీద కొద్ది సేపు డప్పు వాయించి వెళ్ళిపోయేడు. మొత్తం మా సెక్షన్ లో పనిచేసేది ఆరుగురు. అందులో ఆరుగురి పెట్టు పని చేసేది రమణరావు వొక్కడే. ముగ్గురు కొంచెం అటూ యిటూగా పర్లేదు. జోగేశ్వర్రావు మాత్రం ఊహూ. అసలు పెన్ తియ్యడు. ఇక మిగిలింది డప్పేశ్వర్రావు. అంతటి కళాజీవిని పనిచెయ్యమని అడగడమే? కళ్లుపోతాయి.

డప్పేశ్వర్రావు బైటకెళ్ళిన అరగంటకి మిగతా ముగ్గురూ లోపలికి వచ్చేరు. అతడిచ్చిన టీపార్టీ ఆరగించి వచ్చినట్టున్నారు. కిళ్ళీలు బిగించేరు. ముగ్గుర్నీ సాదరంగా కూర్చోబెట్టేను.

"మీకు డప్పు అంటే చాలా ఇష్టంలా ఉందే" అన్నాడు వాళ్ళలో ఒకరు.

"చాలా యిష్టం. అసలు డప్పుని భారతదేశపు ప్రధాన వాద్యంగా పెట్టాలి" అన్నాను కొంచెం ఆవేశంతో.

అది తమకి రాకపోవడంతో తమ దురదృష్టం అన్నారు వాళ్ళు.

వాళ్ళ వైపు జాలిగా చూసేను.

"సార్" అన్నాడు వాళ్ళలో ఒకడు. "మీరు డప్పు వాయించేవాళ్ళని ఇంత ప్రోత్సాహించడం మా అదృష్టం. కళలకి స్థానం లేకుండా పోతున్న పవిత్ర భారత దేశంలో మీలాంటి వాళ్ళున్నారంటే అది మేం చేసుకున్న పుణ్యం".

వాళ్ళిలా డప్పు వాయించడం మొదలు పెట్టేసరికి పొంగిపోయాను.

"నాయిన్లారా మీకేం కావాలి?" అని అడిగేను ఆప్యాయంగా.

"మేము డప్పు నేర్చుకోవాలనుకుంటున్నాం. నేర్చుకుని మీకు పేరు తెస్తాం. ప్రతీరోజూ మూడు గంటలకి వెళ్ళిపోయి డప్పు వాయించడం ప్రాక్టీసు చేసుకోవటానికి పర్మిషన్ ఇవ్వండి సార్" అన్నారు ముక్తకంఠంతో.

సరేనని పర్మిషన్ ఇచ్చేసేను.

వాళ్ళ మొహాలు డప్పంత అయినయ్.

ఆ మరుసటి రోజునుంచీ పని మానేసి అందరూ డప్పు వాయించటం మొదలుపెట్టేరు. వినటానికి ఎంతో బావుండేది. వేళ్ళతో వాయించేది, సుతారంగా వాయించేది, వాడికన్నా బాగా వీడు వాయించేది, వీడికన్నా బాగా వాడు వాయించేది..! అప్పుడప్పుడూ ఇద్దరు ముగ్గురు నా చుట్టూ చేరి కలిసి వాయించేవారు. ఒకోసారి ఒక్కొక్కడూ సెపరేట్‌గా వచ్చి వాయించేవారు.

మూడు గంటలకి సీట్లు కట్టేసి ప్రాక్టీసుకు వెళ్ళిపోయేవాళ్ళు. వారానికొకసారి కచేరీల కోసం మూడు రోజులు డ్యూటీ లీవ్ పెట్టి వెళ్ళేవాళ్ళు.

నా ఆర్గనైజేషన్ కి వచ్చే నష్టాన్ని లెఖ్ఖచేయకుండా డప్పు వాద్యగాళ్ళని ప్రోత్సహిస్తున్నందుకు నాకు మంచి పేరొచ్చింది

రోజులు అన్నీ ఒకేలా గడవవు కదా. ఆ రోజు జోగేశ్వర్రావు రెండు నెలల శలవు పూర్తిచేసుకుని వచ్చి జాయినయ్యేడు. అరగంట తర్వాత నా దగ్గరకొచ్చేడు. నా టేబుల్ మీద ఒక సర్టిఫికెట్టు పడేసేడు.

"ఏమిటిది?" అని అడిగేను.

"కెప్టెన్‌ని" అన్నాడు.

"దేనికి?"

"బురదగుంట గోటీబిళ్ళ అసోసియేషన్‌కి నేనే కెప్టెన్‌ని" అన్నాడు స్టయిల్‌గా.

"అయితే ఏమిటట?" అన్నాను.

"ప్రమోషనూ-ప్రతీరోజూ వన్ అవర్ పర్మిషనూ" అన్నాడు.

నాకర్థం కాలేదు. "ప్రమోషన్ ఏమిటి?" అన్నాను.

"డప్పేశ్వర్రావుకి ఇంక్రిమెంట్లెందుకిచ్చారో నాకు ప్రమోషన్ దానికే" అన్నాడు.

అతడి అజ్ఞానానికి నవ్వేను. "చూడు జోగేశ్వర్ - డప్పేశ్వర్రావు అంటే అఖిల భారతదేశమూ గర్వించదగ్గ డప్పు వాద్యగాడు. నువ్వేమో బురదగుంట అసోసియేషన్ గోటీబిళ్ళ కాప్టెన్‌వి. నీకూ అతడికీ పోలికెక్కడ?"

దానికి అతను అన్నాడు - "డప్పంటే దేశానికి సంబంధించిన వాద్యం. అందుకే అతడు దేశ ఖ్యాతి పొందేడు. మరి గోటీబిళ్ళ, రాష్ట్రం దాటి వెళ్ళలేదుగా! బస్తీమే సవాల్. మా బురద గుంట గోటీబిళ్ళ అసోసియేషన్‌తో ఎవరైనా సరే పోటీకి రండి".

ఆవేశం వస్తే అతడు మనిషి కాడని తెలిసి అనునయించి, "నీ గోటీబిళ్ళవల్ల దేశానికి లాభం ఏమిటోయ్ ?"అని అడిగాను.

"డప్పువల్ల మాత్రం ఏముందండీ?" అని ఎదురు ప్రశ్న వేసేడు.

'ఓరి వెధవాయ్. నాకే ఎదురు సమాధానం చెప్తావా? నీ కాన్‌ఫిడెన్షియల్ రిపోర్టు రానీ నీ పని చెప్తాను' అని మనసులో అనుకొని, పైకిమాత్రం "చూడవోయ్ జోగేశ్వర్రావ్. మంచి డప్పు వాద్యగాడు వాయిస్తూ ఉంటే-వేల వేల మంది గంటల తరబడి అలా...అలా.... మైమరచి వింటూ ఉండిపోతారు తెలుసా?" అన్నాను.

"అది మరీ నేషనల్ వేస్టుకదా" అన్నాడు.

నాక్కోపం వచ్చింది. "ఆ మాట కొస్తే గోటే బిళ్ళ కూడా నేషనల్ వేస్టే. నువ్వెన్నయినా చెప్పు. కేవలం గోటీబిళ్ళ కెప్టెన్‌వి అయినందుకు నీకు ప్రమోషన్ యివ్వలేను" అన్నాను.

"అయితే స్ట్రయిక్ మొదలెడుతున్నా"నన్నాడు.

ఉలిక్కిపడ్డాను. జోగేశ్వరరావుకి యూనియన్‌లో పలుకుబడి వుంది. మొహం మీద నవ్వు పులిమేసుకొని "ఇంతదానికి స్ట్రయిక్ ఎందుకోయ్. నీ సంగతి నాకు వదిలిపెట్టు" అన్నాను. దాని అర్థం గ్రహించి అతడు సంతృప్తిగా వెళ్ళిపోయేడు. నెల రోజుల్లో అతడికి ప్రమోషనొచ్చింది. ఇద్దరికి ప్రమోషన్ ఇవ్వాలంటే సీనియారిటీ ప్రకారం ఇంకో ఇద్దరికి ఇవ్వాలి కాబట్టి రంగారావుకి, అప్పారావుకి ప్రమోషన్లివ్వాల్సి వచ్చింది. ప్రతి ఐదు ప్రమోషన్లకీ మరో కాస్ట్ వ్యక్తికి ప్రమోషన్ ఇవ్వాలి వచ్చింది.

మిగిలిన ఒక్కడూ (రమణారావు) వచ్చేడు. నిజానికి మా సెక్షన్‌లో సరిగ్గా పనిచేసేది అతడొక్కడే అని ముందే చెప్పను కదా. "సార్! నా పనిలో ఎక్కడయినా లోపం కనబడుతుందా?" అని అడిగేడు.

"లేదోయ్– సూపర్బ్" అన్నాను.

"మరి నాకు ప్రమోషన్!" అని అర్థించేడు.

"చూడు రమణ్రావ్! మన కోటా ఈ సంవత్సరం ఐదే కదా. ఒకటి డప్పు వాయించే వాడికి, ఇంకొకటి గోటీబిళ్ళ ఆడేవాళ్ళకీ ఇచ్చేంగదా" అన్నాను."...మిగతా ఇద్దరూ సీనియర్స్– ఇంకొకరు రిజర్వేషను కాండేటు."

"మీరలా అంటారనే నేను రిజైన్ చేస్తున్నాను సార్" అని చేతిలో లెటర్ బల్లమీద పెట్టేడు.

ఉలిక్కిపడి "అదేమిటోయ్" అన్నాను.

"రోహిణీకార్తె ఎండ శరీరాన్ని మాడ్చేస్తుంటే సల సల కాగే నూనె ముందు మిట్టమధ్యాహ్నం రావిచెట్టు కింద కూర్చొని మా నాన్న పల్లెటూళ్ళో పుణుకులు అమ్ముకునేవాడు సార్! నలభై సంవత్సరాల్నించీ  పైసా పైసా కూడబెట్టి అర్థాకలితో కడుపు మాడ్చుకొని నన్ను చదివించాడు. రావి చెట్టు ముసలిదైంది. నన్ను చదివిస్తూ చదివిస్తూ మా నాన్న పండుటాకు అయ్యేడు. చదవటం తప్ప ఇంకేమి నేను నేర్చుకోలేదు సార్! నాకు గోటీబిళ్ళ ఆడటం రాదు. డప్పు వాయించటం రాదు. వెనుకబడిన కాస్టువాడినని సర్టిఫికెట్టు సంపాదించటం చేతకాదు. పనిచెయ్యటం తప్ప నాకింకేమీ రాదుసార్. దానికి విలువలేని ఈ వ్యవస్థలో ఇలా ఫైళ్ళ మధ్య బ్రతకటం కన్నా మా పల్లెలో రావిచెట్టు క్రింద నా తండ్రి పక్కనే కూర్చొని పని చేసుకోవడం సంతృప్తిగా వుంటుందని అనుకొంటున్నాను సార్ " అని వెళ్ళిపోయాడు.

బైట మావాళ్ళు వాయిస్తున్న డప్పు వినబడ్తూనే వుంది.

కాని రమణారావు మాటలు అంతకన్నా గట్టిగా గుండెలమీద మోగుతున్నట్టున్నాయి.

# దానం

వ్యాస్‌కి కొద్దిగా మెలకువ వస్తోంది. ఆత్రుతగా ఎవరో మొహంలో మొహం పెట్టి చూస్తూ... 'లేవండి... ఎలా ఉంది..?' అని అడుగుతున్నారు.

ఆ రూపం చాలా అస్పష్టంగా ఉంది. ఆడో మగో తెలీలేదు.. కళ్ళు పూర్తిగా తెరుచుకోలేదు. తలంతా దిమ్ముగా, నెత్తి మీద ఎవరో ఓ యాభై కిలోలు బరువు పెట్టినట్టుగా ఉంది.

"ఏవండీ" అని పిలుస్తూ ఈ సారి అది చాలా మృదువుగా, శ్రావ్యంగా వినిపించింది. ఆ స్వరం ఓ 'స్త్రీ'దని గుర్తించాడు.

కళ్ళు తెరవడానికి మరోసారి ప్రయత్నించాడు. పెద్ద వెలుతురు. భరించలేనట్లు  కనురెప్పలు మూసుకుపోతున్నాయి. అతి కష్టం మీద కుడి చెయ్యి  లేపి కళ్ళకి అడ్డు పెట్టుకున్నాడు.

"నెమ్మదిగా కళ్ళు తెరవండి. నేను కనపడ్తున్నానా?" ఆమె అడిగింది.

ఆ నిమిషంలో ఆమెని చూడాలని అతనికెంతో అనిపించింది కానీ, శరీరం సహకరించడం లేదు! తన స్థితి తనకే అర్థం కావటం లేదు.

సడెన్‌గా కారుకి అడ్డంగా... అది జింకా?... మేకా? ఒళ్ళంతా చుక్కలున్నాయి. దాన్ని తప్పించ బోయాడు. లోయ అంచున కారు... బ్రేక్‌ని ఎంత అదిమిపెట్టినా లాభం లేకపోయింది. ఆ తరువాత ఇంకేమీ తెలీదు. ఒక రోజంతా పడున్నానని అనుకుంటున్నాడు కానీ, ఎంత కాలమో తెలీదు.!

"నాన్న ఎంత కంగారుపడుతున్నారో. నా సెల్‌ఫోన్ ఏదీ?" ఎడమ చెయ్యి కదిలించి కోసం వెతికాడు.

"ఏమిటి వెతుకుతున్నారు?" ఆ చేతి మీద ఒక చల్లటి స్పర్శ. ఇందాకటి మృదువైన స్వరం అడుగుతోంది.

ఏమైతే అయింది కళ్ళు తెరవాలనుకున్నాడు. వెలుతురు పడుతుంటే కళ్ళలో సూదులు పొడుస్తున్నంత బాధగా ఉంది. అయినా మొండిగా తెరిచాడు. ఎదురుగా ఒక అమ్మాయి..! మొదట లీలగా... తర్వాత కొద్ది కొద్దిగా స్పష్టం అవుతూ కనిపిస్తోంది. వెన్నెలంత సౌమ్యంగా ఉంది. ముక్కుకున్న ఒంటిరాయి ముక్కుపుడక మెరుస్తూ కనిపించింది. ఆమె పెదవులు ఒంపు తిరిగి నవ్వుతున్నట్టు ఉన్నాయి. కళ్ళలో చల్లదనం ఉంది. దువ్వుకోకుండా రేగి ఉన్న వెంట్రుకలు నుదుటి మీద పడ్తున్నాయి.

"ఎలా ఉందీ?" ఆమె అడిగింది.

"నాకేమైందీ?" మాట్లాడాడు. గొంతు లోతుల్లోంచి వచ్చిన స్వరం అతడికే సరీగ్గా వినపడ లేదు.

ఆమె మొహంలో ఆనందం. "థాంక్ గాడ్... మీరు మాట్లాడారు... ఇంకేం ఫర్వాలేదు" అంది.

"అసలు... అసలేమైంది? నా కాళ్ళూ... అవీ ఒకేనా?" అంటూ కాళ్ళు కదిపే ప్రయత్నం చేసాడు.

"ఉండండి... కాలికి ప్లాస్టర్ ఉంది"

అతను తడిమి చూసుకుంటూ ఉండగా ఆమె అన్నది. "మీ కాలు మీదున్న కొండ రాయిని తొలగించి తీసుకొచ్చారు. పక్క పట్నం నుంచి అప్పుడప్పుడూ డాక్టర్ పాల్ మా పల్లెకి వస్తాడు. ఆయనే మా కొండదొరకి ప్లాస్టర్ వెయ్యడం నేర్పించారు. అతనొచ్చి వెదురుబొంగు వేసి, స్ట్రెయిట్‌గా పెట్టి ప్లాస్టర్ వేశాడు..."

"అంటే ఫ్రాక్చర్ అయిందా?" ఆత్రుతగా అడిగాడు వ్యాస్.

"తెలీదు. అంబులెన్స్‌కి ఫోన్ చేశాం. మొన్న తుఫానుకి ఏరు పొంగి, దారంతా చెట్లు అడ్డంగా పడి ఉన్నాయి. రెండు రోజులు పడ్తుందన్నారు" అంది.

"మైగాడ్! ఇది అడవా?" లేవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"అలాంటిదే... గిరిజనులుండే కొండప్రాంతం. ఏజెన్సీ ఏరియా. మైనపు వలస... మీ గూగుల్ మేప్ లో ఇదుందని కూడా తెలీదు".

అప్పటికి అతడు కాస్త తేరుకున్నాడు. "మరి మీరెందుకు ఇక్కడున్నారు?" ఆశ్చర్యంగా అడిగాడు.

ఆమె పక్కనే ఉన్న గ్లాసు మీద మూత తీసి, అందులో ద్రవాన్ని అతనికి తాగిస్తూ "మెల్లగా గుటకెయ్యండి... రాగి జావ" అంది.

"మీరు డాక్టరా?" తాగుతూ అడిగాడు.

"టీచర్‌ని".

"ఇక్కడా?"

తనున్న ప్రదేశం అంతా పరిశీలించి చూశాడు. వెదురుతో చేసిన తడకలు. మంచం, పక్కనే నేల మీద చాప, టేబుల్ ఫ్యాన్, ఓ మూలగా టేబుల్ మీద స్టౌ, గిన్నెలూ ఉన్నాయి. ఇంత సింపుల్‌గా ఉన్న ఇంటిని... కాదు 'పాక' ని... అతడు ఎప్పుడూ చూడలేదు!

గిన్నెలోంచి వంచి అతనికి ఆమె ఇంకాస్త జావ తాగించింది. వ్యాస్‌కి ఎంతో శక్తి వచ్చినట్లు అనిపించింది. అప్పటి దాకా కనపడని తల నొప్పి కూడా తెలిసింది. 'అబ్బా' అని నుదుటి మీద చెయ్యి పెట్టుకున్నాడు. చేతికి పెద్ద కట్టు తగిలింది.

అతడు తన బాధ మర్చి పోవటానికా అన్నట్టు ఆమె "నా పేరు శతరూప..." అంటూ ప్రారంభించింది. "ఇక్కడి గిరిజనుల పిల్లలకి చదువు చెప్తున్నాను. 'సహారా' అనే సంస్థ నాకు జీతం ఇస్తుంది. జీతం తక్కువే కానీ ఇక్కడ దొరికే ప్రేమ ఎక్కువ" అంటూ నవ్వింది. "కష్టాలు కూడా కొన్ని ఉన్నాయనుకోండి. ఒక్కోసారి సెల్ ఫోన్ సిగ్నల్స్ కోసం పడిగాపులు పడాల్సొస్తుంది. కరెంట్ కూడా ఎప్పుడు పోతుందో చెప్పలేం"

మనుష్యులకి దూరంగా, ప్రకృతికి దగ్గరగా, గిరిజన పిల్లల అమాయకత్వాన్ని జ్ఞానంగా మార్చాలన్న కోరిక ఆమెకు ఆలంబనగా ఉన్నట్టూ అనిపించింది. పొడవుకు తగ్గ లావుతో, మంచి శరీర దారుఢ్యం ఉన్న అమ్మాయిలా కనిపించింది. కట్టుకున్న చీర నలిగి పోయి ఉంది. విరబోసుకున్న జుట్టు చాలా పొడవుగా ఉంది. మెడలో ఎర్ర పూసల దండ, అదే ఎరుపుతో మొహాన బొట్టూ... ఇవి మాత్రమే ఆమె ఆభరణాలు.

"నా కారు..." అడిగాడు సందేహంగా.

"దొరికినా మీరు వాడలేరు. మీ సెల్‌ఫోన్ కూడా లోయలో ఎక్కడో పడిపోయి ఉంటుంది. రెండు చెట్టు కొమ్మల మధ్య స్పృహ తప్పి ఉన్న మిమ్మల్ని చూసి నన్ను పిలుచుకొచ్చారు. నేను అంబులెన్స్‌కి ఫోన్ చేశా. అది రాదని తెలిసి కొండ దొరకి కబురు పంపి, అతని సహాయంతో మిమ్మల్ని ఇక్కడికి చేర్చాను. డాక్టర్ పాల్ గారు ఎల్లుండి వస్తారు. చాలా ఎఫీషియెంట్. అయినా ఈ మాత్రం మాట్లాడుతున్నారంటే ఇంకేం ఫరవాలేదు! ఇదివరకు ఎవరూ కూడా...." అని ఆగిపోయి "నేను అన్నం వండుతాను" అని లోపలికి వెళ్ళబోయింది.

ఆమె సడెన్‌గా ఆపెయ్యడం గుర్తించి "ఇది వరకు ఇలా చాలామంది...? చా..లా..మంది...? ఏమయ్యారు? చచ్చి పోయారా? ఇక్కడ ఏక్సిడెంట్లు మామూలేనా?" అని అడిగాడు.

"ఈ ప్రాంతంలో చాలా ఏక్సిడెంట్లు జరిగాయి. సాధారణంగా కొండ చుట్టి వెళ్ళాలనుకునే వాళ్ళు, దగ్గర దారని దీన్ని ఎంచుకుంటారు. ఇక్కడ ఏక్సిడెంట్లు అవడం, గిరిజనులు వాళ్ళ శవాలను దగ్గరలోని ఆసుపత్రికి అప్పగించడం పరిపాటే. అవన్నీ ఎందుకు గానీ, ఈపూటకి పచ్చడి అన్నం పెడ్తాను. సరేనా? సరే కాకపోయినా నేనేం చెయ్యలేను" అంటూ నవ్వింది.

"ఏదైనా ఫర్లేదు. మిమ్మల్ని ఇబ్బంది పెడ్తున్నాను. నేను లేవలేను. ఇక్కడ మగవాళ్ళెవరూ లేరు. ఎలా?" ఇబ్బంది పడుతూ సందేహంగా అడిగాడు.

ఆమె "నాకు నర్స్ పని కూడా వచ్చు. ఇక్కడ ట్రైబల్స్ కి జ్వరం వస్తే నేనే" అంటూ నవ్వింది. మాటి మాటికీ నవ్వటం ఆమె అలవాటు అనుకుంటాను. ఆమె మొహానికి అది ఎంతో బావుంది. కొంతమందికే ఆ ఆర్టు పుట్టుకతోనే వస్తుంది.

ఆమె చెయ్యి చూపిస్తున్న వైపు చూస్తే, కుర్చీ కింద బెడ్-పాన్ కనపడింది.

అతను అన్నం తింటూ ఉండగా, 'స్పృహ లో లేనప్పుడు కొండ దోరా యాంటీ సెప్టిక్ టెటనస్, పెయిన్ కిల్లర్ ఇంజెక్షన్స్ ఇచ్చి వెళ్ళాడని' ఆమె చెప్పింది.

అంతలో కరెంట్ పోయింది.

"ఇంక పొద్దుటి దాకా రాదు" అంది.

ఆ గుడిసె పై కప్పు చూస్తుంటే, తన జీవితం 'కెలడోస్కోప్' లో గాజుముక్కల్లా ఒక్కసారిగా చెల్లాచెదురై అంతలోనే కొత్త రూపం సంతరించుకున్నట్లు అనిపించింది.

ఆ రోజుల్లో తన తాత జోగులయ్యగారు ఒక జమిందారు గారి దగ్గర గుమస్తా. ఆ జమిందారు తన వేల ఎకరాల భూమిలో కొంత జీతగాళ్ళకి వ్రాసి ఇచ్చాడు. ఆయన దాతృత్వం గురించి ఆ రోజుల్లో గొప్పగా చెప్పుకునేవారుట. ఆ తరువాత కొన్ని సంవత్సరాలకి ఆయనికి 'పద్మశ్రీ' కూడా వచ్చింది. ఆయన కొడుకు పెద్ద డాక్టరనీ, లండన్ లో చదువుకుని వచ్చినా, తండ్రి గుణాలు పొదివి పుచ్చుకుని అదే పల్లెటూళ్ళో ఆస్పత్రి కట్టి పేదలకి సేవ చేస్తున్నాడనీ... అంత వరకే తెలుసు.

ఆయన దగ్గర పనిచేసిన తన తాత విషయానికి వస్తే, తన వంతుగా వచ్చిన భూమిని అమ్మి ఆయన కాఫీ తోటల్లో పెట్టుబడి పెట్టాడట. దశ తిరిగింది. ప్రస్తుతం ఆయన కొడుకే 'కాఫీ కింగ్' అని పిలవబడే పృథ్విరాజ్. ఆ రాజు కొడుకు తాను..! కోరుకోవాలే కానీ కొండ మీద కోతినే కాదు, కొండనే కొనెయ్యగల తండ్రున్నవాడు... ఫిజికల్‌గా ఎంతో ఫిట్‌గా ఉండే కారు రేసర్...

రేపో మాపో తండ్రి 'వ్యాస్ అండ్ కో' కాఫీ కంపెనీకి  తాను ఎం.డి. కాబోతున్నాడు.

ఆ సందర్భంగా "డ్రమ్ముల కొద్దీ మందు... రేవ్ పార్టీ... డాన్సులు... బాంబే నుంచి డాన్సర్లు.. మీ కాఫీ ఎస్టేట్స్‌లో పిక్నిక్ వెయ్యవా?" అన్న ఫ్రెండ్స్ కోరిక మీద, ముందు ఏర్పాట్లు చూడటానికి బయల్దేరాడు. 'మన కాఫీ తోటలు చూసొస్తా డాడీ' అని బయల్దేరడం, కార్ విండో లోంచి లోపలికి వంగి 'జాగ్రత్త నాన్నా' అని తండ్రి అనడం 'వ్యాస్‌తో పోటీ పడి కార్ డ్రైవ్ చేసేవాడు ఎక్కడా ఉండడు నాన్నా. భయపడకు...' అని మనసులో అనుకుని బయల్దేరటం... డ్రైవర్‌ని తీసుకెళ్లటం నామోషీగా ఫీల్ అయి, తన డ్రైవింగ్ మీద అపారమైన విశ్వాసంతో కొండలతో పందెం కట్టి,  రేసుగుర్రంలా కారు నడిపించటం.... ఫలితంగా ఈ ఆక్సిడెంట్...

ఈ పాఠం నేర్పింది ఎవరు? విధా? భగవంతుడా? రెండూ ఒకటేనా?

ఇక్కడ తను 'శతరూప'కే ఎందుకు కనిపించాడు. ఆమెని ఆ దేవుడే  పంపాడా?

డాడీ ఏం చేస్తూ ఉండి ఉంటారు? తన కోసం ఏ హెలికాప్టర్‌లోనో  వెతుకుతూ ఉండి ఉంటారా?

అతడు తల తిప్పి చూసాడు. క్రింద చాప మీద పక్కకి తిరిగి పడుకునుంది.

గూట్లో పెట్టిన లాంతరు నీడ ఆమె మీద పొడుగ్గా పడ్తోంది. శతరూప అందగత్తె అని చెప్పలేం. ముఖ్యంగా... ఆమెలో ఏదో తెలియని ప్రశాంతత ఉంది. ఈ వయసులో అందరికీ దూరంగా ఒంటరిగా ఇంత నిర్భయంగా ఎందుకుంటోంది? పెళ్ళయిందా?

చాలా బీదదానిలా ఉంది. అవును. లేక పోతే అంత తక్కువ జీతానికి ఈ కారడవిలో ఎందుకు పని చేస్తుంది? ఏమైతేనేం? తన ప్రాణం కాపాడింది. ఆశ్రయం ఇచ్చింది. సేవలు చేసింది.

రేపు డాడీకి తను ఎక్కడున్నానో తెలిసి తీసుకెళ్ళడానికి వస్తారు. అప్పుడు ఈమెకి ఏం ప్రత్యుపకారం చెయ్యాలి?

తన కంపెనీలో పెద్ద ఉద్యోగం ఇస్తే?

పోనీ... ఆమెకెంత కావాలో అంత చెక్ రాసిస్తే?

ఇక్కడ సెల్ టవర్  పెట్టిస్తే? జనరేటర్ పెట్టిస్తేనో?

ఇలా ఆలోచిస్తూ పడుకున్న అతనికి, ఆమె సడెన్‌గా వెల్లకిలా తిరిగే సరికి ఆచ్ఛాదన లేని ఎద పొంగులు కనిపించాయి. అడవి మల్లెలా... అవి అడవి పాలేయన్న వెన్నెలలా... ఆమె ఇప్పుడు సరికొత్త కోణంలో కనిపించింది.

శతరూపని పెళ్ళి చేసుకుంటే?

మినిష్టర్ మల్లుకార్జునరావ్ గారి అమ్మాయితో తనకి ఎంగేజ్‌మెంట్ జరగబోతున్నదని గుర్తొచ్చింది. సన్నగా గీతలా పాలరాతి శిల్పంలా ఉండే 'దిశ' గుర్తొచ్చింది. సో... పెళ్ళి జరగని పని. పోనీ... ... ... శతరూపని తను అప్పుడప్పుడూ... వచ్చి... చూసుకుంటే?

ఇన్ సింపుల్ టర్మ్స్ '...ఉంచుకుంటే'?

ఉలిక్కిపడ్డాడు.

అంతలోనే 'వాట్స్ రాంగ్?' అనిపించింది.

తనతో ఉంటే ఆమె లైఫ్ సెక్యూర్డ్‌గా ఉంటుంది కదా.

తనికి గర్ల్‌ఫ్రెండ్స్  కొత్త కాదు! కానీ ఈమె...

ఈ ఆలోచనలతో అతనికి తెలియకుండానే నిద్ర పట్టింది.

...

తెల్లారి లేచేసరికి శతరూప 'పాలు' అంటూ తీసుకొచ్చి ఇచ్చింది. గంజి పెట్టిన ఇస్త్రీ చీరలో చక్కగా తయారై ఉంది. అతడు గ్లాసు అందుకుంటూ "నేనెవరో, ఏమిటో నువ్వు అడగలేదు. తెలుసుకోవాలని లేదా?" అడిగాడు.

ఆమె నవ్వి, "సాటి మనిషి... ఈ అడవిలోకొచ్చాక ఆక్సిడెంట్ అయింది... అదొక్కటే నాకు తెలిసింది!" అంది.

"మా తాతగారి పేరు జోగులయ్యగారు. భవానీ ప్రసాద్ అనే జమీందారు దగ్గర లెక్కలు చూసేవారట. మా నాన్నగారి హయాంలో పట్నం వచ్చేశాం. మా డాడీ పృథ్వీరాజ్ గారు! కాఫీ ఎస్టేట్స్ పెట్టి బిలియనీర్ అయ్యారు. ఇప్పుడు ఆయన్ని అంతా 'కాఫీ కింగ్' అంటారు. అమ్మ నా పన్నెండో ఏట పోయింది. నేను ఒక్కడ్నే సంతానం. మీ లాంటి అమ్మాయిని ఇలాంటి చోట కలుస్తానని నేనెప్పుడూ అనుకోలేదు. శతరూపా! మీకు నాతో వచ్చేయాలనుకుంటే... అదే బయట ప్రపంచంలోకి వచ్చేయాలనుకుంటే, మంచి లైఫ్ ఇస్తాను... ఐ మీన్... మంచి జాబ్..." తడబడ్డాడు.

ఆమె చిరునవ్వుతో "మీ తాతగారి పేరేమిటీ?" అడిగింది.

"జోగులయ్య గారు."

"పాలు తాగండి" ఆమె అందించింది.

"నా ప్రశ్నకు మీరు జవాబియ్యలేదు. మీరేం కావాలన్నా ఇస్తాను. పోనీ ఇక్కడే మీ కోసం ఓ గెస్ట్‌హౌస్ కట్టించనా? పవర్, ఇంటర్నెట్ అన్నీ అంతరాయం లేకుండా సప్లయ్ చేయించనా? ఏం చెయ్యను?... ఏదో ఒకటి అడగాల్సిందే? నాకింత చేసిన మీకు ఏదో ఒకటి చెయ్యకుండా వెళ్ళలేను" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

దాన్ని మరోలా అర్థం చేసుకుని, "ఒక స్త్రీగా ఇంకేదైనా ఆశించినా సరే" అన్నాడు.

ఆమె తీక్షణంగా చూసింది.

"ప్రత్యుపకారం" అన్నాడు సరి దిద్దుకుంటునట్టు.

అతడి చివరి మాటలు పట్టించుకోకుండా ఆమె ఫోన్ పరికించి చూసి, "థాంక్ గాడ్. సిగ్నల్స్ ఉన్నాయి. ఎప్పుడైనా పోవచ్చు. తొందరగా మీ నాన్నగారికి ఫోన్ చెయ్యండి..." అంటూ బయటికెళ్ళింది.

వ్యాస్ తండ్రికి ఫోన్ చేసాడు.

అతడి స్వరం వినపడగానే, "బాబూ... నాన్నా... వ్యాస్... ఎక్కడున్నావురా? ఏమైందిరా? అని అట్నుంచి ఆయన ఏడ్చేశాడు.

సాధ్యమైనంత టూకీగా జరిగింది చెప్పాడు వ్యాస్.

"దేవుడున్నాడురా. ఉన్నాడు. కోటి రూపాల్లో... కాదు. కాదు అనంత శతకోటి రూపాల్లో... .... ఉన్నాడు. నేను వస్తున్నా" అన్నాడు ఉద్వేగంగా.

----

అంబులెన్స్ వచ్చింది. పృథ్వీరాజ్ గారొచ్చారు. గూడెం అంతా గూడు కట్టి నిలబడి చూస్తున్నారు.

ఆయన శతరూపకి దణ్ణం పెట్టి "ఏ దేవతో నీ రూపంలో నా బిడ్డని కాపాడిందమ్మా. మా ఊరు వచ్చెయ్యి. మా కంపెనీలోనే ఉద్యోగం. నువ్వు కోరినంత జీతం" అన్నారు.

ఆమె మాట్లాడ లేదు.

వ్యాస్ కల్పించుకుని, "ఎందుకు సంశయం? వచ్చెయ్యి. ఈ దోమల మధ్య... సెల్ ఫోన్ సిగ్నల్స్లూ, కరెంటూ లేని అడవిలో ఎందుకు ఉండటం? నా సెక్రటరీ గానీ ఉండొచ్చు" అన్నాడు.

"అన్నీ తెలిసే నేను కోరుకొని వచ్చిన ఊరు సార్ ఇది " క్లుప్తంగా అన్నది ఆమె.

"ఏదైనా ఇచ్చి నీ ఋణం కొంతైనా తీర్చుకోనివ్వమ్మా. భగవంతుడి దయవల్ల ఆ దేవుడు నాకు చాలా డబ్బిచ్చాడు" అన్నాడు పృథ్వీరాజ్ బ్రతిమాలుతున్నాట్టు.

ఆమె నుంచి అదే చిరునవ్వు.

"స్కూల్ పెట్టించనా? పోనీ ఆసుపత్రి?" ఆయన ఆప్షన్స్ అడిగాడు.

ఆమె జవాబు చెప్పలేదు.

వ్యాస్ కి కోపం వచ్చింది. తాము ఇస్తున్న ఆఫర్ వద్దంటున్నందుకో, "తన దగ్గర 'పని' వద్దంటున్నందుకో" తెలీదు. కాస్త విసురుగా, "వస్తూన్న సాయం వద్దన కూడదు. మా తాత జోగులయ్య గారి పేరు మీద ఇక్కడి పిల్లలకి స్కూలు కట్టిస్తాను. నువ్వే చూసుకో..." అన్నాడు.

"మీ తాతగారు జోగులయ్యగారు అన్నారు కదా!" అంది.

ఆమె ఏం అడుగుతుందో వ్యాస్ కి అర్థం కాలేదు. తలూపాడు.

"ఆయన భవానీ ప్రసాద్ గారి దగ్గర పని చేసేవారుగా".

"అవును. ఆ జమీందారు మీకు తెలుసా?"

"ఆయన ఎప్పుడూ ఓ మాట చెప్తుండేవారు. ఓసారి దానం ఇచ్చినది తిరిగి తీసుకోకూడదని"

"అయితే?"

"ఆ భవానీప్రసాద్ గారు మా తాతగారు"

వాళ్ళు దిమ్మెరపోయారు.

అంబులెన్స్ కదిలిపోయింది.

# లవ్ ఎట్ ఫస్ట్ సైట్

## (జనవరి 7, 1981 ఆంధ్రప్రభ వారపత్రిక నుంచి)




ఆ చిన్న సంఘటన.

సౌత్ హిల్స్ ఏరియాలో విసిరేసినట్టున్న ఇళ్ళ మధ్య చిన్న బంగళా అతడిది. రాత్రి ఎనిమిదింటికి సుదర్శన్ ఇంటర్నేషనల్‌లో కాన్ఫరెన్సుని ముగించుకొని అతడు ఇంటికి వస్తున్నాడు.

www.koumudi.net

వర్షపు జల్లు అలలు అలలుగా పడుతోంది. పైకి ఎత్తిన గాజు అద్దాల సందుల్లోంచి చల్లటి గాలి రివ్వున వీస్తోంది. కారు లైట్ల కాంతిలో కొండల మధ్య దారి మెలికలు తిరిగిన పాములా మెరుస్తూంది. చాలాసేపటి నుంచి వర్షం కురుస్తూ ఉండటం వల్ల రోడ్డు నిర్మానుష్యంగా ఉంది.

అతడింకో అయిదు నిముషాల్లో ఇల్లు చేరుకోబోతాడనగా, కుడివైపుకి మలుపు తిరుగుతూ ఉంటే కారు లైట్ల వెలుగులో ఆమె చెట్టు పక్క నుంచి చెయ్యి కదపటం క్షణంలో వెయ్యవ వంతులో చూశాడు.

కీచుమన్న బ్రేకుల శబ్దంతో కారు ఆగింది.

అతడు తల తిప్పి కారు అద్దం గుండా చూశాడు. వీధి లైట్ల కాంతిలో ఆమె తెల్లచీర అస్పష్టంగా కనిపిస్తూంది.

'ఆమె చెయ్యి ఎత్తి లిఫ్ట్ అడిగిందా? లేక పొరపాటున నేనే కారు ఆపుచేశానా?' అన్న అనుమానం వచ్చింది.

ఆడవాళ్ళతో పరిచయం చేసుకోవటమూ, మాట్లాడటమూ, తనంతట తాను చొరవ తీసుకోవటమూ లాంటి విషయాలు అతడికి తెలియవు. నిద్రపోవటానికి తప్ప మిగతా సమయమంతా తన బిజినెస్ గురించి ఆలోచించటానికే సరిపోతుంది అతడికి.

ఎవరో అమ్మాయి రోడ్డుపక్కగా కనబడగానే కారు ఆపుచేసిన తన అసంకల్పిత చర్యకు సిగ్గుపడి అతడు కారు తిరిగి స్టార్టు చెయ్యబోయాడు. కానీ అంతలోనే ఆమె చెట్టు పక్కనుంచి కారువద్దకు రావటం రియర్ మిర్రర్‌లోంచి గమనించాడు. అతడి గుండె వేగంగా కొట్టుకోసాగింది. పక్కకు వంగి, కారుకు అటు వైపున్న గాజు అద్దం కిందకు దింపాడు. ఈలోపు ఆమె కారు దగ్గరకు చేరుకుంది. విండో లోంచి లోపలకు చూస్తూ, 'ఉడ్ యూ మైండ్ గివింగ్ మి ఎ లిఫ్ట్ అప్ టూ ది ఎయిర్‌పోర్ట్? ఇఫ్ యూ డోంట్ మైండ్, ప్లీజ్!" అన్నది.

...

కారు రెండవ వైపు అద్దం కూడా కిందకి దించటం వల్ల చల్లగాలి మరింత బలంగా లోపలకు వీస్తూంది. అయినా, అతడికి అది అంతగా పట్టలేదు. తనకి అడుగున్నర దూరంలో కూర్చున్నది ఒక అమ్మాయి అన్న భావన అతడికి చాలా థ్రిల్లింగ్ గా ఉంది. సెక్సువల్‌గా కాదు – కేవలం థ్రిల్లింగ్ గా.

దూరంగా పల్లంలో ఊరు తాలూకు మినుకు మినుకుమంటున్న దీపాలు దీపావళి రోజు ప్రమిదల్లా ఉన్నాయి.

"మీ ఇల్లు ఈ ప్రాంతాల్లోనే అయితే నా గురించి ఎయిర్‌పోర్టు వరకు వచ్చే శ్రమ తీసుకోకండి" అందామె ఇంగ్లీషులో.

"అబ్బెబ్బె! అటువంటిదేమీ లేదు" అన్నాడు తడబడుతూ. అటువంటిదేమీ లేదు అనటంలో ఉద్దేశ్యం తన ఇల్లు అటే అనో, శ్రమ తీసుకోవటం లేదనో ఆమెకు తెలియనివ్వకుండా.

"నా పేరు కల్పన. బి. ఎస్సి. ఫైనలియర్ చదువుతున్నాను. నాన్నగారు రిటైర్డ్ ఐ. ఎ. ఎస్. ఆఫీసరు. ఎయిర్‌పోర్ట్ ఎదురుగా ఉండే కాలనీలో ఉంటున్నాం" అంది ఆమె.

"నా పేరు నవీన్ చంద్ర. ఎం. బి. ఎ. చదివాను. ఆ తరువాత ఫిలిప్పైన్స్‌లో రెండు సంవత్సరాల ట్రెయినింగ్. ఆర్థర్ అండ్ హెయిలీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నాను. నాన్న లేరు. అన్నయ్య అమెరికాలో డాక్టరు. అమ్మ నాతోనే ఉంటూంది. మా కంపెనీ వాళ్ళు ఇల్లు ఇచ్చారు. నా జీతం..." అని ఏదో అనుమానం వచ్చినట్టు తలతిప్పి చూశాడు. ఆమె తల దించుకుని తనలో తనే నవ్వుకోవటం అస్పష్టంగా కనిపించింది. తాను అవసరమయిన దాని కంటే ఎక్కువ పరిచయం చేసుకుంటున్నానని గమనించి మొహం సిగ్గుతో ఎర్రబడింది. చప్పున మాట మార్చాలి కనక, ఏం మాట్లాడాలో తెలియక, అంతలోనే ఎయిర్‌పోర్టు సమీపించటం చూసి, "కొంచెం టీ తాగి వెళదామా?" అన్నాడు.

ఆమె అది ఊహించనట్టు అతడివైపు చిత్రంగా కానట్టు చూసింది. ఆమె మౌనాన్ని అంగీకారంగా భావించి అతడు కారును సర్రున ఎడమ వైపుకి కోసాడు.

ఎయిర్‌పోర్టులోకి దారి అందంగా ఉంది. రోడ్డుకి ఇరువైపులా దీపాలు. చుట్టూ లాన్, పూలమొక్కలు. దూరంగా బిల్డింగ్ పైన నెమ్మదిగా తిరుగుతున్న లైటు.

అతడి కారు పార్కింగ్ స్పేసులోకి వెళ్ళి ఆగింది.

అప్పుడు రాత్రి ఎనిమిదిన్నర అయింది.

...

"మీరు డబ్బు బాగా ఖర్చు పెడతారనుకుంటానే" అన్నదామె, ఎయిర్ పోర్ట్ బయట పై అంతస్తు హోటల్ లో కూర్చున్నాక.

"ఎందుకలా అనుకుంటున్నారు?"

"కప్పు టీ తాగటానికి కారు పార్కింగ్‌కు యాభై రూపాయి, లోపలికి రావటానికి వంద రూపాయలు ఖర్చు పెట్టటం చూసి" నవ్విందామె.

అతడు మాట్లాడలేదు.

దూరంగా వర్షంలో తడిసిన రన్‌వే, దివిటీలు పట్టుకున్న సైనికుల్లా దానికి అటూ ఇటూ ఉన్న ఎర్రటి –నీలపు లైట్లు, ఎక్కడో దూరంగా వెలుతురులో కలిసిపోయిన చీకటి, అస్పష్టమైన నిశ్శబ్దం – అన్నీ అతడికి అదొక విధమైన, అంతకు ముందెప్పుడూ లేని ఒక విచిత్రమైన అనుభూతిని కలుగజేస్తున్నాయి. ఆ ట్రాన్స్‌నుంచి బలవంతంగా బయటపడి – "నిజానికి నేను చాలా జాగ్రత్తగా, పొదుపుగా ఖర్చు పెడతానని మా స్నేహితులందరూ అంటూ ఉంటారు" అన్నాడు. ఆమె తల పైకెత్తి నవ్వింది. అంతలో వెయిటర్ వచ్చాడు. "రెండు సాండ్ విచెస్, కట్‌లెట్, టీ విత్ మీడియం షుగర్" ఆర్డరిచ్చాడు.

"ఇదేమిటి? టీ అని చెప్పి డిన్నర్ ఆర్డర్ ఇచ్చారు? మీరు భోజనం చెయ్యలేదా?"

అతడు తల అడ్డంగా ఊపి, "ఇప్పుడే కాన్ఫరెన్స్ నుంచి ఇంటికి వెళుతున్నాను" అన్నాడు.

"నేను సౌత్ హిల్స్‌లో ఉన్న స్నేహితురాలి ఇంటికి వెళ్ళాను. వర్షం వచ్చేటట్టు ఉంది వెళ్ళద్దన్నారు నాన్నగారు. సన్నగా పడే వర్షం అంటే భలే ఇష్టం నాకు. పర్వాలేదన్నాను..." నవ్వింది. "...కానీ అంతలో వర్షం ఎక్కువైంది. అసలు జన సంచారం లేకపోవటంతో మరీ భయం వేసింది. ఆ చెట్టు వెనుక నిలబడ్డాను. ఒక్క ఆటో కూడా రాలేదు. రెండు, మూడు కార్లు వెళ్ళాయి. ఆపుదామంటే భయం. ఏం చెయ్యాలో తోచక తటాపటాయిస్తూన్న సమయంలో మీ అంతట మీరే కారు ఆపు చేశారు."

'మీరు చెయ్యి ఎత్తి ఆపమనలేదా?' అని అడుగుదామనుకున్నాడు కానీ, ఎందుకో అడగలేదు.

భయం భయంగా చీకటి రోడ్డుమీద నిలబడి ఉన్న అమ్మాయికీ, వెళుతోన్న కారు ధైర్యంగా ఆపుచేసి ఎక్కే అమ్మాయికీ చాలా భేదం ఉంది.

ఆమె అంటూంది, "మీరు కానీ కారు ఆపు చెయ్యకపోతే ఏం చేసేదాన్నో? చీకటి పడుతున్న కొద్దీ భయం ఎక్కువ అవుతూంది. వెనక్కి వెళ్దామంటే, అప్పటికే స్నేహితురాలింటి నుంచి చాలా దూరం వచ్చేశాను. వర్షంలో తడవటం కదా. అసలు టైమే తెలియలేదు."

అతడు ఆమె నాజూకైన చేతివేళ్ళకేసీ, మణికట్టు మీది రిస్టు వాచి కేసీ, మోచేతి మీద పుట్టు మచ్చ కేసీ, బిగుతైన జాకెట్టు కేసీ, తెల్లటి మెడ కేసీ, వంపు తిరిగిన గెడ్డం కేసీ, దాని పైన ఎర్రటి పెదవి కేసీ, ఆపైన కొనదేలిన ముక్కు కేసీ, ఇంకా ఆ పైన కళ్ళకేసీ చూసి, ఒకసారి కళ్ళూ కళ్ళూ కలుసుకోగానే నవ్వి, "పోనీలెండి, నా అదృష్టం, కారు అదృష్టం" అన్నాడు.

అంతలో వెయిటర్ ట్రేతో వచ్చాడు. బల్ల మీద ప్లేట్లు నీట్‌గా సర్ది వెళ్ళిపోయాడు. ఆమె కట్‌లెట్‌ని కత్తితో కోస్తూ, "లిఫ్ట్ ఇవ్వటం కోసం మీరు ఇలాగే కారు ఆపుతూ ఉంటారా?" అంది.

ఊహించని ఈ ప్రశ్నకి గొంతులో ఏదో అడ్డు పడ్డట్టు అయింది. కానీ చాలా నిజాయితీగా, "ఊహూ. సాధారణంగా ఎవ్వరూ అడగరు" అన్నాడు.

"మరి నేనూ అడగలేదుగా?"

ఆమె చీకట్లో అస్పష్టంగా చెయ్యి ఎత్తినట్టు కనిపించిన సంగతి చెబుదామనుకున్నాడు కానీ, ఇరిటేట్ చేసినట్టు ఉంటుందని చెప్పలేదు. టాపిక్ మార్చి – "మీ హాబీస్ ఏమిటి?" అన్నాడు.

ఆ తరువాత వాళ్ళ సంభాషణ ఇంకో వైపుకి మళ్ళింది. వారి వారి అభిరుచులు, చూసిన ప్రదేశాలు, రాజకీయాలు, ఒలింపిక్స్ – అన్నీ చుట్టేసేక 'బిల్ ఎవరు ఇవ్వాలి' అన్న విషయం మీద ఘర్షణ పడి, చివరికి బయటకి వచ్చారు.

అప్పుడు తొమ్మిదయింది.

...

"ఎటు మీ ఇల్లు?" ఎయిర్‌పోర్టు బయటకు వస్తూ అడిగాడు. రోడ్డుకవతల వైపునున్న కాలనీ చూపించింది. పోష్ కాలనీ.

"మీ నాన్నగారికి ఎంతమంది సంతానం?"

"నేనొక్కతినే కూతుర్ని. అదిగో – ఆ అశోక వృక్షాలున్న ఇల్లే" అంది. అతడు కారు ఆపు చేశాడు. ఆమె వెంటనే కారు దిగకుండా అతడి వైపు చూసి నవ్వింది. ఆమె అలాగే ఒక క్షణం పాటు కూర్చుని ఉంటే బాగుండునని అతడూ అనుకున్నాడు. ఆ క్షణం ఎన్నో క్షణాలైతే మరీ బాగుండునని కూడా అనిపించింది.

అతడి ఆలోచనలని భగ్న పరుస్తూ, "వెళ్ళొస్తానండి. థాంక్స్. రేపు రండి. నాన్నగారిని పరిచయం చేస్తాను. అండ్ మళ్ళీ... థాంక్‌యూ ఫర్ ది నైస్ రైడ్ అండ్ ఎ కప్ ఆఫ్ టీ" అన్నది.

అతడు ఆమె వైపు ఆరాధనగా చూస్తూ నెమ్మదిగా అన్నాడు – "కల్పనా, ఐ లైక్ యూ".

...

అతడు టైనాట్ సర్దుకొంటూంటే కల్పన వెనక నుంచి వచ్చి కారు తాళాలు అందిస్తూ, "సాయంత్రం తొందరగా వస్తున్నారా?" అని అడిగింది. ఒక వైపు తల దువ్వుకుంటూనే అద్దంలో ఆమెను చూస్తూ, "వచ్చేస్తాను, ఏం?" అని అడిగాడు.

"సాయంత్రం షాపింగ్‌కు వెళదామనుకుంటున్నాను" అంది. ఆమె చేతి నుంచి తాళం చెవులూ, వాటితో పాటూ ఆమె చేతులూ అందుకుంటూంటే తాళం చేతులు క్రింద పడిపోయి, ఖాళీ అయిన చేతులు పాదు చేతలలో నిమగ్నం కాబోతూంటే... "ఏమిటిది, పెళ్ళయి ఆర్నెల్లు కావస్తూంటే!" అంది చిరుకోపంతో.

"ప్రేమకీ, కాలానికీ సంబంధం లేదోయ్! అందులోనూ మనది లవ్ ఎట్ ఫస్ట్ సైట్" అన్నాడు.

"సైట్ అంటే జ్ఞాపకం వచ్చింది. మా ఇంటికి వెళ్ళాలి. చాలా కాలం అయింది నాన్నని చూసి."

"సరే. అయితే, నేను ఇంటికి ఆలస్యంగానే వస్తానులే" అన్నాడు అతడు కారు వద్దకు నడుస్తూ.

అతడు ఆఫీసుకు చేరుకునేసరికి పదింపావు అయింది. దాదాపు నాలుగు గంటల వరకూ ఊపిరి సలపని పనులలో మునిగిపోయాడు. అయిదవుతూండగా ఆఫీసు నుంచి బయటికి వచ్చాడు. కారులో కూర్చుని స్టార్ట్ చేశాడు. వర్షం తగ్గింది కానీ, సన్నగా తుంపర పడుతూంది. మేఘాలు దట్టంగా అలుముకోవటం వల్ల అయిదింటికే బాగా చీకటి పడిపోయింది.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది అతడికి – కల్పన సాయంత్రం షాపింగ్‌కు వెళ్ళి, అక్కడి నుంచి తన ఇంటికి వెళతానని చెప్పటం. తన దగ్గర డూప్లికేట్ తాళం ఉంది కానీ, ఇంటికి వెళ్ళేసరికి భార్య ఇంట్లో ఉండదన్న ఫీలింగ్ ఎందుకో చికాకుగా అనిపించింది. తన కాలనీ లోపలికి వెళ్ళబోతూ మనసు మార్చుకొని, కారుని ఎడమవైపుకి తిప్పాడు. రెండు కిలోమీటర్ల దూరంలో వెస్ట్‌హిల్స్. అయితే, తన భార్య ఆమె నాన్నగారి ఇంటికి వెళ్లిందో, షాపింగ్ అయ్యాక వర్షాన్ని చూసి తమ ఇంటికే వెళ్ళిపోయిందో తెలియదు. మరి తనెందుకు ఇలా ఈ కొండల్లో తిరుగుతున్నట్టు?

తన చర్యకు తనే నవ్వుకుని కారు వెనక్కు తిప్పి ఇంటి వైపు పోనిచ్చాడు.

బాగా చీకటి పడిపోయింది. వంద గజాల దూరంలో వస్తువు కూడా కనిపించటం లేదు. రోడ్డు మీద లైట్లు కూడా చీకటిని పారద్రోలలేక పోతున్నాయి. కారు అద్దాల్లోంచి చలిగాలి బలంగా లోపలికి వీస్తూంది.

అకస్మాత్తుగా అతడు కారు స్లో చేశాడు.

దూరంగా చెట్టు కింద ఒక అమ్మాయి నిలుచుని ఉంది. మసక చీకట్లో అస్పష్టంగా, తెల్లచీరె కట్టుకుని కనిపిస్తూంది.

కల్పనే!

కారు నెమ్మదిగా ఆమెకు దగ్గర అవుతూంది.

తనది నల్ల కారు అనీ, తన కారు ఈ దారిలో రావటాన్ని ఆమె ఊహించదనీ, తన కారు హెడ్‌లైట్లు ముందుకు పడటం వల్ల కారు రంగు అవతలి వ్యక్తికి కనిపించదనీ, కేవలం ఒక కారు వస్తూన్నట్టు మాత్రమే తెలుస్తుందనీ అతడు భావించాడు. మరి కల్పన చెయ్యి ఎత్తి కారు ఆపుతుందా?

ఈ మసక చీకట్లో పరాయి వాడి కారును ఆపి...

ఎక్కుతుందా?

ఆమె అడుగు ముందుకు వేసింది.

---

కల్పన అడుగు ముందుకు వేసింది.

ఫర్లాంగు దూరం నుంచి అయినా ఆమె తమ కారు చప్పుడు గుర్తు పట్టగలదు. ఆమెకు సంతోషం కలిగింది. ఆ సంతోషంలోనే అడుగు ముందుకు వేసింది.

కానీ, అంతలోనే ఆమెకు ఒక అనుమానం వచ్చింది.

చెట్టు చాటున ఉన్న తనను అతడు పోల్చుకోలేదని ఆమె భావించింది. కేవలం ఒక స్త్రీ – నిర్మానుష్యమైన రోడ్డు మీద కనబడితే కారు ఆపుచేస్తాడా తన మొగుడు?

ఏమో? చూడాలి.

ఆమె అలాగే నిలబడి ఉంది.

కారు దగ్గర అవుతూంది.

తన భార్య చెయ్యి ఎత్తి పరాయి వాడి కారు ఆపు చేస్తుందా అని అతడు ఆలోచిస్తున్నాడు.

తన భర్త కారు ఆపి, పరాయి స్త్రీకి లిఫ్ట్ ఇస్తాడా అని ఆమె వేచి ఉంది.

ఆమె చెయ్యి ఎత్తి కారు ఆపిందా? అతడు కారు తనంతట తానే ఆపు చేశాడా? అన్నది ఇక్కడ ఈ కథకు అప్రస్తుతం.

# నీలోంచి నాలోకి..

## (ఏప్రిల్ 10, 2000 ఆంధ్రప్రభ వారపత్రిక నుంచి)

"... సరసమంటే ఏమిటి?" అడిగాడు నా భర్త.

బిత్తరపోయాను. ఏ భర్తా మొట్ట మొదటి రాత్రి తన భార్యతో జరిపే తొలి సంభాషణలో, తొలి ప్రశ్నగా దాన్ని అడగడు. స్వచ్ఛమైన ఉర్దూలో అతడు అడిగిన ప్రశ్నకి ఏ సమాధానం చెప్పాలో తెలియక మౌనం వహించాను.

నా అయోమయాన్ని అర్థం చేసుకున్నట్టు అతడు సన్నగా నవ్వి "...నువ్వు గదిలోకి రావటం ఆలస్యం అయ్యేసరికి ఒక కవిత వ్రాద్దామని కూర్చున్నాను. 'సరసము' అన్న పదానికి సరి అయిన అర్థం తెలియలేదు. రాగానే ఇలా అడిగినందుకు కంగారు పడ్డావా?" అన్నాడు.




కౌముది

నేను కూడా తేరుకొని, "అదేం లేదు!" అని ఉత్సుకతతో కూడిన ఆశ్చర్యంతో "మీరు కవితలు వ్రాస్తారా?" అని అడిగాను.

"అవును. నీ కవిత చదివే నీ కోసం భారతదేశంలో వాకబు చేశాను" అన్నాడు.

సనాతన ముస్లిమ్‌ల కుటుంబం మాది. గోదావరికి పశ్చిమాన కొవ్వూరికి వంద కిలోమీటర్ల దూరంలో ఒక పల్లెటూరు. మా కుటుంబాల్లో స్త్రీ అభిప్రాయాలకి అంత విలువ ఇవ్వరు. అందులోనూ అంత ఉన్నత పదవిలో ఉన్న సైనికాధికారి ఏరి కోరి వచ్చి చేసుకుంటానంటే మా తల్లిదండ్రులు ఎగిరి గంతేసి ఒప్పుకున్నారు. ఆ విధంగా నా అంగీకార, అనంగీకార ప్రసక్తులు లేకుండానే ఆసిఫ్ అహ్మద్‌కి అర్ధాంగినయ్యాను.

మాలాంటి కొన్ని ముస్లిమ్స్ తెగల్లో జుల్వా అవగానే, పెళ్ళికూతురు భర్త ఇంటికి వచ్చేస్తుంది. హిందువుల్లోలా కాకుండా, సుహాగ్ రాత్ (శోభనం) పెళ్ళికొడుకు ఇంట్లో జరుగుతుంది. ఆ విధంగా నేను పెళ్ళవగానే పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పాకిస్తాన్ వచ్చేశాను.

అన్నట్టు చెప్పటం మర్చిపోయాను. మా ఆయన పనిచేస్తున్నది పాకిస్తాన్ సైన్యంలో...!

...

పెహలీరాత్ గదిలోకి పంపబోయేముందు చేసే తతంగాన్ని 'కరీమా' అంటారు. అంతటి ఆజానుబాహువూ, మామూలుగా అతి గంభీరంగా ఉండేవాడూ అయిన నా భర్త – చిన్నపిల్లాడిలా పూలబంతుల్తో ఆడటం చూసి నవ్వుకున్నాను. తొలిరాత్రి మల్లెపూలు ఎక్కువగా వాడతారని పుస్తకాల్లో చదివాను. కానీ, మాలో గులాబీ రేకుల్నీ, అత్తరునీ ఎక్కువ ఉపయోగిస్తారు. ఆ పరిమళం మల్లెలాగా మత్తెక్కించదు. ఆహ్లాదకరంగా ఉంటుంది. కామానికీ, శృంగారానికీ ఉన్న తేడాలా అనిపిస్తుంది.

ఆ పక్కమీద పరచుకుని ఉన్న గులాబీరేకుల్ని పక్కకి తొలగిస్తూ ఒక పుస్తకంలో కవిత తీసి నాకు చూపించి, "ఇది నువ్వు వ్రాసిందేగా?" అన్నాడు. అది నేను వ్రాసిందే. 'జిహేద్ ' అన్న ఉర్దూ పత్రికలో పడింది. అది అహ్మదాబాద్ నుంచి వెలువడుతుంది. జిహేద్ అంటే పోరాటం అని అర్థం. పేరుకు పోరాటమే కానీ, అన్ని రకాల కథలూ, కవితలూ వేస్తారు. నేను వ్రాసిన కవితని వాళ్ళు వేసుకోవటం, పైగా పదిరూపాయల పారితోషికం పంపటం, నాకు అపూర్వమైన అనుభవం.

"ఇండియా నుంచి వస్తూ నా స్నేహితుడు ఈ మ్యాగజైన్ తెచ్చాడు. లాహోర్‌లో ఇచ్చాడు. నీ ఫోటో చూసి మనసు పారేసుకున్నాను. కవిత చదివి మనసు పోగొట్టుకున్నాను."

"నా కవితని పొగుడుతున్నారా, తిడుతున్నారా?" చిరుకోపంతో ప్రశ్నించాను.

అతడు తెల్లబోయి "...అంత బాగోక పోతే పరాయిదేశంలో ఉన్న పిల్లని వెతికి వెతికి ఎందుకు పట్టుకుంటాను?" అన్నాడు. నిజమే కదా అనిపించింది. ఈలోపులో అతను అన్నాడు – "నాకూ ఈ కవితల పిచ్చి ఉంది. ఇద్దరి అభిరుచులూ కలుస్తాయనిపించింది. నీ పేరు చూశాను. నూర్జహాన్ అని కనిపించింది. నా మిత్రునితో ఎంక్వయిరీ చేయించాను."

తరువాత విషయం నాకు తెలిసిందే. మా తల్లిదండ్రులు ఉప్పొంగిపోయారు. పాకిస్తాన్ అంటే ఎంత లేదన్నా మా వాళ్ళకి ప్రేమే! మా తాతగారు (తల్లి తండ్రి) కరాచీ నుంచి ఆంధ్రదేశానికి వలస వచ్చారు. మా తల్లీ, పాకిస్తాన్ మాజీ ప్రధాని జుల్ఫికర్ ఆలీ భుట్టో ఒకే రోజున(1928 లో) పుట్టారు. యాభై ఒక్క ఏళ్ళ భుట్టోని పాకిస్తాన్ సైన్యం ఉరి తీసినప్పుడు, నా తల్లి దుఃఖించటం నాకు ఇప్పటికీ గుర్తుంది.

ఆసిఫ్ అహ్మద్‌తో నా వివాహానికి ఇరు ప్రభుత్వాల తరపు నుంచీ ఏవైనా అభ్యంతరాలు వస్తాయేమోనని మేము భయపడ్డాము. ఆసిఫ్ సైన్యంలో ఉన్నత స్థానంలో ఉన్నాడు కాబట్టి, ముఖ్యంగా పాకిస్తాన్ నుంచి అభ్యంతరం ఉంటుందేమో అనుకున్నారు. అయితే అలాంటిదేమీ జరగలేదు. వీసా సులభంగానే లభించింది.

"దేవిగారు ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్న ప్రశ్నకి ఊహల్నించి బయటపడి నవ్వాను. "నేను ఏదో కవిత వ్రాయడమేమిటి? దాన్ని పత్రికకి పంపటం ఏమిటి? మీరు చదివి, పెళ్ళికి రాయబారం పంపటం ఏమిటి? గోదారి ఒడ్డు నుంచి, ఇండస్ తీరానికి నేను రావటం ఏమిటి?" అన్నాను.

తన దేశపు నది గురించి ప్రస్తావించేసరికి అతడు గమ్మత్తుగా కళ్ళు ఎగరేసి, "ఓ! నువ్వు హిస్టరీలో గ్రాడ్యుయేట్‌వి కదూ!" అన్నాడు. అతడు నా చేతిని తన చేతిలోకి తీసుకుంటూ ఉండగా ఫోన్ మోగింది. అతడు నుదురు చిట్లిస్తూ దాన్ని అందుకొని అవతలివారు ఏదో చెప్తూంటే "సరే...సరే...!" అని కొంచెంసేపు మాట్లాడి ఫోన్ పెట్టేశాడు.

"ఎక్కణ్ణుంచి ఫోన్?" అని అడిగాను.

"జనరల్ తాలూకు ఆఫీసు నుంచి!" అన్నాడు. "...మీ ప్రధాని బస్సులో లాహోర్ వస్తున్నారట. సెక్యూరిటీ చీఫ్‌గా నన్ను నియమించారు!" అన్నాడు.

మెరుస్తున్న కళ్ళతో "కంగ్రాట్స్!" అన్నాను.

"వాజ్‌పేయి మాకు నచ్చిన ప్రధాని"

అతనిలో అంత ఉత్సాహం కనబడలేదు. "సరే. ఇక దాని గురించి మర్చిపోదాం!" అంటూ ముందుకు వంగి పెదవులపై ముద్దు పెట్టుకున్నాడు.

అంత అకస్మాత్తుగా అతడు అలా ముద్దాడేసరికి కాస్త కంగారుపడ్డాను. అతడి లోంచి నాలోకి ఏదో శక్తి ప్రవహిస్తూన్న అనుభూతి కలిగింది. తన అవయవాలన్నిటి తరఫునా తన 'నాలుక'ని రాయబారిగా నియమించి, నా తనువు దుర్గంలోకి పంపినట్టున్నాడు. ఆ రాయబారే నా శరీరపు అవయవాల గురించి గూఢచారి బాధ్యతలు కూడా స్వీకరించినట్టు అనిపించింది. ఆ జలదరింపుల పరిమళపు అలదరింపు వాళ్ళంతా పాకుతూ ఉండగా, అతడు నన్ను ఒకవైపు ముద్దిడుతూనే తన ఆలోచనల్లో ఎక్కడో జారుకున్నట్టు గమనించాను. కాస్త దూరంగా విడిపడి, "ఏం ఆలోచిస్తున్నారు?" అన్నాను.

అతడు నవ్వి, "మా గురించే!" అన్నాడు.

“అంటే?”

“శత్రువుకి సెక్యూరిటీ ఇవ్వాల్సి వస్తోంది చూశావా?"

“శత్రువైనా అతడు మన అతిథి కదా!" అన్నాను. 'మన ' అనటం నాకు గమ్మత్తుగా అనిపించింది.

అతడు మాట్లాడలేదు. మూడ్ మార్చటానికి ఉర్దూలో చిన్న షాయిరీలా, "ఆ అతిథి గురించే తప్ప, పక్కనున్న అభ్యాగతి గురించి ఆలోచించరా?" అన్నాను.

అతడికి అర్థమయింది. ఆవేశంతో చప్పున దగ్గరకు లాక్కున్నాడు.

అది నాకు తొలి పురుష స్పర్శ. బస్ స్టాపుల్లో తగిలే వాళ్ళ గురించి కాదు నేను చెప్పేది. తనువూ, మనసూ సంపూర్ణాంగీకారంతో ఆహ్వానిస్తున్న స్థితిలో స్పర్శ అది!

అందరూ ఇటువంటి సందర్భాల్లో స్త్రీ శరీరాన్ని వీణతోనూ, పురుషుడిని ఆ వీణ తీగె శృతి చేసేవాడితోనూ పోలుస్తారు. నాకు అలా అనిపించలేదు. దాపరికం లేకుండా చెపుతాను. నాకెందుకో దూదేకులవాడు గుర్తొచ్చాడు. ఎక్కడో తీగెని కదుపుతాడు. ఠాంగ్మన్న శబ్దంతో – పింజెలుపింజెలుగా దూది గదంతా వ్యాపిస్తుంది. అతడి చెయ్యి నా వెన్నెముక చివరికి చేరుకునేసరికి నాకు తోచిన పోలిక అది!

నా మెడ వంపు నుంచి మరో వంపులోకి అతడి మొహం జారేసరికి శరీరం అలలా ఎగసిపడి, నా కటి – కెరటమయింది. నాలో అంత కోరిక నిక్షిప్తమయిందని అప్పటి వరకూ నాకు తెలియదు.

అతడు వయసులో చిన్న పిల్లాడై, ముప్పై సంవత్సరాల వెనక్కి వెళ్ళాడు. 'ఆకలే' తేడా!

పురుషుడి కూడా ఒక ప్రత్యేకమైన పరిమళం (ఛా... ఇటువంటి టైంలో అంత సంస్కారవంతమైన పదం వాడటం అనవసరం) వాసన ఉంటుందని నాకు మొదటిసారి తెలిసింది.

ఒక్కొక్క సిగ్గు పొరా నన్ను వీడి, మంచం పక్కన పడుతోంది.

పెళ్ళయ్యాక – ప్రతిరాత్రీ స్త్రీ భూదేవి అవ్వాలేమో అని భయపడేదాన్ని. రోమాన్స్ లో 'బరువూ' బాధ్యతలు కూడా ఆనందంగానే ఉంటాయని అర్థమయింది. బరువు సంగతి పక్కన పెట్టి 'భాగస్వామి'గా నా వంతు రొమాంటిక్ 'బాధ్యతలు' ప్రారంభించబోయే టైంకి జరిగిందది!

పెద్ద షాక్..!

ఏం జరిగిందీ గ్రహించేలోపులో నాకన్నా ముందే అతడు దాన్ని గ్రహించినట్టు వివర్ణమైన మొహాన్ని వంపుల్లో దాచుకున్నాడు. నా శరీరం వంపుల్లో కాదు. దిండు వంపుల్లో...!

...

ఇది జరిగి వారం రోజులైంది.

నా భర్త నపుంసకుడు కాదని నా మనస్సు గాఢంగా చెప్తోంది. అయినా ఇప్పుడు నా సమస్య అదికాదు. తాను కొత్తగా తెలుసుకున్న చేదునిజాన్ని జీర్ణించుకోవటానికి అతడికి కొంత సమయం ఇవ్వాలి. డిప్రెస్ కాకుండా చూడాలి. అదీ నా ప్రస్తుత బాధ్యత..!

అందుకే నేను సాధారణంగా ఉన్నట్టు కనపడటానికి ప్రయత్నించాను.

"ఇంతవరకూ నాకు ఏ స్త్రీతోనూ అనుభవం లేదు!" చెప్పాడతను. "...కానీ నాకు కరెక్టుగా తెలుసు. నాలో ఏ లోపమూ లేదు. ఎందుకో ఆ సమయంలో నిస్సత్తువో, నిరాసక్తతో ఏర్పడుతోంది. డాక్టర్ని కలవాలో, మానసిక నిపుణుడిని కలవాలో అర్థం కావటం లేదు."

"ఇప్పుడు తొందరేముందీ..? కొంతకాలం వేచి చూద్దాం. తరువాత దానంతట అదే సర్దుకుంటుంది!" అన్నాను మనస్ఫూర్తిగా... నిజాయితీగా.

ఎందుకో ఈ సమస్య తాత్కాలికమే అని తోచింది. ఒక రకంగా ఇది మా మధ్య బంధం గట్టిపడటానికి సహాయపడుతుందనిపించింది.

ఈలోపున ఆసిఫ్ తల్లి మమ్మల్ని 'హనీమూన్'(?) కి తొందరపెట్టింది.

...

పాకిస్తాన్ కి ఉత్తరం వైపున హిమాలయ పర్వతాల అంచులో 'స్కార్టూ ' అన్న ప్రాంతం ఉంది. పర్వత శిఖరాల మీద కరిగిన మంచు 'హూషే' నదిగా మారి దక్షిణానికి ప్రవహించి ఇండస్ లో కలుస్తుంది. పచ్చిక బయళ్ళు, దూరంగా తెల్లటి కొండలు, మధ్యలో నది, చుట్టూ తోటలూ... చాలా మనోహరంగా ఉంది ఆ దృశ్యం.

ఆసిఫ్ నా చేతిలో చేయి వేసి దగ్గరకి తీసుకుంటూ " ఇంత అద్భుతమైన ప్రదేశం ఈ ప్రపంచంలో ఇంకెక్కడా లేదు!" అన్నాడు.

నేను అతన్ని అల్లరి పట్టిస్తూ "మా గోదారి పక్కన ఇంతకన్నా వెయ్యి రెట్లు అందంగా ఉంటుంది!" అన్నాను.

ఆసిఫ్ మొహంలో రంగులు మారాయి. "వీల్లేదు, ఉండటానికి వీల్లేదు!" అన్నాడు.

నేను అతడి మొహంలోకి సూటిగా చూస్తూ, "మీరెలా చెప్పగలరు? మీరొక్క ప్రదేశమే చూశారు. రెండు ప్రదేశాలూ చూసింది నేను. కాబట్టి నా వాదమే కరెక్టు!" అన్నాను. అతడు దెబ్బతిన్నట్టు నావైపు చూసి కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు. అతడి తరఫు నుంచి వాదన ఏమీ లేదని నాకు తెలుసు.

కానీ ఓడిపోవటం ఇష్టం లేనట్టుగా అతడు కాస్త స్వరం హెచ్చించి "ప్రతిదీ చూసి అనుభవించి చెప్తేనే నిజమవుతుందా ఏమిటి?" అన్నాడు.

అది మూర్ఖవాదం అని నాకు తెల్సు. కానీ నేను దానిగురించి ఆలోచించటం లేదు. అతడి మొహం వైపే చూస్తున్నాను. అతడి మొహం జేగురురంగుకి మారిపోయి ఉంది.

ఇలాంటి మొహాన్నే నేను తరచూ మా ఇంట్లో చూస్తూ ఉండేదాన్ని. కాబట్టి నేను వెంటనే పోలిక పట్టుకోగలిగాను.

ఆ మొహం నా తండ్రిది!

దాదాపు యాభై సంవత్సరాల క్రితం కరాచీ నుంచి కట్టుబట్టలతో వచ్చేసినందుకు అతడికి తన మీదా, సమాజం మీదా కసి పెరిగింది. ప్రతిరోజూ విపరీతంగా తాగటం అలవాటయింది. ఆ విసుగూ, చిరాకూ ఎక్కువైతే అకారణంగా కోపం వచ్చేది. నా తల్లితో వాదన వేసుకునేవాడు. అందులో ఏ బలమూ లేకపోయినా మగవాడు కాబట్టే గెలిచేవాడు. నా తల్లి అతని చేతుల్లో తన్నులు కూడా తినేది. అలా కొడుతున్నప్పుడు నా తండ్రి మొహం కూడా ఇలాగే జేగురు రంగుకి మారటం నాకు గుర్తుంది.

నా భర్తతో అకారణమైన వాదాన్ని పొడిగించటం ఇష్టం లేక దూరంగా ఉన్న పర్వతాలని చూపిస్తూ, "అటువైపే కదా భారత దేశం?" అన్నాను.

"అవును. దాన్ని కార్గిల్ అంటారు. అతి తొందరలో అక్కడ యుద్ధం జరగబోతోంది!" అన్నాడు. సంభాషణ మార్చటంలో ఆవిధంగా సఫలీకృతురాలిని అయినందుకు సంతోషం వేసింది.

అతి కొద్దికాలం లోనే అతడి మాట నిజమైంది. భారత ప్రధాని వాజ్‌పేయి వచ్చి వెళ్ళిపోయిన కొన్ని నెలలకి యుద్ధం ప్రారంభమయింది. ఎక్కువ కాలం జరగలేదు కానీ, ఆసిఫ్ కి మాత్రం తట్టుకోలేనంత పెద్ద దెబ్బ తగిలింది. అతడి ప్రాణమిత్రుడూ, మరో సైనికాధికారీ అయిన ఇక్బాల్ ఆ పోరటంలో మరణించాడు. యుద్ధానికి వెళ్ళడానికి ముందురోజే 'ఇక్బాల్' మా ఇంట్లో 'దావత్'కి వచ్చాడు. ఇద్దరూ కలిసే బయల్దేరారు. అతడి మరణం తో నా భర్త కసితోనూ, ఉక్రోషంతోనూ ఉడికిపోవటం గమనించాను. దీనికి మరొక కారణం కూడా ఉంది. అతడి మిత్రుడు ఇక్బాల్ యుద్ధంలో మరణించినప్పుడు ఆ శవాన్ని 'తమది' గా గుర్తించటానికి పాకిస్తాన్ నిరాకరించింది. దాన్నొక అనాథ కాశ్మీరీ మిలిటెంట్ శవంగా గుర్తించి, భారత సైనికులే పాతి పెట్టారు.

ఈ యుద్ధానికి కారణం పాకిస్తాన్ సర్వ సైనికాధికారి ముషరాఫ్..! కార్గిల్ పై అతడు చేసిన దురాక్రమణ గురించి ఆ దేశప్రధాని అయిన నవాబ్ షరీఫ్ కి కూడా తెలియదని అప్పట్లో కొన్ని పత్రికలు వ్రాశాయి. తెలిస్తే యుద్ధానికి వప్పుకునే వాడు కాదట. తెలియగానే యుద్ధం ఆపి, (అప్పటికే భారతసైన్యం చేతిలో చావు దెబ్బ తిన్న) సైన్యాన్ని వెనక్కి పిలిపించాడట.

అందుకే నా భర్తకి ప్రధాని నవాజ్ అంటే చాలా గౌరవం. ముషరాఫ్ అంటే కోపం.

...నా భర్త ఆరోగ్యంలో మార్పు లేదు. అయితే చాలామంది భార్యాభర్తల కంటే మేము సుఖంగా ఉన్నామని చెప్పుకోవాలి. కారణం మా ఇద్దరి మధ్యా ఉన్న కమ్యూనికేషన్. ఏదన్నా వితండవాదం చేయవలసి వచ్చినప్పుడు తప్ప మిగతా పరిస్థితుల్లో ఆసిఫ్ లాంటి వ్యక్తి భర్తగా లభించటం అదృష్టం. నా తండ్రి లాంటి చాలామంది భార్తల్లా కాకుండా, అతడు నాతో ప్రవర్తించే విధానం బావుంటుంది.

ఇలా కొన్ని రోజులు గడిచాయి.

తన ఆరోగ్యంలో ఏ మార్పూ రాకపోవటంతో ఎవరన్నా సైకియాట్రిస్టిని కలుసుకోవాలన్న నిశ్చయానికి వచ్చాడు నా భర్త. అతడింత కాలం ఆగటానికి కారణం నేనే. నాకెందుకో ఇంకా నమ్మకం సడలిపోలేదు. అతడిలో పురుషపరమైన మార్పుని భార్యగా నేను గుర్తించగలుగుతున్నాను కానీ, ఎక్కడో ఏదో మెలిక ఉంది. అదే తెలియటం లేదు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ ఉండగా–

ఒక రోజు పన్నెండు గంటలకి మా ఇంట్లో ఫోన్ మోగింది.

ఆసిఫ్ హడావుడిగా వెళ్ళిపోయాడు. నాలుగురోజుల పాటు ఇంటికి రాలేదు. అప్పుడే విస్ఫోటనం లాంటి వార్త తెలిసింది. పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ ని సైన్యం బంధించింది..!

నాలుగు రోజుల తరువాత ఇంటికి వచ్చిన ఆసిఫ్ చాలా చిరాగ్గా ఉండటం గమనించాను.

"ఏమైంది?" అడిగాను.

"ప్రధాని నవాజ్ ని మా సైనికాధికారి ముషరాఫ్ జైల్లో పెట్టాడు!"

"అవును. పేపర్లన్నీ అదే వార్త కదా. ఇంతకీ ఈ నాలుగు రోజులూ మీరు ఎక్కడున్నారు?"

"తిరుగుబాటు జరక్కుండా, అతడి జైలు ముందు సెక్యూరిటి బాధ్యత నాకు అప్పగించారు."

"ఎవరు?"

అతడు నా వైపు విసుగ్గా చూసి, "ఇంకెవరు? ముషరాఫ్" అన్నాడు.

"మీరు ఎవరి కింద పని చేస్తున్నారు.? ప్రధాని నవాజ్ షరీఫ్ కిందా? సైనికాధికారి ముషరాఫ్ కిందా?" అడిగాను.

ఆసిఫ్ మొహం క్రమక్రమంగా జేగురురంగుకి మారసాగింది. అతడిలో వస్తున్న ఈ పరిణామాన్ని గుర్తించినా నేను బెదరలేదు. నేను చెప్పదలుచుకున్నది అతడికి చెప్పటమే ఆ క్షణం నా ఆశయం. అందుకే కొనసాగించాను. "ఏదైనా ఒక ప్రాంతాన్ని గానీ, వర్గాన్ని గానీ – మరో బలవంతమైన దేశం అణగదొక్కితే పక్కదేశమో, మరో సానుభూతి దేశమో ఆ వర్గానికి సాయపడటం న్యాయం. బంగ్లా విషయంలో భారతదేశం అదే చేసింది. కానీ, కాశ్మీర్లో ప్రజలేమీ కష్టనష్టాలతో తల్లడిల్లిపోవటం లేదే! భారతదేశ ప్రజల్లాగే వారు కూడా సంపూర్ణ స్వాతంత్రంతో బ్రతుకుతున్నారు. వారిని రక్షించవలసిన ఖర్మ మనకేం లేదు!"

"కానీ, కాశ్మీర్ ఒక ముస్లిం దేశం!" అరిచాడు.

నేను కూడా అంతే ఆవేశంగా "పాకిస్తాన్లో ఉన్న మొత్తం ముస్లిముల సంఖ్య కన్నా భారతదేశంలో ఉన్న ముస్లిముల సంఖ్య ఎక్కువ!" అన్నాను.

అతడు తన స్వరం మరింత గట్టిగా పెంచి, "జిహేద్ అంటే ఏమిటో తెలుసా నీకూ? పోరాటం!" అన్నాడు.

నేను కూడా అంత గట్టిగానే "దాని గురించి నాకు తెలుసు. అల్లా ఎప్పుడూ ఆ పోరాటాన్ని మీరు చెపుతున్న పోరాటానికి అన్వయించ లేదు. ఆ విషయం మీకూ తెలుసు. మీలో ఉన్నఒక గొప్ప సుగుణం ఏమిటో తెలుసా? మీకు వాదించటం చేతకానప్పుడల్లా అధికారాన్ని చూపిస్తారు. దాన్ని మానుకోండి!" అన్నాను.

అతడు నిరత్తుడై అయోమయంగా నావైపు చూసి, ఏమీ మాట్లాడలేనట్టుగా మౌనంగా ఉండి పోయాడు. నేను కొనసాగించాను – "ఆ రోజు చెప్పాను గుర్తుందా? గోదావరి ఒడ్డునీ చూశాను, ఇండస్ నదినీ చూశాను. కాబట్టి మీకన్నా నేను ఎక్కువ నమ్మకంగా చెప్పగలను. మన దేశంలో డెబ్భై అయిదు శాతం పైగా జనం కూలీలుగా బతుకుతున్నారు. తినడానికి సరిగ్గా తిండి లేదు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాం. ఆ చేదు సత్యం నుంచి ప్రజల్ని దూరంగా ఉంచటానికి మన సైన్యం, మన ప్రభుత్వం మతాన్నీ, యుద్ధాన్ని ఎరగా చూపుతోంది. పన్నెండు లక్షల భారత సైన్యంతో ఆరులక్షలు కూడా లేని పాకిస్తానీ సైన్యం పోరాడి గెలవలేదని మీకు కూడా తెలుసు. అందుకే మీకు అసంతృప్తి. ఒక్కసారి మీరూ ఆలోచించండి!"

నా భర్త తెల్లబోయి నాకేసి చూశాడు.

"ఒక సైనికాధికారి మిమ్మల్ని యుద్ధానికి పంపించాడు. మరో ప్రధాని మిమ్మల్ని యుద్ధం నుంచి వెనక్కి పిలిపించాడు. ఈలోపులో మీరు మీ మిత్రుణ్ణి కోల్పోయారు. యుద్ధక్షేత్రంలో మీ మిత్రుడి శవం తమది కాదన్నందుకు ముషరాఫ్ ని తిట్టారు. అదే ముషరాఫ్ మళ్ళీ ఇప్పుడు ప్రధానిని గృహబంధం చేయమని ఆజ్ఞాపిస్తే, ఆ వృత్తి నిర్వర్తించారు. మీకు పని చెప్పేదెవరు? మీరు పని చేసేది ఎవరి కోసం? ఇంతకీ మీ పై అధికారి ఎవరు?" అని ప్రశ్నించాను.

అతడు చాలా సేపు మవునంగా ఉంది, ఆ పై నా దగ్గరగా వచ్చి కళ్ళలోకి చూస్తూ, "నువ్వు చెప్పింది నిజమే అనిపిస్తోంది!" అన్నాడు.

...

ఆ రాత్రి అతడు నన్ను దగ్గరికి తీసుకున్నాడు. అతడిలో నాకు కొత్త ఆసిఫ్ కనిపించాడు. హృదయంలోంచి ఉబికి వచ్చే సంతృప్తికి చర్మం మీద నిలబడే చెమట బిందువులే తార్కాణమైతే నా శరీరం అతడి తాకిడికి చెమట ముద్దగా మారింది. ఆనకట్ట తెగిన నది క్షణాల్లో ఎలా ఉధృతమవుతుందో ఆ విధంగా కోరిక కట్టలు తెంచుకుని ప్రవహించింది. నా భర్త సంపూర్ణ మానవుడయ్యాడు.

పది నిముషాల తర్వాత ఇద్దరం వెల్లకిలా పడుకుని ఉన్నాం. తలకింద చేతులు పెట్టుకుని అతడు సంతృప్తిగా కళ్ళు మూసుకుని ఉన్నాడు.

పై కప్పుకేసి చూస్తూ నేనన్నాను. "మొట్ట మొదటి రోజు మీరు నన్నో ప్రశ్న అడిగారు గుర్తుందా? సరసం అంటే ఏమిటని. ఆ తరువాత నేను నిఘంటువు వెతికాను. 'రసము ' అంటే అనురాగము. సరసము అంటే సామీప్యము. అయితే ఇది కేవలం శృంగారానికి సంబంధించినది కాదు.

మనిషికి సంబంధించినది. తనపట్ల తనకి అనురాగం లేనివాడు, తన భావాల పట్ల తనకి నమ్మకం లేనివాడు, తను ఎవరికోసమైతే పని చేస్తున్నాడో ఆ మనిషి మీద గౌరవమూ, అభిమానమూ లేనివాడు, సరసానికి పనికి రాడు! 'నాకీ రోజు మూడ్ లేదు ' అని ఒక్కోసారి మనం అనుకుంటూ ఉంటాం. ఏదో సంఘటన జరగటం వలన మనకా రోజు మూడ్ పోతుంది. పర్వాలేదు. ఎందుకంటే... అది తాత్కాలిక అసంతృప్తి! అదే జీ..వి..తం పట్ల అసంతృప్తి అనుకోండి. అప్పుడేమవుతుంది? శాశ్వతంగా మూడ్ పోతుంది..! మానసిక నపుంసకత్వం వస్తుంది..! ఒక శత్రు సైనికుడిని చంపటం, అదే దేశ ప్రధానికి సెక్యురిటి ఇవ్వటం... అదే అకారణ అసంతృప్తి. అందుకే భారత ప్రధానికి సెక్యూరిటీ ఇవ్వవలసి వస్తుందని తెలియగానే మీరు మన తొలిరాత్రి శృంగారంలో నిర్వీర్యులయ్యారు. తనలోకి తను ప్రవహించ లేనివాడు, తనని తాను రమించుకోలేనివాడు ఇతరులనెలా రమిస్తాడు? ఇతరుల్లోకి ఎలా ప్రవహిస్తాడు? సరసం అంటే కేవలం ఇతరులలోకి ప్రవహించటం మాత్రమే కాదు. తనలోకి తాను ప్రవహిస్తూ ఆ సంతృప్తిని అవతలివారికి అర్థమయ్యేలా చెప్పటం!"

వెల్లకిల పడుకుని ఉన్నవాడల్లా నెమ్మదిగా నా వైపు తిరిగి సజలనేత్రాలతో కొంచెం సేపు నా మొహం వైపు చూసి, వంగి నా అధరాలపై చుంబించాడు.

ఇక జీవితంలో మరెప్పుడూ అతడి మొహం జేగురు రంగులోకి మారదని నాకెందుకో అపారమైన నమ్మకం కలిగింది.

# తోడేలు

ఆకాశ దేశాన వ్యాహ్యాళికి వెళుతున్న ఇంద్రుణ్ణి ఏడిపించటం కోసం, వరుణుడు నల్లటి మేఘాల్ని సృష్టించగా, కోపం వచ్చిన ఐరావతం తన కాళ్ళతో వాటిని చిన్నాభిన్నం చేసి, తొండంతో ఆ నీటిని భూమ్మీదకు వెదజల్లినట్టు వర్షం ధారాపాతంగా కురుస్తోంది.

రహదారి బంగళా అడవి మధ్యలో ఉంటుంది. దానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఒక పల్లెటూరు. ఆ పల్లెటూర్లో మా బ్రాంచి స్థాపించాలని వచ్చి ఇక్కడ దిగాను. దాదాపు రెండు వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు. అన్నీ సవ్యంగా జరిగితే నా సంస్థ భారతదేశంలో నెంబర్ అవుతుంది.

వరండాలో స్థంబానికి ఆనుకొని ఎడతెరిపి లేకుండా కురుస్తూన్న వర్షాన్ని చూస్తున్నాను. పురాతనమైన బంగళా కావటంతో తడిసిన చెక్కల వింత పరిమళం గమ్మత్తుగా ఉంది. మెరిసినప్పుడల్లా చెట్లు భయంకరంగా తలలూపుతూ రోమాల్ని నిక్కబొడుచుకునేలా చేస్తున్నాయి. వాన హోరూ, మధ్యలో ఉరుముల చప్పుడూ..! కరెంటు పోకపోవటం అదృష్టం.

గోడమీద 'మానస మందిరం' అని చెక్కబడి ఉంది. రహదారి మందిరాలకి అలాంటి పేర్లు ఉండటం చాలా అరుదు. ఈ భవంతి కట్టించిన వాళ్ళెవరో కానీ మంచి అభిరుచి ఉన్నవారు అయి ఉంటారు. రెండు గదులూ, మధ్యలో పెద్ద హాలూ, పురాతనమైన ఫర్నీచరూ, కాంపౌండులోనే దూరంగా వాచ్మెన్ ఇల్లు.

అంతలో ఒక ఉరుమూ, దాన్ని అధిగమించి ఏదో జంతువు అరుపూ వినిపించింది. ఉలిక్కిపడ్డాను. కాంపౌండ్ వాల్ ఎత్తుగా ఉంది కానీ, అప్పుడప్పుడు నక్కలూ, బావురు పిల్లులూ గోడ దూకి వస్తూ ఉంటాయని వాచ్-మాన్ చెప్పాడు. మళ్ళీ అదే జంతువు అరుపు వినబడింది. బావురు పిల్లిది కాదు. నక్క ఊళ కూడా కాదు. ఏమిటా జంతువు?

బయట నిలబడటం మంచిది కాదనిపించి వెనక్కు తిరగబోతూ ఉండగా గోడ మీద నుంచి ఏదో లోపలకు దూకిన సవ్వడి వినిపించింది. చూశాను. దాదాపు అయిదడుగుల ఎత్తులో భయంకరంగా ఉంది.

తోడేలు.

నా ఊపిరి ఆగిపోయింది. దాని కళ్ళ నీలపు రంగులో, మధ్యలో ఎర్రటి జీరలతో మెరుస్తున్నాయి. దొరికిన జంతువు ఎటూ వెళ్ళిపోలేదని నిశ్చయమైన తరువాత, దాన్ని కబళించటానికి తాపీగా ఆగినట్టూ అది నిశ్చలంగా ఉన్నది. నా కాళ్ళు నేలకు అతుక్కుపోయాయి. ఊహించనంత వేగంతో అది ముందుకు వచ్చింది. నేనెంత స్థంబించిపోయానంటే కనీసం లోపలకు పరుగెట్టి తలుపు వేసుకోవాలన్న ఆలోచన కూడా రాలేదు. రెండుకాళ్ళూ పైకెత్తి ఒక్కసారిగా మీదకు దూకబోయింది.

ఎక్కడి నుంచి వచ్చిందో తెలీదు కానీ లోపల్నుంచి అంతులేని బలం తన్నుకొచ్చినట్టు కుడిచేత్తో దాన్ని ఆపుచేశాను. దాని గోళ్ళు నా మోచేతి లోపలకు దిగిపోయాయి. పళ్ళతో మెడ పట్టుకోవటానికి అది ముందుకు వంగింది. దాని నోట్లోంచి భరించలేనంత దుర్వాసన. కడుపులో దేవినట్టు అనిపించింది. కుడిచేయి దాని మొహానికి అందనివ్వకుండా ఎడమ చేత్తో దాని పొట్ట కింద నుంచి పట్టుకొని బలంగా తోశాను. అది వెళ్ళి అరుగు అంచు మీద బలంగా పడి క్రింది బురదలోకి దొర్లింది. ఆ పడటంతో దాని వెన్నెముక విరిగినట్టుంది. వికృతంగా కేకపెట్టి బురదలో గిలగిలా కొట్టుకోసాగింది. దాని గోళ్ళు గిచ్చుకున్నచోట లాల్చీ చిరిగిపోయింది. దాని వైపే చూస్తున్నాను.

దాన్ని నేనూ, అది నన్నూ అలాగే చూస్తూ నిలబడ్డాం.

దాని వెన్నెముక విరగటం గురించి నా అంచనా తప్పు. ఎక్కడినుంచి వచ్చిందో తెలీదుకానీ ఒక్కసారిగా బలం తెచ్చుకొని అది కాళ్ళమీద నిలబడి, అక్కడ నుండి మూడు అడుగుల ఎత్తున ఉన్న అరుగు మీదకు దూకి అదే వేగంతో నా మీదకు లంఘించింది. ఈ పరిణామాన్ని నేను ఊహించలేదు.

---

"అయ్యో, ఇప్పుడెలా ఉందండీ? తరువాత ఏమైంది? ఇది జరిగి ఎంతసేపయింది? డాక్టరు దగ్గరకి వెళ్ళారా? అసలు ఎక్కడ ఉన్నారు మీరు? ఇంత జరిగినా నాకు ఫోన్ చేయలేదేం?" అటు నుండి స్వాతి కంఠం ఆదుర్దాగా వినిపించింది.

"డాక్టరు చేతికి కట్టు కట్టాడు. ప్రమాదమేమీ లేదన్నాడు"

"మీరు వెంటనే బయలుదేరి వచ్చేయండి."

"ఇక్కడి నుండి ఇంటి దగ్గరకు రావాలంటే ముందు ఎడ్లబండి మీదా, తర్వాత బస్సులోనూ, ఆ పైన విమానంలోనూ ప్రయాణం చేయాలి మేడం" అన్నాను నవ్వుతూ.

అట్నుంచి చిన్న సందిగ్ధత. "అసలు మీరు నిజం చెపుతున్నారా? లేక కట్టు కథా?"

స్వాతిని సస్పెన్సులో ఉంచటం ఇష్టంలేక "సరదాగా చెప్పాను" అన్నాను.

అట్నుంచి కొంచెంసేపు నిశ్శబ్దం. "ఏదైనా జోకు చేసినా అవతలివారు కూడా ఆనందించేలా ఉండాలి. ఎంత కంగారు పడ్డానో తెలుసా? ఇంటి అరుగు మీదకు తోడేలు రావటమేమిటి? పిచ్చిదాన్ని. అంతా నమ్మేసాను."

“ఇప్పుడు నేను ఎక్కడ ఉన్నానో తెలుసా? అడవి మధ్య గెస్ట్-హవుస్ లో. దీని పేరు కూడా గమ్మత్తుగా ఉంది. మానస మందిరం అట. ఇక్కడకి తోడేళ్ళూ, నక్కలూ వస్తాయని వాచ్-మెన్ చెప్పాడు. ఇలా జరిగితే ఎలా ఉంటుందా అని సరదాగా చిన్న కథ అల్లి దేవిగారికి చెప్పాను. ఇంతకూ అక్కడ నువ్వు ఏం చేస్తున్నావు?"

"నాకూ నిద్ర పట్టలేదు. బయట వరండాలోకొచ్చి చూస్తే పెద్ద వర్షం. చూస్తూ నిలబడ్డాను. స్కూటర్ల మీద వెళ్ళేవాళ్ళు స్లో చేసి ఆగుతూ ఉంటే లోపలికి వచ్చేసాను. ఇడియెట్స్. ప్రకృతిని కూడా ఆస్వాదించనివ్వరు".

"అర్ధరాత్రి అవుతోంది. ఇక వెళ్ళి పడుకో."

"పడుకుంటాను కానీ మీరిక అడ్వంచర్స్ ఏమీ చేయకండి. రేపు పొద్దున్నే బయలుదేరి వచ్చేయండి" అంటూ మాలతి అటునుంచి ఫోను పెట్టేసింది.

ఆకాశం చీలిపోయేలాగ ఒక పెద్ద మెరుపు. ఆ మెరుపులో ఒక స్త్రీ వేగంగా నడుచుకుంటూ రావటం గమనించాను. ఒక క్షణం నేను చూస్తున్నది నిజమా కాదా అని అనుమానం కలిగింది. అంత అర్ధరాత్రి అలా నడిచి వస్తున్నదెవరు?

గేటు మీద చేయి వేసి లోపలకు రాబోతూ వరండాలో నిలబడ్డ నన్ను చూసి తటపటాయించింది. గట్టిగా "ప్లీజ్ కమిన్" అని అరిచాను. వర్షంలో పూర్తిగా తడిసిపోయి ముద్దయిపోయినట్టుంది. "నాగరాజు లేడా?" అని అడిగింది.

"ఔట్ హవుసులో ఉంటాడు. మీరు?" అని అడగబోయి అంతలో ఆగి "ముందు తల తుడుచుకోండి. పూర్తిగా తడిసిపోయారు. నేను ఈలోపు నాగరాజుని పిలుస్తాను" అంటూ ఆమె ఏదో అనబోతూంటే వినకుండా లోపలకు వెళ్ళి టవల్ తీసుకొచ్చి ఇచ్చాను. మొహమాటపడకుండా ఆమె దాన్ని తీసుకోవటం నాకు నచ్చింది.

"మీ పేరు?" అని అడిగాను.

"అరుంధతి" అన్నదామె. ఆ తరువాత నేను అడగబోయే ప్రశ్నలన్నీ ముందే ఊహించుకున్నట్టు "మా ఇల్లు నారాయణపురం. అది స్వయంసిద్ధ మద్య నిషేధ ప్రాంతం. మా నాన్నకి మందు లేకపోతే నిద్ర పట్టదు. సాయంత్రం రామన్నపేట వెళ్ళాడు. ఇప్పటివరకూ రాలేదు. వెతుక్కుంటూ వెళుతూంటే మధ్యలో వర్షం తగులుకుంది. ఇక్కడ వాచ్-మెన్ నాగరాజు నాకు బాగా తెలుసు. వర్షం తగ్గేవరకూ ఉందామని ఇటు వచ్చేసాను. ఈ అతిథిగృహంలో ఈరోజు ఎవరూ ఉంటారనుకోలేదు" చెప్పింది.

"పర్లేదు లెండి. ఇక్కడ రెండు గదులున్నాయి కదా. వర్షం తగ్గేవరకూ ఉండండి. ముందు వేడివేడి టీ తాగుదాం" అన్నాను.

...

అయిదు నిముషాలు గడిచేసరికి ఆమె ఎంతో కలివిడిగా సంభాషించసాగింది. ఒకతే కూతురు. తల్లి కూలీపని చేస్తూ మానేసింది. ఆమెకు క్షయ. తండ్రి చూస్తే వ్యసనపరుడు. పని లేదు. తనే కుటుంబాన్ని పోషించాలి. అక్కడే స్కూల్లో టీచర్గా పనిచేస్తోంది. ఎనిమిదొందలు ఇస్తారు. "...మా అమ్మకి నెలకి ఇంజెక్షన్లకే పదివేలదాకా అవుతుంది. నా జీతం ఎనిమిది వందలు. చూస్తూచూస్తూ తల్లిని పోగొట్టుకోలేను కదా. మా నాన్న చూస్తే ఇలా తయారయ్యాడు. ఏం చేయాలో అర్థం కావట్లేదు" అని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంది.

"రాత్రికి ఎంత తీసుకుంటావు?" అడిగాను.

ఆమె చివాలున తలెత్తింది.

నవ్వాను. "చాలా అద్భుతంగా అబద్ధం చెప్పావు కానీ, ఏమాత్రం తెలివైన వాడైనా ఇట్టే పట్టేస్తాడు".

ఆమె మాట్లాడలేదు. రక్తం ఇంకిపోయిన మొహం చూస్తే నేను చీకట్లో వేసిన బాణం సరిగ్గానే తగిలినట్టు అనిపించింది.

అంతకు ముందురోజు ఈ అతిథి గృహంలో దిగినప్పుడు వేస్ట్ బాస్కెట్లో వాడిపోయిన పూవులు కనబడ్డాయి. అది చూసి తడబడిన నాగరాజు "మీ ముందు గదిలో ఒక జంట దిగారండీ. వాళ్ళు పడేసి వెళ్ళిపోయుంటారు. చూసుకోలేదు. క్షమించండి" అన్నట్టు మాట్లాడాడు. విజిటర్స్ బుక్లో సంతకం పెడుతున్నప్పుడు గత వారం రోజులుగా ఈ గెస్ట్-హవుస్ లో ఎవరూ దిగలేదని చూశాను. ఒకటి ఒకటీ కలిపితే రెండయినట్టు ఈ విషయాలన్నీ కలిపితే నాకు విషయం అర్థమయింది. బహుశ నాగరాజు ఈమెకు కబురు చేసి ఉంటాడు. అతనికి కూడా ఇందులో వాటా ఉండి ఉంటుంది.

"మీరు చెప్పింది నిజమే. మూడువేలిస్తే నేను ఈరాత్రికి ఇక్కడే ఉండిపోతాను" అంది.

"ముందు టీ తాగు. తర్వాత మాట్లాడదాం" అంటూ టీ స్టవ్ మీద పెట్టి ఆమెతో సంభాషించాను. అప్పటి వరకూ మర్యాదగా మాట్లాడిన నేను ఏకవచనంలోకి తెలియకుండానో దిగిపోయాను. "ఏం చదువుకున్నావు నువ్వు?"

"బి.ఎస్.సి. స్టాటిస్టిక్స్" అంది. ఈసారి ఆశ్చర్యపోవటం నా వంతయింది. "అంత చదువుకుని..." తర్వాత ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. నా ప్రశ్న అర్థమయినట్లుగా ఆమెచెప్పింది "నా కథంతా నిజమే. అమ్మకి క్షయ. నాన్న తాగుబోతు. వాళ్ళను వదిలేసి నేను పట్నం వెళ్ళి ఏ రెండువేల జీతానికో పని చేస్తే వీళ్ళను చూసుకోవటానికి ఇక్కడ ఎవరూ ఉండరు. అందుకనే మా పల్లెలోనే ఉంటూ నా జీతం రాళ్ళతో వాళ్ళను పోషిస్తున్నాను. పై రాబడి ఎలానూ ఉంటుంది కదా" అంటూ నవ్వింది.

"మీరింత ధైర్యంగా తలుపు తీసుకొని లోపలకు వచ్చేశారు కదా. లోపలున్నవారు ఎవరో తెలీకుండా అలా రావటానికి ధైర్యం ఎలా వచ్చింది?" నాకు తెలియకుండానే తిరిగి బహువచనంలోకి దిగిపోయాను.

"ప్రాణ భయం అడవిలో పులిని కూడా మనిషి ఎదుర్కొనేలా చేస్తుంది. ఆకలి అవసరం ఎంతటి సాహసానికైనా ఒడిగట్టేలా చేస్తుంది. అందుకే రిస్కు తీసుకుంటాం" అంది.

“కానీ నాకు అవసరం లేదని నేను అక్కడికక్కడే వెనక్కు పంపించేస్తే మళ్ళీ వర్షంలో తడుచుకుంటూ ఇంటికి వెళ్ళవలసిందేగా."

"నా అనుభవంలో తొంభై శాతం మగవాళ్ళెవరూ అలా వెనక్కు పంపించలేదు."

"మగవాళ్ళ మీద మీకు చాలా తేలికైన అభిప్రాయం ఉన్నట్టుందే."

“మొగవాళ్ళనే కాదు. ఆడవాళ్ళూ అంతే. పోతే వారు బైటపడరంతే”.

"వివాహేతర సంబంధమున్న పురుషులూ, స్త్రీలూ సమాన సంఖ్యలో ఉన్నారంటారా?"

"కొంచెం దాదాపుగా అంతే. ఒక్కొక్క పురుషుడుకీ పదిమంది స్త్రీలతో సంబంధాలున్నాయని అనుకుందాము. ఆ పదిమంది స్త్రీలకూ వివాహేతర సంబంధం ఉన్నట్టేగా..."

నాకు అర్థం కాలేదు.

ఆమె నవ్వుతూ అంది. "ఒక గదిలో వందమంది పురుషులూ, వందమంది స్త్రీలూ ఉన్నారనుకుందాం. వారిలో ఇరవైమంది శ్రీరామచంద్రులూ, ఇరవై మంది సీతలూ ఉన్నరనుకుందాం. మిగతా మీలాంటి ఎనభై మంది కృష్ణులకీ, ఒక్కొక్కడికీ నలుగురు స్త్రీలతో పరిచయం ఉందనుకుందాం. అంటే... అక్కడున్న ఎనభై మంది స్త్రీలల్లో ప్రతి ఒక్క స్త్రీకీ నలుగురు పురుషులతో సంబంధం ఉన్నట్టేగా. అందులో మన భార్య, చెల్లి, వదిన, చివరికి అమ్మ కూడా ఉండొచ్చు...."

సాచిపెట్టి మొహం మీద కొట్టినట్టయింది.

"... ఏం? నేను చెప్పిన లెక్క తప్పంటారా?"

స్టాటిస్టిక్స్ చదివిన అమ్మాయి ఆవిధంగా చెపుతూ ఉంటే, వాదించటానికి నా వద్ద ఇంకేమీ లేదు. లేచి మూడు వేలిచ్చాను.

"రండి గదిలోకి వెళదాం" అంది.

"వెళ్ళి పడుకోండి. పొద్దున్నే లేచి వెళ్ళిపోండి."

"మరి ఈ డబ్బు?"

"నాకు తెలియని ఒక గొప్ప నిజాన్ని చెప్పినందుకు." ...

తెల్లవారింది. మళ్ళీ అదే స్తంభం దగ్గర నిలబడ్డాను. అరుంధతి వెళ్ళిపోయి గంట అయింది. మాలతి దగ్గర నుండి ఫోన్ వచ్చింది. "ఏం బయలుదేరారా?"

"ఆ. ఇంకో గంటలో బయలుదేరుతున్నాను."

"ఏం చేస్తున్నారు?"

"నిన్న రాత్రి నిలబడ్డచోటే నిలబడి..."

"నిన్న రాత్రి చెప్పిన 'తోడేలుతో యుద్ధం' కథ గురించి ఆలోచిస్తున్నారా?"

"అవును. నీకు కథ చెప్పిన తర్వాత నిజంగానే ఒక తోడేలు 'నా మానసమందిరం'లోకి ప్రవేశించబోయింది. కష్టపడి యుద్ధం చేసి బయటకు తోలేశాను."

"మళ్ళీ ఇంకొక కథ అల్లుతున్నారా? చాల్చాలు. తొందరగా బయల్దేరండి" నవ్వుతూ అన్నదామె.

*'నిన్న రాత్రి వర్షంలో నువ్వు కూడా బయట వరండాలో చాలా సేపు నిలబడి ఉన్నావా?'* అని అడగలేదు.

ఫోన్ ఆపు చేశాను. కొన్ని ఇబ్బందికరమైన ప్రశ్నలు అడగక పోవటమే మంచిది. ఎదుటి వారినీ, మనసునీ కూడా..!

# "ఒరే ఇడియట్" అనుకున్న అరిటాకు కథ

## ఆగష్టు 16, 1978 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక



"మీరెక్కడి వరకూ వెళుతున్నారు?"

కిటికీలోంచి బైటకి కదులుతున్న చెట్లనూ, గుట్టలనూ చూస్తున్న శైలజ ఉలిక్కిపడి తలతిప్పి చూసింది. రాఘవరావు ఆమెనే చూస్తున్నాడు.

రైలు కూతపెట్టుకుంటూ ముందుకు సాగిపోతూంది. కంపార్ట్‌మెంట్లో నలుగురైదుగురుకన్నా ఎక్కువమంది లేరు. ఇద్దరు నిద్రకి జోగుతున్నారు. ఇంకొకాయన ప్రొద్దుటి పేపరు ఇంకా దీక్షగా చదువుతున్నాడు. రాత్రి తాలూకు చీకట్లు కొద్దికొద్దిగా అలుముకుంటున్నాయి.

"సామర్లకోట" అంది శైలజ. ఆమె సన్నగా నాజూగ్గా ఉంది. పలుచటి చెక్కిళ్ళు, గడ్డం మీద ఎడమవైపున చిన్న పుట్టుమచ్చ, కొద్ది నిర్మలంగా ఉన్న తీక్షణమైన కళ్ళూ – పదిమందిలో అందకత్తెలా అనిపించదు కానీ విడిగా కొద్దిపాటి స్నేహంతో ఆమె చాలాకాలం జ్ఞాపకం ఉండిపోతుంది. ఆమె ముక్తసరితనం చూసి అతను మళ్ళీ ఇంకో ప్రశ్న వెయ్యటానికి సాహసించలేదు.

చాలాసేపు మవునంగా ఉండి "హైదరాబాద్‌లో పనిచేస్తున్నారా?" అని అడిగాడు దాదాపు గంట అయ్యాక. ఎక్స్‌ప్రెస్ కాబట్టి ఎక్కడా ఆగకుండా పోతోంది

రైలు.

"అవును – సెక్రటేరియట్‌లో"

"ఏం చదివారు?"

"బి.ఏ"

మళ్ళీ చాలాసేపు మవునం. ఆమె ప్రక్కన కూర్చుని జోగుతున్న ముసలామె ఇక అలా కూర్చోవటం సాధ్యంకాదన్నట్టు కొంచెం కాళ్ళు సాగించి, సర్దుకుని, నడుం వాల్చింది.

బాగా చీకటి పడింది. టి.సీ వచ్చి సీటు నెంబర్లు చెక్ చేసి వెళ్ళిపోయాడు. శైలజ బాగ్‌లోనుంచి 'ఆర్థర్ హెయిలీ' పుస్తకం తీసి చదవటం ప్రారంభించింది.

రైలు కాజీపేటలో ఆగింది.

అతను లేస్తూ – "మీరేమైనా తీసుకుంటారా?" అని అడిగాడు.

ఆమె కొద్ది మొహమాటంతో "అబ్బే వద్దండీ" అంది.

"ఏవీ తీసుకోకుండా ఎలా ఉంటారు?"

"అరటి పళ్ళున్నాయి."

రాఘవరావు నవ్వి "అంత మొహమాటం అయితే ఎలా?" అంటూ బయటికి నడిచాడు.

ఆ రోజెందుకో అంత రష్ లేదు. ప్లాట్ ఫాం పల్చగా ఉంది. ఆమె చూస్తూ ఉండగానే అతను చేతిలో ఏదో పొట్లంతో వస్తూ కనిపించాడు. మరీ అంత పొడుగూ పొట్టీ కాదు. తెల్లపాంటూ చొక్కా కొంచెం విశాలమైన మొహం. క్రాపు నుదుటి మీదకి పడెయ్యాలనే తాపత్రయం.

కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చి "తీసుకోండి" అన్నాడు.

ఆమె అదే మొహమాటంతో "థాంక్స్" అంది.

అతడు తన బాగ్‌లోంచి సీసా బైటికి తీసి, పంపులో నీళ్ళు పట్టుకొచ్చేసరికి ఆమె తినటం పూర్తిచేసి ఆకులు బైటకు వేస్తోంది. అతడు అందించిన నీళ్ళు తీసుకుని కొద్దిగా తాగి, సీసా తిరిగి ఇచ్చేసింది.

ట్రైన్ కూత పెట్టింది. నెమ్మదిగా కదిలింది.

ఈ చర్యతో ఆమెకి స్త్రీ సహజమైన జంకుపోయింది. "మీరెందాకా వెళ్ళాలి?" అని అడిగింది.

అతడు చెప్పాడు. ఆమె కిటికీలోంచి బైటకు కొద్దిసేపు చూసి, తిరిగి పుస్తకం తెరవబోతూ ఉంటే, "మీరు దిగిన తర్వాత ఇంకా నేను ఎంతసేపు ట్రైన్‌లో ప్రయాణం చెయ్యాలి?" అని అడిగాడు.

ఆమె చెప్పింది.

"లాంగ్‌లీవ్ పెట్టి వెళుతున్నారా?"

"లేదండీ నాలుగురోజులు పెట్టాను" అందామె.

"మీరెక్కడ పనిచేస్తున్నారు?"

"ఏ.జి.ఆఫీసులో" అన్నాడతను.

మళ్ళీ ఆమె పుస్తకం చదవసాగింది. అతను సీట్లో ఏమీ తోచక ఇబ్బందిగా అటూ ఇటూ కదలటం తెలుస్తూనే ఉంది. పుస్తకం మూసి "మీరు ఇటువైపు రావటం మొదటిసారా?" అడిగింది.

ఆమె పుస్తకాన్ని మూయడం అతడికి ఆనందం కలిగిందని అతని మొహమే చెపుతోంది.

"అవునండీ" అన్నాడు. "మాది తెలంగాణా."

"ఏజీ ఆఫీసంటే కాంపులెక్కువ ఉంటాయా?"

అతను ఉంటాయన్నట్లు తలూపాడు.

తరువాత ఏం మాట్లాడాలో అతనికి తెలియలేదు, కానీ అతనే అన్నాడు – "మీరు బాగా పుస్తకాలు చదువుతూ ఉంటారా?"

ఆమె చిరునవ్వుతో "ఏమీ తోచదండీ అందుకని" అంటూ అర్థోక్తిలో ఆపుచేసింది.

అతను సమర్థిస్తున్నట్టు "అన్నిటికన్నా ఇది మంచి అలవాటండీ" అన్నాడు.

"మీరూ చదువుతారా?"

"ఆ.. అంత కాకపోయినా కొద్దిగా"

ఆమె కొద్ది ఉత్సాహంతో "మీ అభిమాన రచయితలెవరు?"

చప్పున ఏదో ఒకటి రెండు పేర్లు చెప్పటానికి రాఘవరావు తటాపటాయించాడు. అయినా ఏదో ఒకటి చెప్పాలి కనుక వారపత్రికల్లో కనబడే నలుగురైదుగురు రచయితల పేర్లు చెప్పాడు.

ఆమె అతడి జవాబుతో కొంచెం నిరాశచెందినట్లు కనిపించినా, దాన్ని కప్పిపుచ్చుకుంటూ "బుచ్చిబాబూ, చలం..." అని ఆగి "పోనీ అమృతం కురిసిన రాత్రి...గోపీచంద్" అంది.

రాఘవరావు అస్పష్టంగా తలూపి "మీరు సినిమాలు చూస్తారా? అన్నాడు.

"అప్పుడప్పుడు" అందామె.

రాఘవరావు వేలు విడిచిన మావయ్య ఒకడు మద్రాసులో ఈ ఫీల్డులో స్థిరపడ్డాడు. అతడేం చేస్తూ ఉంటాడో ఎవరికీ తెలియదుకానీ అక్కడి విశేషాలన్నీ విశేషణాల్తో కలిపి వర్ణిస్తూ ఉంటాడు.

ప్రస్తుతం ఆ పనిని రాఘవరావు తీసుకున్నాడు. విషయం ఈ టాపిక్ మీదకి వచ్చేసరికి ఇక అతడికి తడుముకునే అవసరం లేకపోయింది. ఆమెకూడా ముందుకు వంగి, అతడు చెప్పేది ఉత్సాహంగా వినసాగింది. అతడు చెప్పటం పూర్తి చేసేసరికి ఆమె అభినందిస్తున్నట్లు "మీకు ఈ విషయాలు చాలా తెలుసే" అంది.

"మీలాంటి అందమైన అమ్మాయి ఎదురుగా ఉంటే ఏమీ తెలియకపోయినా చాలా మాట్లాడవచ్చు" అన్నాడు.

ఈ మాటల్లో ఏదైనా లేకితనం ఉందా అని ఆమె అతడివైపు చూసి, అటువంటిదేమీ కనబడకపోవటంతో "థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్" అంది దాన్ని తేలికగా తీసుకుంటూ.

"ఎప్పుడూ నేను మాట్లాడటమే. మీరేమీ మాటాడరేం?" అన్నాడు.

ఆమె చిరునవ్వుతో "ఏం మాట్లాడను?" అంది.

"మాట్లాడాలనుకుంటే ఏమైనా మాట్లాడవచ్చు. రొమాన్స్ నుంచి రోదసీయానం వరకూ."

అతడి ప్రాసకి ఆమెకి నవ్వొచ్చింది. నిజానికి ఆమె స్నేహితుల్తో చాలా హుషారుగా, చిలిపిగా ఉంటుంది. అయితే మగవాళ్ళతో మాత్రమే స్త్రీ సహజమైన రిజర్వ్‌డ్‌నెస్‌తో మసులుకొంటుంది. అయితే ఇతడి కలుపుగోలుతనం ఆమె బిడియాన్ని పోగొట్టింది. ఆమె వొరేషియస్ రీడర్. ఆ కారణంగా ఆమె మాట్లాడాలనుకుంటే తడుముకునే అవసరమేమీలేదు.

రాజకీయాల్లో మొదలై, స్పోర్ట్స్ వైపుకి వెళ్ళి మద్యనిషేధం మీదుగా వారపత్రికల్లో వచ్చే కథలూ – ఫాషన్లూ – కాలేజీ చదువుల మీదకి వెళ్ళింది సబ్జెక్టు.

గంట గడిచే సరికి ఆమెకి అతడెంతో దగ్గర స్నేహితుడిగా కనిపించాడు. ట్రైన్ ఏదో స్టేషన్‌లో ఆగి, కూతపెట్టి ముందుకు సాగింది. చల్లటిగాలి నెమ్మదిగా వస్తోంది. రాఘవరావు సిగరెట్ వెలిగించుకున్నాడు. రైలు కుదుపుకి నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది శైలజ. మళ్ళీ చిన్న జర్కుతో రైలు ఆగటంతో

ఆమె కళ్ళు విప్పేసరికి లైట్ల వెల్తుర్లో పట్టపగల్లా విజయవాడ ప్లాట్‌ఫాం కనిపించింది. ఆమె తలతిప్పి చూస్తే, అప్పటివరకూ తననే చూస్తున్న రాఘవరావు కనపడ్డాడు.

జుట్టుపాయని చెవి వెనక్కి తోసుకుంటూ నిద్రకళ్ళతోనే నవ్వింది.

"మాట్లాడుతూనే నిద్రపోయారు" అన్నాడు.

ఆమె టైం చూసుకుంది – ఒంటిగంట.

దాదాపు మూడుగంటలు నిద్రపోవటం వల్ల తేలిగ్గా ఉంది. లేచి కళ్ళు, మొహం కడుక్కుని వచ్చింది. కంపార్ట్‌మెంట్‌లో నుంచి ఒకరు దిగిపోయారు.

"టీ తాగుతారా?"

ఆమె వద్దన్నట్లు తలూపింది.

"మీకు బ్రదర్సు, సిస్టర్సూ ఉన్నారా?" అడిగాడు.

"లేరు"

"అదృష్టవంతులు."

"మీకు?"

ఆమె సర్దుకుని కూచోవటంతో చీరకుచ్చిళ్ళు అతని కాలిమీద పడ్డాయి.

"ముగ్గురు చెల్లెళ్ళు" అన్నాడు.

"అయితే మీకు చాలా కట్నం కావాలన్నమాట" అందామె.

"లేదు మా ఫాదర్ చాలా ప్రిన్సిపుల్డ్" అన్నాడు. కాజువల్‌గా కాలు ముందుకు జరుపుతూ.

ఆమె కాలు వెనక్కి తీసుకుని "మరి మీరు?" అంది.

"నేను ఆలోచించవలసింది నా కొడుకుల సంగతి, నాకింకా పెళ్ళికాలేదు కదా" నిజానికి రెండో వాక్యం ఇక్కడ వాడాల్సిన పనేలేదు.

ఆమె తలతిప్పి బైటికి చూడసాగింది. చీకట్లో ఎక్కడో దూరంగా దీపం వెనక్కి కదుల్తుంది. పై బెర్తు మీదినుంచి ఎవరో "ఏలూరొస్తోందా?" అని అడిగారు.

"ఆ, ఇంకో పావుగంటలో"

పైనున్న వాళ్ళు దిగి, బెడ్డింగులు సర్దుకునేసరికి స్టేషన్ వచ్చింది. ఇద్దరూ దిగిపోయారు. పక్కన కూర్చున్న ముసలతను పైకి వెళ్ళి పడుకున్నాడు.

ట్రైన్ కదిలింది.

"నేను చాలా అదృష్టవంతుణ్ణి" అన్నాడు రాఘవరావు.

ఆమె కొద్ది ఆశ్చర్యంతో "ఎందుకు?" అని అడిగింది.

"ఈ ఒంటరి ప్రయాణంలో ఇలా ఒక మంచి స్నేహితురాలు దొరికినందుకు"

"ఆ మాట నేననాలి"

అతను వప్పుకోనూ అన్నట్టుగా తల అడ్డంగా ఊపాడు.

"పోనీలెండి. ఇక ఆ పరస్పర పొగుడుకోవటాలు వదిలిపెడదాం" అన్నదామె నవ్వుతూ.

"ఒక్క విషయం మాత్రం నిజం" అన్నాడు.

"ఏమిటి?"

"మిమ్మల్ని చేసుకోబోయేవాడు చాలా అదృష్టవంతుడు."

ఆమె సిగ్గుతో "ప్లీజ్. ఇక ఆ సంగతి వదిలిపెట్టండి" అంది.

ఆమె దిగాల్సిన ఊరు దగ్గరపడుతున్న కొద్దీ అతడిలో అదోలాటి దిగులు ఆవరించసాగింది. కొంచెం సేపట్లో ఆమె ఆగిపోతూ ఉందంటే అతనికెలాగో ఉంది. ఈ రైలు ప్రయాణం ఇలానే సాగిపోతే బావుణ్ణు అన్న భావన.

అతనన్నాడు – "మొదట్లో మిమ్మల్ని పలకరిద్దామా, వద్దా అని చాలాసేపు తటపటాయించాను. రెండు మూడు ప్రశ్నలకి మీ ముక్తసరి జవాబు చూసి నామీద మీకు సదభిప్రాయం ఏర్పడలేదేమో, నేను మిమ్మల్ని ఇంప్రెస్ చెయ్యలేదేమో అనుకున్నాను."

ఆ మాటలకు ఆమె నొచ్చుకుంటున్నట్టు "సారీ" అంది.

"దీంట్లో క్షమాపణ ప్రసక్తేముంది నలుగురు మగవాళ్ళ మధ్య పనిచేసే వాళ్ళు ఆ మాత్రం రిజర్వ్‌డ్‌గా ఉండకపోతే కష్టం."

ఆ మాటలు ఆమెకి నచ్చినట్టు "మీరు చెప్పింది నిజమే" అంది.

కొంచెంసేపు నిశ్శబ్దం.

అంతసేపూ మాట్లాడినవాడికి గమ్యం దగ్గర పడి విడిపోవాల్సిన టైం వచ్చేసరికి మాటలే దొరకటం లేదు.

"విడిపోవటం బాధాకరం" అన్నాడు.

"అవును ఎక్కడో కొటేషన్ చదివాను. టాగూర్‌ది అనుకుంటా" అందామె ఆలోచిస్తూ.

"మీవి, నావీ భావాలు చాలా వరకు కలుస్తాయి" అన్నాడతను.

కిటికీలోనుంచి బైటకు చూస్తున్నదల్లా తలతిప్పి అతడివైపు చూసింది. మాట్లాడలేదు.

తూర్పు బాగా ఎర్రబడింది. షుగర్ ఫాక్టరీ గొట్టం దాటిపోయింది.

రైలు ప్లాట్‌ఫాం మీదికొచ్చి ఆగబోతూ ఉంటే "నాన్నగారొచ్చారు" అంది చిన్నపిల్లలా సంబరపడుతూ.

రైలు ఆగింది.

ఆమె "వెళ్ళొస్తానండీ నమస్తే" అంది చేతులు జోడించి.

అతడు విషాదంగా "మళ్ళీ రావటం ఏముంది? వెళ్ళిపోతున్నారు" అన్నాడు.

ఆమె నవ్వి ముందుకు కదిలింది.

"శైలజగారూ" అన్నాడు.

ఆమె ఆగి వెనక్కి తిరిగింది.

కరస్పర్శ కోసం అన్నట్టుగా చెయ్యి సాచాడు. ఆమె క్షణం విస్తుబోయినా అతడిమీదున్న గౌరవంతో తన తటపటాయింపు కనపడనివ్వకుండా చెయ్యి అందించి దిగిపోయింది.

రాఘవరావు కాకినాడ చేరుకునేసరికి ఎనిమిదయింది. స్నానం చేసి పడుకుంటే క్రితం రాత్రి నిద్రలేకపోవటం వల్ల దాదాపు మూడింటికి మెలుకువ వచ్చింది.

హోటల్ రూం నుంచి ఫోన్ చేశాడు.

అతడు టిఫిన్ తిని, రెడీ అయ్యేసరికి ఒకాయన వచ్చారు. బక్కపల్చగా ఉన్నారు. నలభై అయిదేళ్ళుంటాయి. పరస్పర పరిచయాలయ్యాక "వెళ్దామా?" అన్నారు. రాఘవరావు తలూపాడు.

టాక్సీ చిన్న బంగళా ముందు ఆగింది. చుట్టూ ప్రహరీగోడ, గులాబీ చెట్లు.

ఇద్దరూ వెళ్ళి ముందు గదిలో కూర్చున్నారు. రాఘవరావుతో రెండు నిముషాలు మాట్లాడి ఆయన లోపలికి వెళ్ళొచ్చారు. అయిదు నిముషాల తర్వాత అమ్మాయొచ్చింది.

ఆమె వచ్చే సమయానికి రాఘవరావు గుప్పెటతో మిక్చర్ నోట్లో వేసుకోబోతున్నాడు. ఆమెని చూడగానే అతడికి పొలమారింది. ఆమె శైలజ.

శైలజ కూడా అతడిని చూసి ఆశ్చర్యపోయింది. అంతలోనే, సర్దుకుంది. ఆమె పెదవుల మీద విరిసీ విరియనట్లు నవ్వు నాట్యం చేసింది.

పదినిమిషాలు కూర్చుని రాఘవరావు లేచాడు. ఆయనతో కలసి బైటికొచ్చి టాక్సీ ఎక్కి హోటల్‌కి వచ్చేశాడు.

ఆరోజే బయలుదేరి తన ఊరు వచ్చేశాడు.

హైదరాబాద్ రాగానే తండ్రికి ఉత్తరం వ్రాసి, ఆఫీసుకి వెళ్తూ వెళ్తూ పోస్ట్ చేశాడు. ఆఫీసులో విశ్వం కనపడ్డాడు.

స్నేహితుణ్ణి పలకరిస్తూ "పెళ్ళిచూపులకి వెళ్ళావట కదోయ్ – ఏమైంది?" అని అడిగాడు రాఘవరావుని.

"నచ్చలేదని వ్రాసేశానోయ్"

"ఏం? బాగోలేదా?"

"అమ్మాయి బాగా ఉంది కానీ చాలా ఫాస్టోయ్ మనకి సరిపోదు" అన్నాడు రాఘవరావు..

# టాస్

## ఆగస్టు 19, 1981 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

సునీల్ గవాస్కర్ బొటన వేలు పైకెత్తి తన ఆటగాళ్ళవైపు చూసి టాస్ గెల్చినట్టు సైగ చేసేడు. నేలమీద నాణాన్ని వంగి తీస్తున్న క్లైవ్ లాయిడ్ తో 'బ్యాటింగ్' అన్నాడు.

వెస్టిండీస్ కీ, భారత జట్టుకీ మధ్య జరుగుతూన్న మూడో టెస్ట్ పోటీ అది. మొదటి రెండు టెస్టులూ డ్రా అవటంతో మంచి ఉత్సాహకరంగా ప్రారంభం కాబోతూంది.

గవాస్కర్ బ్యాటింగ్ అని చెప్పగానే ప్రకాష్ లేచి డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్ళాడు. రెండు నిముషాల్లో ప్యాడ్స్, గార్డు కట్టుకున్నాడు. వెస్ట్ ఇండీస్ ఆటగాళ్ళు ఫీల్డ్ లోకి ప్రవేశిస్తున్నారు. అంపైర్లు ముందే వెళ్ళిపోయారు. ప్రేక్షకులతో గాలరీలు అప్పటికే క్రిక్కిరిసిపోయాయి. వాళ్ళ అల్లరితో అంత రణగొణ ధ్వనిగా ఉంది.

"బాగా ఆడు. బెస్ట్ ఆఫ్ లక్" అన్నాడు విశ్వనాద్. క్రితం రాత్రి బీరుకొడుతూ తన మొదటి టెస్ట్ విశేషాలూ, ఎంత టెన్షన్ తో ఆట ప్రారంభించిందీ చేప్తూంటే ప్రకాష్ శ్రద్ధగా విన్నాడు.

ముందు ఫీల్డింగ్ అయి ఉంటే ఆ వాతావరణం కొంచెం అలవాటు అయి ఉండేది. కానీ అలా కాలేదు. అదీగాక తను వోపెనింగు రన్నర్! అతడికి కొద్దిగా భయంగా ఉంది.

గవాస్కర్ తో పాటు డ్రెస్సింగ్ రూమ్లోంచి బయటికి వచ్చేడు ప్రకాష్. ఇద్దరు ముగ్గురు ఆట గాళ్ళు అభినందనలు తెలిపారు. ఆటగాళ్ళలో అతడికి అత్యంత సన్నిహితుడు కిర్మాని నవ్వుతూ 'వెళ్ళిరా' అన్నట్లు బొటనవేలు పైకెత్తాడు.

మెట్లు దిగి, అతడు ఆటస్థలంలో ప్రవేశించాడు. అతడూ, గవాస్కర్ కలిసి బౌండరీ లైను దాటి లోపలికి వెళ్తూంటే ఆకాశాన్నంటేలా చప్పట్లు ! ఆ చప్పట్లూ–తమ పట్ల వారికున్న అభిమానం–అంతా చూస్తూంటే ఆతడి ఒళ్ళు జలదరించింది. ఆ అవ్యక్తానందం జీవితంలో ఒక స్థాయికి చేరుకున్న కళాకారులకే తెలుస్తుంది క్రికెట్ గానీ...రచన గానీ... అంతకాలం వరకూ పడిన కష్టపు ఫలితాన్ని అనుభవించటంలో ఉండే ఆనందం అది! ఏ ఫీల్డయినా ఒకటే !

దాదాపు వరుసగా ఆరు రంజీ ట్రోఫీల్లో సెంచరీ కొట్టాడు ప్రకాష్, ఆంధ్ర జట్టుకు ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించి పెట్టాడు. ఆతడు మంచి ఆఫ్ స్పిన్నర్ కూడా. ఎన్నిక చేసే అధికారుల దృష్టి అతడిమీద పడి, సౌత్ జోన్ కు ఎన్నుకున్నారు. అక్కడ కూడా ఆతడు తన బౌలింగ్ తో వెస్ట్ ఇండీస్ ని తికమక పెట్టటంతో, టెస్ట్ కి సెలెక్ట్ చేశారు.

మెట్లు దిగుతూ అతడు వోరగా డ్రెస్ సర్కిల్ పక్కకి చూసేడు. తన వైపే చూస్తున్న సైలజ పెదవుల్ని గుండ్రంగా చేసి గాలిలోనే అందించింది. చాలా జాగ్రత్తగా దాన్ని అందుకొన్నట్టు, నవ్వి తల పంకించాడు. ఆమె కళ్ళలో అభినందన కనిపిస్తూంది. ఆమె పక్కనే స్నేహితురాళ్ళు కూర్చున్నారు. తనకన్నా ఆమే ఎక్కువ ఎగ్జైట్ మెంట్ తో ఉన్నట్లు ఆమె కూర్చున్న విధానం తెలుపుతూంది. ప్రపంచ ప్రఖ్యాత ఆటగాడు గవాస్కర్ తో కలిసి స్థలం మధ్యకు నడవటాన్ని అతడు తన జీవితంలో మరిచిపోలేని అనుభవం. రెండు నిముషాల్లో వాళ్ళు వికెట్ వద్దకు చేరుకున్నారు. గవాస్కర్ ముందు బ్యాటింగ్.

భారతదేశపు బెస్ట్ అంపైర్ స్వరూప్ కిషన్ కి రెండడుగుల దూరంగా నిలబడ్డాడు ప్రకాష్. గవాస్కర్ గార్డ్ తీసుకున్నాడు. ఆండ్రీ రాబర్ట్స్ బౌలింగ్. మొదటి బంతిని గవాస్కర్ ముందుకొచ్చి ఆడేడు. రెండు, మూడు, నాలుగు బంతుల్ని వదిలేసేడు. అయిదో బంతిలో రెండు పరుగులు తీసుకున్నాడు. ఆరో బంతి వదిలేసేడు.

వోవర్ పూర్తి అయింది.

ఫీల్డర్స్ ఇట్నుంచి అటు మారుతున్నారు.

గవాస్కర్ మధ్యకొచ్చి ప్రకాష్ తో అన్నాడు... "జాగ్రత్తగా ఆడు. మొదటి మూడు నాలుగు బంతులు ఆడగల్గితే, అలవాటయి పోతుంది. మొట్ట మొదటి మ్యాచ్ కదూ. బెస్ట్ ఆఫ్ లక్." ప్రకాష్ తలూపి తన స్థానంలోకి వచ్చాడు. అందరూ సర్దుకున్నారు.

ఉన్నటుండి ఆ ప్రదేశం, ఆటగాళ్ళూ, ప్రేక్షకులూ అంతా నిశ్శబ్దం అవటాన్ని అతడు గమనించేడు. కొన్ని వేలమంది జనం ఈ కొత్త ఆటగాడు ఎలా ఆడబోతున్నాడని గమనించటానికి ఉత్సుకతతో చూస్తున్నారు. ఆ నిశ్శబంలో అతడి శరీరం వణికింది. చేతిలో బ్యాట్ కూడా! ఎవరి కైనా అది తప్పదేమో– మొట్టమొదటిసారి టెస్ట్ బ్యాట్ పట్టుకున్నప్పుడు.

బవులింగ్ ఎవరు చెయ్యబోతున్నారు అని చూసేడు ప్రకాష్. ఎవరూ కనబడలేదు. అతడు కొద్దిగా కంగారుపడి, మరింత పరీక్షగా చూసేడు. దూరంగా బవుండరీ లైన్ దగ్గిర కనబడ్డాడు.

మైకేల్ హోల్డింగ్!

ప్రపంచంలోకెల్లా అతి వేగంగా బంతులు విసిరే వాళ్ళలో ఒకడు! బంతిని కుడి చేత్తో పట్టు కొని వస్తున్నాడు. ఆంతదూరం నుండి అతడు వస్తుంటే -- అదే ఒక పరుగు పందెంలా ఉంది హోర్డింగ్ స్వీట్ బవులర్ అని ప్రతీతి. అతడు బంతి విసరటంలో పరుగెత్తటంలో రిథమ్ ఉంది. అతడు వికెట్ దగ్గిరగా వచ్చాడు. చెయ్యి తిప్పుతూ అంపైర్ని దాటేడు. ఆ తరవాత బంతిని వదిలి పెట్టాడు. అతడి చేతిలో ఉన్నంత సేపూ బంతి కనబడిందంతే! ఆ తరవాత అది మాయమైంది. ఏదో చిన్న నలకలాటిది గాలి కన్నా వేగంగా దూసుకు రావటం తెలుస్తూంది. క్షణంలో వెయ్యవ వంతు తన పక్క నుంచి 'స్' మన్న శబ్దం చేసుకుంటూ ఏదో వెళ్ళిపోయింది. అతడు బ్యాట్ కొద్దిగా ఆప్ సైడ్ జరిపేడు.

ఒక్కసారిగా ఆ నిశ్శబ్దంలోంచి సముద్రపు హోరు లాటి తరంగాల ధ్వని. విపరీతంగా జనం గోల!

ఏమైంది? బంతి స్లిప్స్ లోంచి బవుండరీ లైన్ దాటిందా! అతడు స్లిప్స్ వైపు చూసేడు అక్కడున్న ముగ్గురు ఫీల్డర్సూ బవులర్ ని అభినందించటానికి వెళ్ళటం చూసి అప్పుడు చూసుకున్నాడు తన వికెట్ వైపు.

ఆఫ్ స్టంపు ఎగిరి దాదాపు నాలుగు అడుగుల దూరంలో పడి ఉంది.

★ ★ ★ ★

"ఇంత బేవార్స్ గా ఆడతావని కలలో కూడా అనుకోలేదు. ఛీ" అంది శైలజ. ప్రకాష్ మాట్లాడలేదు.

"మా ఫ్రెండ్సందరూ ఎంతగా నవ్వుకున్నారో! కొంతమంది అడిగేసేరు కూడా "ఏవోయ్, మీ వాడు అక్కడ భరతనాట్యం చేసేదేమిటీ అని."

ప్రకాష్ మొహం రోషంతో ఎర్రబడింది. అయినా అతడు ఆవేశాన్ని కంట్రోల్ లో పెట్టుకున్నాడు. "నేనేం చెయ్యను? అక్కడ సరిగ్గా సర్దుకోలేకపోయాను. చాలా మంచి బంతి అది. ఎంతమంచి బంతి అంటే దానికి గవాస్కరూ, విశ్వనాథూ అయినా కంగారు పడేవాళ్ళే ! అదే ఫస్ట్ బంతి కావటంతో మరింత కంగారుపడ్డాను." నన్నర్థం చేసుకోమన్నట్టు అతడు అభ్యర్థించేడు. కానీ సైలజ పరిస్థితి వేరుగా ఉంది. ఆమె, ప్రకాష్ ప్రేమించుకున్నారని చాలా మందికి తెలుసు. చాలామంది ఈర్ష్య పడ్డారు కూడా. ప్రకాష్ అందమైన వాడు. దానికి తోడు ఇండియన్ ఓపెనింగ్ బాట్స్ మన్! అందుకే ఇలా అతడు ఓటమి చెందటం వారికి బాగా సంతృప్తి నిచ్చింది. ముఖ్యంగా సైలజ స్నేహితురాళ్ళమని చెప్పుకుంటూన్నవారికి. ఆమెని ప్రొద్దున్నించీ, అంటే ప్రకాష్ అవుట్ అయిన దగ్గర్నుంచీ సాయంత్రం వరకూ ఏడిపిస్తూనే ఉన్నారు.

సాయంత్రానికల్లా ఇండియా బ్యాటింగ్ పూర్తయింది. నూట అరవై పరుగులకు అందరూ అవుట్ అయ్యారు.

మరుసటి రోజు వెస్ట్ ఇండీస్ బ్యాటింగ్ ప్రారంభం అయింది. గ్రీనిడ్జ్ హెయిన్స్ కలిసి డెబ్బై పరుగులు తీసేరు. లాయిడ్ నలభై పరుగులతో ఆడుతున్నాడు. ఇండియాని ఇన్నింగ్ డిఫీట్ తో వోడగొట్టాలన్న తపన అవతలి టీమ్ లో ప్రతి ఒక్కరిలోనూ కనబడుతూంది.

వాళ్ళ స్కోరు 175–3 ఉండగా, చంద్రశేఖర్ నుంచి బంతి తీసుకొని ప్రకాష్ కిచ్చాడు కెప్టెన్. అప్పుడు బ్యాట్స్ మన్ వివ్ రిచర్డ్స్ రైట్ హ్యాండర్. ప్రపంచంలో కెల్లా రెండవ గొప్ప బ్యాట్స్ మన్ గా ప్రసిద్ధికెక్కిన వాడు. ఆట స్థలంలో కొద్దిగా నవ్వించేది అతడే. మిగతా వెస్టిండియన్స్ అందరూ చాలా సీరియస్ గా ఉంటారెప్పుడూ.

వికెట్ కి ఆరు గజాల దూరంలో నిలబడ్డాడు ప్రకాష్ బంతి పట్టుకుని..

రిఛర్డ్స్ 'విసురు' అన్నట్టు సైగ చేసేడు. అప్పటికే అతను డెబ్బై పరుగులతో ఉన్నాడు. జనం బాగా గోల చేస్తున్నారు. రిఛర్డ్స్ ఆ రోజు ఆట పూర్తయ్యేలోపులో సెంచరీ సాధించాలనే పట్టుదలతో ఉన్నాడు.

ప్రకాష్ గుండెనిండా గాలి పీల్చుకున్నాడు. బంతిని తిప్పటానికి వీలుగా చూపుడు వేలూ, మధ్య వేలూ మధ్య పట్టుకున్నాడు. అంపైర్ పక్కకి తొలగ్గానే పరుగెత్తుకుంటూ వచ్చి గుడ్ లెంగ్త్ తో వేసేడు. బంతి పడి స్పిన్ అయి, వికెట్ మీదకి వెళ్ళింది. అయితే అంతకు ఒక క్షణం ముందే బ్యాట్స్ మన్ పొజిషన్ లోకి వచ్చి కవర్స్ లోంచి డ్రైవ్ చేసేడు. ఒక క్షణం బంతి కనపడలేదు. ఆ తరవాత ప్రేక్షకుల గోల మధ్యలో అది ఆకాశంలో కాకిలా ఎగురుతూ కనిపించి గాలరీలోకి వెళ్ళి పడింది.

సిక్స్ !

'ఛీ' అనుకొన్నాడు ప్రకాష్. తన మీద తనకే అసహ్యం వేసింది. జీవితపు మొట్టమొదటి టెస్ట్ బంతి! ఆరు పరుగులు!!

ఇంతలో అతడి చేతికి బంతి తిరిగి వచ్చింది. ఈ సారి 'గుగ్లీ' వేయదల్చుకున్నాడు. అదే అతడు చేసిన తప్పు! ఇంకా పూర్తిగా బంతి అలవాటు కాకుండానే గూగ్లీ వేయబోవటం ! ఫలితం... అది ఫుల్ టాస్ అయింది. మళ్ళీ ఇంకో సిక్సరు!

వోవర్ పూర్తయ్యేసరికి ఆరు బంతుల్లోనూ మూడు సిక్సర్లూ, మూడు బవుండరీలతో రిఛర్డ్స్ వంద పరుగులు పూర్తి చేసేడు. జనం పోలీసుల్ని దాటుకొని వచ్చి అతనిని అభినందిస్తున్నారు.

కొంత దూరంలో ఒంటరిగా దాదాపు ఏడుపు తక్కువగా నిలబడి ఉన్నాడు ప్రకాష్. ఒక కుర్రాడెవడో అతడి మీద తినేసిన అరటి పండు తొక్క విసిరేసేడు. జనం అతడిని చూసి నవ్వుతున్నారు.

★ ★ ★ ★

రాత్రి ఒంటిగంట అయింది. అతడికి నిద్ర పట్టలేదు. లేచి గదిలోంచి బయటకొచ్చాడు. చుట్టూ వెన్నెల. మధ్యలో అతడు ఒంటరిగా... నిశ్శబ్ధంగా...

అతడికి తన గతం గుర్తొచ్చింది. తన తండ్రి బ్యాట్ పట్టుకోవటం నేర్పటం... చదువు కూడా లక్ష్యపెట్టకుండా క్రికెట్ ఆడటం.. కృషి పట్టుదలా సాధనాలుగా ఎండలో చెమటతో నిర్విరామంగా చేసిన ప్రాక్టీసూ.

చేసినదంతా ఒక్క రోజులో పోయింది ! ఆ దుఃఖం కేవలం అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. నిజమైన స్పోర్ట్స్ మన్ కే తెలుస్తుంది.

ఆ రోజు సాయంత్రం తిరిగి శైలజకీ, అతడికీ గొడవైంది. ఆ అమ్మాయిని స్నేహితురాళ్ళు ఎంతగా అల్లరి పట్టిస్తున్నారంటే ఆమె వూరు తిరిగి వెళ్ళిపోతానంటుంది. బలవంతం మీద ఆపు చేశాడు. దాదాపు ఏడుస్తూ "బాటింగ్ అంటే భయం అనుకోవచ్చు. బవులింగ్ కేమయిందీ? హాయిగా వెయ్యచ్చుగా" అంది. నిజమే ! కానీ ఏదో అవుతూంది తనకి. ఏదో బెరుకు!

గవాస్కర్ లాంగ్ ఆన్ లో నిల్చోమన్నప్పుడు ఆ బెరుకుతోనే నిలబడ్డాడు. తనకి కొద్ది గజాల దూరంలో శైలజ కూర్చుని ఉందని తెలుసు. ఇంతలో ముర్రే బంతిని గాలిలోకి లేపాడు. విపరీతమైన గొడవ. వెనుక సైలజ 'కాచిట్' అని అరుస్తూంది. పట్టుకోబోయే సమయానికి సూర్యకాంతి కళ్ళలో పడి వదిలేసేడు. ఎప్పుడూ కామ్ గా ఉండే విశ్వనాథ్ కూడా సీరియస్ గా చూడటం తనకి బాధ కలిగించింది. వాళ్ళు మాత్రం ఏం చేస్తారు? అప్పటికే వెస్ట్ ఇండీస్ 350–5 లో ఉన్నారు. వోటమి తప్పని సరి అవుతూంది. ఆ సాయంత్రం మళ్ళీ ఆమె అతడిని కలిసింది. ఆమె తిడుతూంటే మవునంగా భరించాడు. ఎంతోమంది తన దేశీయులకు ఆమె ప్రతినిధి అని అతడికి తెలుసు. దేశం మొత్తం తనని తిడుతున్నట్టు ఉంది. "నీకసలు ఏం చేతకాదు" అంది సైలజ. "కేవలం రికమండేషన్ మీద టెస్ట్ లోకి తీసుకున్నారు నిన్ను అంటున్నారు మా వాళ్ళు."

అప్పుడు మాత్రం ప్రకాష్ విలవిలలాడి పోయేడు. చాలా సున్నితమైన చోట తగిలిన దెబ్బ అది. గుండెనిండా వ్యథ. కళ్ళ నిండా నీళ్ళు.

★ ★ ★ ★

ఆట నాలుగో రోజులోకి ప్రవేశించింది. లాయిడ్ 575–7 దగ్గిర డిక్లేర్ చేశాడు. ఒకటిన్నర రోజు పాటూ ఇండియా ఆడాలి. అప్పుడు ఇన్నింగ్స్ డిఫీట్ నుంచి తప్పించుకుంటుంది.. అంతే గెలిచే ప్రసక్తి లేదు 415 పరుగులు తీసి ఇంకా ఆ పైన ఎక్కువ చేయటం అసంభవం కాబట్టి.

లంచ్ పూర్తవగానే ఇండియా బ్యాటింగ్ ప్రారంభించాల్సి వచ్చింది.

గవాస్కర్ తో కలిసి వికెట్ దగ్గిరకి నడుస్తూ అన్నాడు. "నేనూ; నేనూ, ఐ, ఐయామ్ సారీ?" గవాస్కర్ సున్నితంగా అతడి భుజం తడుతూ "పర్లేదు, జాగ్రత్తగా ఆడు" అన్నాడు ఆ సమయంలో ఆ రెండు మాటలూ అతడికి ఎంతో వోదార్పునిచ్చాయి! ఆ మాత్రం స్నేహ పూరితమైన స్పర్శ కోసం అతడు ఆ పరిస్థితుల్లో చాలా తపిస్తున్నాడు.

మొదటి వోవర్ పూర్తయింది. గవాస్కర్ పరుగులు చేయలేదు ఆ వోవర్లో. ఇక్కడ పరుగులు కాదు ముఖ్యం. మరుసటి రోజు సాయంత్రం వరకూ నిలబడగలిగితే చాలు. వోవర్ పూర్తవగానే ప్రకాష్ బ్యాటింగ్ వచ్చింది. ఈ సారి ఆండీ రాబర్ట్స్ ది బవులింగ్. చాలా పొడవుగా సీరియస్ గా ఉండే రాబర్ట్స్ ఒక సారి ప్రకాష్ వైపు క్రూరంగా చూసేడు. అతడు విసిరిన బంతి తుపాకీ గుండుకన్నా వేగంగా వచ్చింది. ప్రకాష్ ఎడమ కాలు ముందుకు జరిపి, నెమ్మదిగా గ్లాన్స్ చేసేడు. ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య లెగ్ స్లిప్ లోంచి బంతి బవుండరీ దాటింది. గవాస్కర్ అభినందిస్తున్నట్టు చెయ్యి వూపేడు. జనం చాలా సేపటి వరకూ చప్పట్లు కొడుతూనే ఉన్నారు. సైలజ అయితే కుర్చీలోంచి లేచి నిలబడి చెయ్యి వూపుతూంది.

ఇంతలో రాబర్ట్స్ రెండో బంతి వేసేడు. అతడెంత కర్కశంగా ఆ బంతి విసిరేడో, అంత సజావుగా దాన్ని లేట్ కట్ చేసేడు.

మళ్ళీ హర్షధ్వానాలు.

పళ్ళు బిగించి రాబర్ట్స్ వెనక్కి వెళ్ళాడు. అతడి ఫేవరిట్ బాల్! బవున్సర్ ! పడీ పడటంతోటే తారాజువ్వలా ఆరడుగుల ఎత్తు లేచింది. ఆ బంతి గానీ తగిలితే ప్రకాష్ చిన్న మెదడు బయటకు వచ్చేసేదే. కానీ ప్రకాష్ చులాగ్గా ప్రక్కకి తప్పుకుని గాలిలోనే బంతిని బ్యాట్ తో హుక్ చేసేడు. ఒక క్షణం అంతా నిశ్శబ్దం. బంతి వెళ్ళి స్టేడియంలో పడగానే జనం వేసే విజిల్స్, చప్పట్లతో స్టేడియం నిండిపోయింది. అతడికిప్పుడు బంతి మామూలుగా కనిపించ సాగింది. అసలే మంచి స్ట్రోక్ ప్లేయరు. దానికి తోడు ఇదివరకు లేని ఆత్మవిశ్వాసం వచ్చి చేరింది. చాలా జాగ్రత్తగా ఆడసాగేడు. టీ టైమ్ కి స్కోరు అరవై పరుగులకు చేరింది. ఆ మరుసటి రోజు నూరు పరుగుల దగ్గిర గవాస్కర్ అవుటయ్యాడు. వరసగా అమరనాథ్ విశ్వనాధ్ కూడా అవుటవడంతో మళ్ళీ టెన్షన్ మొదలయింది. అప్పటికి స్కోరు 110–3.

టీ టైమ్ కి పరిస్థితి మరింత విషమించింది 175–7. కిర్మానీ చాలా సేపు నిలబడగలిగేడు కానీ హుక్ చేయబోయి స్లిప్ లో క్యాచ్ ఇచ్చేసేడు.

టైమ్ నాలుగయ్యేసరికి ప్రేక్షకులు కుర్చీచివర్లకి చేరుకుని ఉద్వేగంతో చూడసాగేరు. తొమ్మిదో వికెట్ పార్ట్నర్ షిప్ లో చంద్రశేఖర్, ప్రకాష్ ఆడుతున్నారు. వోవర్ అయ్యేసరికి అంతవరకూ ఆగగలిగినందుకు జనం చప్పట్లు కొడుతున్నారు. మళ్ళీ కొత్తది మొదలయ్యే సరికి ఉద్వేగం. వెస్ట్ ఇండీస్

కెప్టెన్ లాయిడ్ మొహం సాయంత్రపు కాంతిలో కసితో మరింత నల్లగా మెరుస్తూంది. తన జట్టు బౌలర్లనందర్నీ ఒకరి తరవాత ఒకర్ని మారుస్తున్నాడు. అయిదు బంతులాడటం, ఆరో బంతిలో ఒక పరుగు తీసి అటు వెళ్ళటం చేస్తున్నాడు ప్రకాష్. చంద్రశేఖర్ ని సాధ్యమయినంత వరకూ బ్యాటింగ్ వైపు రాకుండా చేస్తున్నాడు. పరుగు తీసినప్పుడల్లా జనం ఉత్సాహ పరుస్తున్నారు. ఏక్షణం అయినా ఆటస్థలం లోకి దూసుకు వచ్చేలా ఉన్నారు. పోలీసులు కాపలా కాస్తున్నారు.

నాలుగు... నాలుగుంపావు..

ఆఖరి మూడు వోవర్లు.. రెండు... జనం టెన్షన్ లో నిలబడి పోయారు. అరవటం కూడా లేదు.

గార్నర్ ది ఆఖరి వోవరు. రాక్షసుడిలా బంతి పట్టుకుని వస్తున్నాడు. అప్పటికి దాదాపు అయిదు గంటలనుంచీ ఆడుతున్నాడు ప్రకాష్. చాలా నిస్సత్తువగా వున్నాడు. వరసగా నాలుగు బౌన్సర్లు. ఒక ఫుల్ టాస్ వేసేడు గార్నర్.

ఆఖరి బంతి.

బౌండరీ లైన్ దగ్గిరనుంచి పరుగెత్తుకుంటూ వచ్చి విసిరేడు. ప్రకాష్ చాలా కామ్ గా దాన్ని డ్రైవ్ చేసేడు. బంతి దొర్లుకుంటూ వెళ్ళిపోయింది.

అంతే, ప్రవాహం కట్టలు తెంచుకొన్నట్టు జనం... అభినందనలు.. పోలీసులు.. ప్రకాష్ వాళ్ళ సాయంతో డ్రెస్సింగ్ రూమ్ వైపు పరుగెత్తాడు. గవాస్కర్, విశ్వనాధ్ కంగ్రాచ్యులేషన్స్ చెబుతున్నారు.

పోటీ డ్రా అయింది.

★ ★ ★ ★

"మార్వలెస్! అసలు అప్పుడే నిన్ను ముద్దు పెట్టేసుకుందా మనుకున్నాను. కానీ అమ్మో జనం. నిజంగా హీరోవే అయిపోయావ్" అంటూంది శైలజ.

అతడి మొహం భావరహితంగా ఉంది. గెలుపు అతడిలో స్తబ్దతని కలగ జేసింది. సక్సెస్ గంభీరతని ఆపాదించింది.

ఆమె మాట్లాడుతూంది. ప్రవాహం లాంటి మాటలు. పొగడ్తలు, ఫ్రెండ్స్ ఆమెని ఎలా కంగ్రాట్స్ చేసిందీ... వగైరా, వగైరా. అంతా విన్నాడు అతడు. చివరికి అన్నాడు:

"నేను నిన్ను ప్రేమించింది నువ్వు నా దుఃఖంలో పాలు పంచుకుంటావని. అంతే కానీ నా గెలుపులో కాదు. ఐయామ్ సారీ సైలజా. నేను నిన్ను ప్రేమించలేను. ఏ వ్యక్తికైనా గెలుపూ, ఓటమీ రెండూ తప్పవు. అందులోనూ స్పోర్ట్స్ మన్ అంటే చిన్న పిల్లవాడి లాటివాడు. తల్లి తరువాత తల్లి లాటి ప్రేయసి ఒడిలో సేద తీర్చుకుందామనుకుంటాడు. ముఖ్యంగా వోడిపోయినప్పుడు."

ఆమె ముఖం వాడిపోయింది. లేచి నిలబడింది. ప్రకాష్ ఒక మాట అన్నాడూ అంటే అది ఆవేశంలో అన్నది కాదనీ, ఎన్నో నిర్ణయించుకునే అలా అంటాడనీ ఆమెకి తెలుసు. అతడు తలుపు తెరిచి పట్టుకొన్నాడు. ఆమె వెళ్ళి పోయింది.

అతడూ బయటికొచ్చి రెండు చేతులూ పాంటు జేబుల్లో పెట్టుకుని శూన్యంలోకి చూస్తూ నిలబడ్డాడు.

అతడికి తెలుసు తన గెలుపుకిది ప్రారంభం అని ! ఇక అంతా విజయ పరంపరే కావచ్చు. తన చుట్టూ ఇక జనం చేరతారు. అభినందిస్తారు. ఐ లవ్యూ అంటారు. తను కనుక్కోలేడు – ఎవరు తనని తనుగా నిజంగా ప్రేమిస్తున్నారో – ఎవరు తన కళని ప్రేమిస్తున్నారో – ఎవరు తన గెలుపుని ప్రేమిస్తున్నారో !

ఎంత బాధామయ స్థితి ఇది !

# బ్రహ్మర్షి

ఇండియా టు డే – వార్షిక సాహిత్యసంచిక - 1994


యండమూరి వీరేంద్రనాథ్

ఒక్కచోట అతని భావాలు కీట్స్ పొయెట్రీని మించి పోయాయి. ఫీలింగ్స్ ప్రధానంగా ఇంతవరకూ ఎవరూ ఇంత బాగా రాయలే దనిపించింది.

కొత్తగా కొన్న ఫియట్ కారుని తీసుకుని బయలు దేరాను. నేను వెళ్తున్నది శశాంక ఇంటికి. నేను కారు కొని రెండు రోజులయింది. అతని ఇంటికి ప్రత్యేకంగా వెళ్ళాటానికి కారణం నేను కారు కొన్నానన్న విషయం అతనికి తెలియాలని! అందుకనే నా మిత్రులనీ, ఎడిటర్ లనీ, నా శ్రేయోభిలాషులందరినీ వదిలేసి మొట్ట మొదటి సారి అతని దగ్గరికి బయలుదేరాను. ఎందుకంటే, అతను నా ప్రథమ శత్రువు కాబట్టి! మేమిద్దరం బాగ మాట్లాడుకుంటాం. సాహితీ సభలో బాగా ఉపన్యాసాలిస్తాం. అతను నన్ను పొగుడుతాడూ __ నేనతన్ని పొగుడుతాను. కానీ మనసులో మాత్రం నేనతన్ని ద్వేషిస్తాను. అతను కూడా నన్ను ద్వేషిస్తున్నాడో లేదో నాకు తెలీదు. ఎందుకంటే అతనెప్పుడూ బయట పడలేదు... నాలాగే !

అలా అని మేమిద్దరం రచనా వ్యాసంగాన్ని ఒకేసారి ప్రారంభించలేదు. మేమిద్దరం ఒకే వయసు ఉన్నవాళ్ళం కూడా కాదు. అతను నా కన్నా చిన్నవాడు. నాకో చిన్న తమ్ముడుంటే అతనంత వయసుండేది.

నేను మొట్ట మొదట్లో డిటెక్టివ్ కథలూ, జోకులూ, చందమామ కథలూ రాసేవాడిని. తరువాత నవలా రంగంలోకి వచ్చాను. నేను వచ్చినప్పుడు తెలుగు సాహిత్యంలో పాపులర్ రైటర్స్ అనేవాళ్ళెవరూ లేరు. నేనే నంబర్ వన్. ఒకరిద్దరు రచయిత్రులున్నా కూడా మగవాళ్ళలో నన్ను బీట్ చేసే వాళ్ళెవరూ లేరు.

అలా పది సంవత్సరాలు నేను రాజ్యమేలాను – సాహితీ రంగంలోకి శశాంక ప్రవేశించేంతవరకూ.

"నమస్తే సర్... నా పేరు శశాంక." నమ్రతగా చేతులు జోడిస్తూ అన్నాడతను. పది సంవత్సరాల క్రితం జరిగిన ఆ సంఘటన నా కింకా కళ్ళకి కట్టినట్టే ఉంది.

"కూర్చోండి." కుర్చీ చూపిస్తూ, అతని వంక పరిశీలనగా చూశాను. ఆ ముఖంలో నన్నాకర్షించిన అంశం ఒకే ఒక్కటి... అతని కళ్ళలోని నైర్మల్యం!

అతను కూర్చున్నాక, "చెప్పండి" అన్నాను.

"నేను మీ సమయాన్ని కొద్దిసేపు వినియోగించుకోవచ్చా?" స్వచ్ఛమైన ఇంగ్లీష్ లో అడిగాడు.

"విత్ ప్లెజర్!" చిరునవ్వుతో నిర్లక్ష్యంగా అనేసి, రిలాక్స్‌డ్‌గా వెనక్కి వాలి సిగరెట్ ముట్టించాను.

అతనో క్షణం నా వంక మొహమాటంగా చూసి, తన చేతిలోని ఫైలొకటి అందించాడు. తరవాత అన్నాడు. "నేనొక నవల రాశాను. నా అభిమాన రచయిత అయిన మీరు దయచేసి ఈ స్క్రిప్ట్ చదివి మీ అభిప్రాయాన్ని చెబుతారనే ఆశతో వచ్చాను."

సిగరెట్ యాష్ ట్రేలో నలిపేసి, మనసులో విసుగును పైకి కనబడనీయకుండా ముందుకు వంగి ఫైల్ అందుకున్నాను.

"సబ్జెక్ట్ ఏమిటి?"

అతడు కొద్దిగా సిగ్గు పడుతున్నట్టు నవ్వి "యూనివర్సల్ సబ్జెక్ట్, ప్రేమ సర్"అన్నాడు.

"ఇంకా ప్రేమ గురించి రాయటానికంటూ ఏం మిగిలిందయ్యా! ఉన్నదంతా మేమూ, మా సీనియర్సూ రాయడానికే సరిపోయింది" అన్నాను.

"క్షమించాలి సర్! నా దృష్టిలో ప్రేమ అనేది ఎలా అజరామరమైనదో, ఆ సబ్జెక్ట్ కూడా అంతేనని! దటీజ్ ఎవర్ గ్రీన్ సబ్జెక్ట్. ఒక మనిషి మరో మనిషితో ప్రేమించానని చెప్పడం ఎంతో సులభం కానీ, ఆప్రేమలో తను పొందిన అనుభూతిని మాత్రం వర్ణించడం కష్టం. ఆ అనుభవాన్ని పంచుకోవటం సాధ్యమే కావచ్చు. కానీ అనుభూతిని మాత్రం మరొకరికి తెలియజేయడం అసాధ్యం నేను ఎంచుకున్నది రెండో విషయం. కేవలం ఫీలింగ్సే మెయిన్ గా చిత్రించిన నవల ఇది. నా ఉద్దేశ్యం ప్రకారం ప్రతి పాఠకుడూ ఎక్కడో ఓ చోట తనని తను రియలైజ్ చేసుకుంటాడనే అనుకుంటున్నాను..." చాలా నెమ్మదిగా స్పష్టంగా చెప్పాడు. ఆ చెప్పడంలో కాస్త ఆత్మవిశ్వాసం కూడా తొంగి చూసింది.

అతను మాట్లాడే పద్ధతి బావుంది. అయితే, ఒక రచయిత మరో రచయితని కలుసుకున్నపుడు అక్కడ లేని మూడో రచయిత గురించి హేళనగా మాట్లాడుకునే మా ఫీల్డులో ఇంత సున్నితత్వం అసలు పనికి రాదు.

"సరే, అయితే, నేనిప్పుడు కాస్త బిజీగా ఉన్నాను. స్క్రిప్ట్ ఇచ్చి వెళ్ళు ఎల్లుండి మళ్ళీ వస్తే ఆపాటికి చదివేసి చెప్తానెలా ఉందో." సాధ్యమైనంత మెత్తగా చెప్పాను.

అతను మరోసారి నమస్కరించి వెళ్ళిపోయాడు. అతనటు వెళ్ళటం ఆలస్యం, విసురుగా దాన్ని టేబుల్ మీద గిరాటేసి, ఎవరో అభిమానంతో రాసిన ఉత్తరాన్ని అందుకున్నాను. అతను మళ్ళీ వస్తే ఆలోగా ఏదో ఒక వాక్యం చదివి గుర్తుంచుకుని దాని గురించి చెప్తూ, బాగాలేదంటే సరిపోతుంది అనుకున్నాను.

కానీ, ఆరాత్రే నేను స్క్రిప్టంతా చదవాల్సి వచ్చింది.

అందుకు కారణం నా భార్య సౌదామిని!

సాయంత్రం ఆరవుతుండగా సౌదామిని నా గదిలోకి అడుగుపెట్టి అడిగింది. "కాఫీ ఏమయినా కావాలా?"

నేను తలెత్తి, "ఊఁ, నువ్వు కలుపుతూండు, నేనొస్తున్నాను" అన్నాను.

"అలాగే" అంటూ వెనుదిరిగింది. వెళ్ళబోతూ ఆగి, కిందికి వంగి దేన్నో తీస్తూ, "ఇదేమిటి ఇక్కడ?" అంది.

"ఏంటీ?"

"ఏమో, ఏదో పేజీ పడిందిక్కడ" అంటూ అందివ్వబోయి, ఆగి ఆ కాగితంలోని వాక్యాలని చదివింది. చదవటం పూర్తి కాగానే తలెత్తి, "ఎవరు రాశారండీ ఇది?" ఉత్సుకతగా అడిగింది.

"ఏదీ ఇటివ్వు." తీసుకొని చూశాను. శశాంక స్క్రిప్ట్ లోని పేజీ అది. అదే చెప్పాను.

"నేను చదవొచ్చా?"

"తీసికెళ్ళు" అంటూ ఫైలందించాను. ఎలాగూ నేను చదవను కాబట్టి ఆమె చదివాక క్లుప్తంగా తెలుసుకోవచ్చు అనుకున్నాను. సౌదామిని ఆ స్క్రిప్ట్ తీసుకుని వెళ్ళిపోయిన పది నిమిషాల తరవాత నేను కూడా లేచి హాల్లోకి వచ్చాను. సౌదామిని హాల్ లో లేదు. బెడ్ రూమ్ లో దీక్షగా చదువుతూ ఉంది.

ఆ రాత్రి భోజనం చేస్తూండగా అంది సౌదామిని; "అతనెవరో కానీ మనసు లోతుల్లోకి చొచ్చుకుపోయేలా రాశాడు. ఆ స్క్రిప్ట్ చదువుతూంటే నాకెంత ఆశ్చర్యం కలిగిందంటే, ఇరవై ఏళ్ళ నుంచీ ఫీల్డ్ లో ఉన్న మీరు అలాంటి ఒక్క నవల కూడా ఎందుకు రాయలేదా అనిపించింది."

"అంతగా నచ్చిందా?" మామూలుగా అన్నాను. నిజానికి సౌదామిని సగటు పాఠకురాలు కాదు. ఆమె స్క్రిప్ట్ చదివి చెప్పిన అభిప్రాయం మీదే ఇంతకాలం నా సక్సెస్ ఆధారపడిందీ అంటే అతిశయోక్తి కాదు.

ఆమె మౌనంగా ఉండటం చూసి నా ప్రశ్న మళ్ళీ రెట్టించాను.

"అవును. ఇదే అతని మొదటి నవలయితే పబ్లిష్ అవటం ఆలస్యం, మీలాంటి ఒక్కరిద్దరు తప్ప మిగతా రచయితలంతా అస్త్ర సన్యాసం చేయాల్సిందే" అంది.

నా భార్య నా ముందే వేరే రచయితని పొగుడుతుంటే అసూయగా అనిపించింది. అంతగా ఆమెని ఆకర్షించిన అంశం అందులో ఏముందసలు? పడుకునే ముందు కాసేపు తిరగేయాలనుకున్నాను. కానీ, భోజనం అయ్యాక అతని స్క్రిప్ట్ చేతిలోకి తీసుకున్న నేను అక్షరమక్షరమూ విడవకుండా చదివాను. ఒక్కోచోట అతని భావాలు కీట్స్ పొయెట్రీని మించి పోయాయి. ఫీలింగ్స్ ప్రధానంగా ఇంతవరకూ ఎవరూ ఇంత బాగా రాయలేదనిపించింది.

ఆ రాత్రి నేను నిద్రపోలేదు.

ఆ తరువాత శశాంక రాసిన ఆ నవల ఒక ప్రముఖ వారపత్రికలో సీరియల్ గా వచ్చింది. అది అతన్ని పాఠకులంతా గుర్తించేలా చేసింది.

ఇక శశాంకకి తిరుగు లేదు.. అతను నిలదొక్కుకున్నాడూ అంటే అది నేను భరించలేను. నా స్థానాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేను.

తరువాత నేనో నవల రాశాను. ఆ నవలలో ముందు మాట వ్రాస్తూ 'నేను ఫలానా ఇంగ్లీషు నవలని తెలుగులో రాద్దామనుకున్నాను. కానీ ఆ నవలని నా మిత్రుడైన ఒక రచయిత పూర్తిగా యథాతథంగా కాపీ కొట్టి రాసేయటం వల్ల నేను ఆ ఆలోచనను ఉపసంహరించుకున్నాను' అని రాస్తూ, శశాంక నవల కథాంశాన్ని క్లుప్తంగా ముందు మాటలో రాశాను.

ఇలా రాయటం వల్ల నేను నా ప్రత్యర్థి రచయిత అయిన శశాంక ఇంగ్లీష్ నవలలు కాపీ కొట్టి రాస్తాడు అన్న భావాన్ని పాఠకుల్లోకి ఇన్ డైరెక్ట్ గా ఇంజెక్ట్ చేయగలిగాను.

ఇది జరిగిన మూడు నెలలకి శశాంక రాసిన ఒక అద్భుతమైన నవల తెలుగు సాహిత్యంలోకి వచ్చింది. పల్లె సీమలూ... కోనసీమ కొబ్బరాకులూ నేపథ్యంగా – "తాను ఏవో ఇంగ్లీష్ నవలలు కాపీ కొడతాడు" అని అభియోగం వేయలేని విధంగా వేదాల్నీ, ఉపనిషత్తుల్నీ రంగరించి వదిలాడు. దానితో సాహితీ పరుల దృష్టిలో శశాంక విపరీతంగా ఎదిగిపోయాడు.

నిజానికి నేను చాలా ఇంగ్లీష్ నవలలు చదువుతాను. వాటిల్లోంచి కొన్ని ఇన్సిడెంట్స్ ఏరి మొత్తమంతా కాక్ టెయిల్ లా తయారు చేసి మర్కెట్ లోకి వదులుతుంటాను. నేను రాసే రొమాన్స్ అంతా ఇంగ్లీష్ పుస్తకాల్లోది. కామెడీ ఉడ్ హౌస్ ది.

అయితే, నేను చేస్తున్న పనిని నా ప్రత్యర్థి మీద రుద్దాలని చేసిన ఆ ప్రయత్నం ఫెయిలై – అతని లోని అసలైన రచయిత బయటికి రావడానికి కారణమయింది. సాహిత్యంపై పూర్తి అవగాహన ఉన్న పాఠకులందరిలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు శశాంక.

అతన్ని మానసికంగా బ్రేక్ చేయగలిగే ఏ అవకాశమూ నాకిక లేదు అనుకుంటున్న తరుణంలో ఓ రోజు ––

ఒక డైరెక్టర్ నా దగ్గరికి వచ్చి, నా కథని సినిమాగా తీస్తానన్నాడు. ఆ డైరెక్టర్ తెలుగులో మంచి పేరున్నవాడు. నాకు చాలా ఆనందం కలిగింది. నా సంతోషానికి కారణం మొదటి సారిగా నా కథ సినిమాగా వస్తున్నందుకు కాదు. శశాంకకు రాని అవకాశం నాకు వచ్చినందుకు.

వెంటనే ఈ విషయం అతనికి చెప్పడానికి బయలుదేరాను.

నేను వెళ్ళేసరికి అతని ఇంటి ముందు మారుతి థౌజండ్ సి.సి. కారొకటి ఆగి ఉంది. ఎవరయి ఉంటారా అనుకుంటూ లోపలికి అడుగు పెట్టాను.

బయట శశాంక్ అసిస్టెంట్ అనుకుంటాను, కూర్చుని ఏదో రాసుకుంటోంది. నన్ను చూడగానే ఆమె కళ్ళలో గుర్తింపు.

హడావిడిగా లేచి, "సర్ తో మీరొచ్చారని చెప్పమంటారా?" అనడిగింది.

"అవసరం లేదు. లోపలెవరున్నారు?" చనువుగా డోర్ దగ్గరికి వెళ్ళబోతూ అడిగానామెని. "డైరెక్టర్ సోమసుందరన్ తో స్టోరీ డిస్కషన్స్ లో ఉన్నారు."

హఠాత్తుగా ఆగిపోయాను. ఆమె ఏమందో నాకర్థం కాలేదు. సోమసుందరన్ ఏమిటి? శశాంకతో డిస్కషన్స్ కి కూర్చోవడమేమిటి?

"ఏమిటి?" తిరిగి రెట్టించాను. "అవును, సర్. సోమసుందరన్ గారు తెలుసనుకుంటాను. ఆయన శశాంక గారి కథని సినిమా తీయాలనుకుంటున్నారు" అంది.

నేనిక అక్కడ ఒక క్షణం కూడా ఉండలేకపోయాను.

వేగంగా బయటికి నడిచాను. సోమసుందరన్ అంటే మామూలు దర్శకుడు కాదు. ఒకే సినిమాని ఎనిమిది భాషల్లో తీసి హిట్ చేసి రికార్డులోకి ఎక్కినవాడు.

అలాంటి వాడి ముందు నా కథని సినిమా తీయాలనుకున్న డైరెక్టర్ పూచిక పుల్లకి కూడా కొరగాడని అర్థమయిపోయింది.

ఇక ఆ విషయం శశాంకకి చెప్పలేక వెనుదిరిగాను.

★ ★ ★

పది సంవత్సరాలు గడిచాయి.

అంతవరకూ సాహితీ రంగంలో శశాంకని బీట్ చేసే రచయిత ఎవరూ రాలేదు. నేను నంబర్ టూగానే ఉంటూ వచ్చాను. సాధ్యమైనంత వరకూ అవకాశం దొరికినప్పుడల్లా శశాంకపై బురద జల్లడానికే ప్రయత్నించే వాడిని.

తరువాత నా స్టాండర్డ్ కారు అమ్మేసి ఫియట్ కారు ఒకటి కొన్నాను. అది అతనికి చూపించాలని నా తాపత్రయం. అది కొన్న మరునాడే శశాంక దగ్గరికి బయలుదేరాను. ఇప్పుడు ప్రస్తుతం నా ప్రయాణం అక్కడికే.

అతని కొత్త ఇల్లు అద్భుతంగా ఉంది. బ్రహ్మాండమైన మొజాయిక్ ఫ్లోర్, వాల్ టూ వాల్ కార్పెట్, ఖరీదయిన ఫర్నిచర్_అదంతా చూశాక నేను పూర్తిగా కుదించుకుపోయాను.

అక్కడి నుంచి వచ్చాక మొట్ట మొదటి సారిగా నన్ను నేను ఆత్మ పరిశీలన చేసుకున్నాను. అతని అభివృద్ధికి మూలం ఏమిటని శోధించాను. అప్పుడర్థమయింది నాకు. నేను ముందుగా చేయవలసిన పని నా ప్రత్యర్థి స్థానాన్ని దిగజార్చడం కాదు. అతని స్థానాన్ని అధిగమించడం.

నెలకొక నవల ఈజీగా రాసే నేను ఈ సారి ఒక మంచి నవల మొదలు పెట్టాను. అది రాయడానికి నాకు దాదాపు సంవత్సరం పట్టింది. అది రాసేటప్పుడు రాత్రీ, పగలూ, తిండీ, నిద్రా ఏదీ గుర్తులేదు నాకు. నా ధ్యేయం ఒక్కటే. దిగజారిపోయిన నా స్థానాన్ని తిరిగి సంపాదించటమే కాదు, సుస్థిరపరచుకోవాలని.

అన్నిటికన్నా ముఖ్య ఉద్దేశ్యం శశాంకని తెర మరుగుకు వెళ్ళేలా చేయాలని. అన్ని రకాల మసాలాలూ గుప్పించాను. సస్పెన్సు, శృంగారం అన్నీ చొప్పించాను.

కానీ, ఆ నవల నేను ఆశించినంత సక్సెస్ ని తెచ్చిపెట్టలేదు. ఆర్థికంగా కూడా దానివల్ల నాకెటువంటి లాభమూ కలగలేదు. నా స్థానంలో ఎలాంటి మార్పూ లేదు. నా నవల 'ఫెయిల్' అవటానికి కారణం తెలిసింది. అందులో 'మనసు' లేదు.

నేను ఊహించిన విధంగా నా నవల శశాంక స్థానాన్ని అధిగమించడానికి ఏమాత్రం ఉపయోగపడక పోయేసరికి నాకేం చేయాలో తోచలేదు. ఆ నవల మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. కనీసం కమర్షియల్ గా హిట్ కాకపోయినా, నేను బాధ పడేవాడిని కాదు. మేధావుల్లో పేరు కూడా రాలేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకొని ఏం లాభం?

ఇక తిన్నగా ప్రయత్నించి లాభం లేదనిపించింది. నాకున్న పలుకుబడి అంతా ఉపయోగించి ఆ నవలకు రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు కొనుక్కున్నాను. అందుకు నాకు పాతికవేలకి పైగానే ఖర్చయింది. అయినా, నేనేమి బాధపడలేదు. ఖర్చుకన్నా ముఖ్యం అతన్ని అధిగమించడం. అవార్డు ప్రకటించిన తరువాత నాకు బాగా దగ్గరైన ఇద్దరు ఎడిటర్లని పిలిచాను. పబ్లిషర్స్ కూడా వచ్చారు. పెద్ద పార్టీ జరిగింది. వాళ్ళు వెళ్ళేముందు అసలు విషయం చెప్పాను. నాకు అవార్డు వచ్చిన సందర్భంగా ఒక సన్మాన సభ ఏర్పాటు చేయమంటూ. అందుకు ఖర్చు కూడా నేనే భరిస్తానని చెప్పాను. వాళ్ళు సరేనన్నారు. ఈ అభినందన విషయం పేపర్లలో విపరీతమైన ప్రకటనలు గుప్పించాను. ముఖ్య అతిథిగా నా ప్రత్యర్థి శశాంకని పిలవమన్నాను. అంతా అనుకున్నట్లే జరిగింది. నా శ్రేయోభిలాషులు నాకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. శశాంకను ముఖ్య అతిథిగా పిలిచారు. థ్రిల్ ఫీలవుతూ ఆడిటోరియం ముందు కారు దిగాను.

కానీ, అక్కడ హాజరైన సాహితీ ప్రియుల దగ్గర నుండీ ప్రముఖుల వరకూ అందరూ శశాంక చుట్టూ మూగి ఉన్నారు. నన్నెవరూ పట్టించుకోలేదు. రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన నన్నొదిలి నిన్నగాక మొన్న వచ్చిన శశాంక ఆటోగ్రాఫుల కోసం ఎగబడే ఈ జనాల్ని చూసి పిచ్చి కోపం వచ్చింది.

నా ఆనందంలో పడి శశాంక విషయమేదీ పట్టించుకోలేదు.

అసలు విషయం ఆ తరువాత తెలిసింది. అంతకు ముందు రోజే అతనికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

★ ★ ★

అతని స్టేటస్ మరింత పెరిగింది. నేను మాత్రం అవకాశం దొరికితే చాలు, అతన్ని బయటకు లాగాలనే చూసేవాడిని. ఏ చిన్న లొసుగు కూడా దొరకకుండా జాగ్రత్తపడేవాడతను.

తరువాత ఒక కథ రాశాను. అందులో హీరో ఒక రచయిత. అతను అసిస్టెంట్స్ ని పెట్టుకుని, వారినుంచి ఫ్రెష్ ఐడియాలు రాబడుతున్నాడనే అభియోగాన్ని శశాంక మీద అన్యాపదేశంగా మోపాను. అతను రాయడనీ, ఘోస్ట్ రైటర్స్ చేత రాయిస్తాడనీ ప్రచారం చేశాను.

కానీ, ఆ అభియోగం కూడా అతని మార్కెట్ మీదగానీ, కెరీర్ మీద గానీ చిన్న మచ్చకూడా వేయలేకపోయింది. కొద్దిరోజులు నేను శశాంక విషయాల్లో తల దూర్చకుండా నా కెరీర్ గురించి ఆలోచించాలనుకున్నాను. రచయితగా నాకు సంతృప్తినివ్వని నవలలను రాయటం వల్ల నాకెటువంటి లాభమూ కలగదు. అప్పుడు పరిశీలించాను. శశాంక పాఠకుల నాడిని ఎలా పట్టుకోగలిగాడో అర్థమయ్యాక, నేను నా స్టయిల్ మార్చి మరొక నవల రాయాలనుకున్నాను.

రెండు సంవత్సరాల వరకూ విషయ పరిశీలనలో ఉన్నాను. ఆ మధ్యకాలంలో నేను రాసింది ఒకే ఒక్క నవల. అది రాయడానికి కొన్ని వందల పుస్తకాలు రిఫర్ చేయాల్సివచ్చింది. కొన్ని తెగల జీవితాల్ని పరిశీలించవలసి వచ్చింది. నా ఆశయం ఒక్కటే.

అది – శశాంకని అధిగమించే ఒకే ఒక్క నవల రాయాలని.

అది పూర్తయ్యాక తిరిగి వచ్చి, పబ్లిషింగ్ కిచ్చిన తరువాత నా జీవితంలో అంత టెన్షన్ ఎప్పుడూ అనుభవించలేదు. నష్టం కూడా ఆలోచించకుండా తక్కువ ధర మీద డిస్ట్రిబ్యూటర్స్ తో అమ్మించాను.

అంతే, మొదటి కాపీలు విపరీతంగా అమ్ముడవటం ప్రారంభమైంది. చూస్తుండగానే సెకండ్, థర్డ్ ఎడిషన్స్ కూడా జరిగిపోయాయి.

సరిగ్గా అప్పుడే... నేనే కాదు, ఎవరూ ఊహించని విధంగా నా నవలకి జ్ఞానపీఠ్ అవార్డు ప్రకటించబడింది. శశాంకని అధిగమించే గెలుపు. నేనిపుడు నంబర్ వన్ రైటర్ని.

నా పుస్తకాల సర్క్యులేషన్ రెట్టింపు అయింది. జ్ఞాన పీఠ్ అవార్డు వచ్చిన నా పుస్తకాన్ని సోమసుందరన్ డైరెక్షన్ లో సినిమా తీయడానికి అయిదు లక్షలు ఇచ్చి నిర్మాతలు కొనుక్కున్నారు.

నేను అమెరికా యాత్ర చేసి వచ్చాను. ఎక్కడికి వెళ్ళినా సన్మాన సభలూ, ఆటోగ్రాఫులూ.

పబ్లిషర్స్ దగ్గర నా రాయల్టీ పెంచేసేను. ఎడిటర్స్ నా చుట్టూ తిరుగుతున్నారు.

నా ధ్యేయంలో పడి శశాంక ఏం రాస్తున్నాడో, ఏం చేస్తున్నాడో కూడా పట్టించుకోలేదు. ఇకనుంచీ ఏం రాసినా కూడా అవన్నీ నా రచనల తరవాతే. అది మాత్రం తథ్యం. ఎడిటర్లయినా, డైరెక్టర్లయినా నా రచనలకే మొదటి ప్రిఫరెన్స్ ఇస్తారని తెలుసు. అదే నేను కోరుకున్నది కూడా.

ఇంత విజయం సాధించాక, నేను శశాంక దగ్గరికి బయలుదేరాను. నాకు జ్ఞానపీఠ్ అవార్డు వచ్చిందన్న విషయం అతనికెప్పుడో తెలిసి ఉండొచ్చు. కానీ, నా నోటితో చెప్పి, అతడి కళ్ళలో ఈర్ష్య చూడాలని నా ఆశ.

నేనతని ఇంటికి వెళ్ళేసరికి అతనా ఇంట్లో లేడు. అది అమ్మేసి ఊరి చివరి తోటలో ఉంటున్నాడని తెలిసింది. ఆశ్చర్య పోయాను. అంతర్లీనంగా ఆనందపడ్డాను కూడా. గెలుపంటూ రావాలనే గానీ, దాన్ని పెనవేసుకుని మిగతా అదృష్టం కూడా కలిసి వస్తుంది అనుకున్నాను.

వెంటనే అతన్ని కలుసుకోవడానికి బయలుదేరాను. దాదాపు సిటీ లిమిట్స్ లో ఉందా తోట. చిన్నదే అయినా అందంగా ఉంది.

కారు దిగి, గేటు తీసుకుని లోపలికి అడుగు పెట్టాను. అక్కడి వాతావరణం ఒక ఆశ్రమ వాటికలా ఉంది. బాటకిరుపక్కలా పూల చెట్లతో నిండి ఉంది. బాటకెదురుగా ఒక చిన్న కుటీరం. కాస్త దూరంలో ఎడమ పక్క చిన్న పాఠశాల. దాని ముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు. మరో వేపు వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన స్కూల్ ఉంది.

నేను కుటీరం దగ్గరికి వెళ్ళేసరికి – అక్కడ చిన్న వరండాలో పద్మాసనం వేసుకుని భగవద్గీత చదువుతున్న శశాంక కనిపించాడు.

అలికిడికి తలెత్తి, నన్ను చూడగానే భగవద్గీతకు నమస్కరించి, "రండి" అన్నాడు. నేను ముందుకు నడిచి అతను చూపించిన చత్రంజీ మీద కూర్చున్నాను. అతను కూడా నా ఎదురుగా కూర్చుంటూ, "అవార్డు వచ్చినట్టు పేపర్లో చదివాను, అభినందనలు" అన్నాడు.

"కానీ, నువ్వేమిటిదంతా?" అయోమయంగా అడిగాను. అతను నవ్వి ఊరుకున్నాడు. "అంత ఆస్తి ఏం చేశావ్?"

"ఓల్డ్ మెన్ ట్రస్ట్ కి విరాళంగా ఇచ్చాను." అతనదే చిరునవ్వుతో చెప్పాడు.

"ఏమిటి?" విస్తుబోయాను. – "అలా అయితే నువ్వు బ్రతికేదెలా?" అన్నాను.

"మనిషి బతకడానికి ఆ మేడలూ, కార్లూ... ఆ హోదా అవేవీ అక్కర్లేదని తెలుసుకున్నాను. నాకోసం ఈ మాత్రం చాలనిపించింది. ఇక్కడ నేను కడుపు నిండా తినగలుగుతున్నాను. మిగిలింది మరికొందరికి పెట్టగలుగుతున్నాను. ఇందులో నాకు చాలా సంతృప్తి దొరుకుతుంది."

ఒక గాఢమైన నిట్టూర్పు వదిలాను. తిరిగి అతనే అన్నాడు; "అక్కడ మన రంగంలో నాకెప్పుడూ అసంతృప్తిగానే ఉండేది. ఒక్కోసారి మన స్థానాన్ని నిలబెట్టుకోవడం కోసం ఆత్మాభిమానం కూడా చంపుకోవాలి. రచయితగా ఎంతో సాధించినా, ఒక మనిషిగా వ్యక్తిత్వాన్ని చంపుకో లేననిపించింది. అందుకే ఎంతో సంఘర్షణ అనుభవించిన అనంతరం ఈ నిర్ణయానికి వచ్చాను."

"మరయితే ఇక రచనా రంగం నుంచి నిష్క్రమించినట్లేనా?"

"పూర్తిగా, ఇక నేనేమీ రాయలేను. అసలు నేనేమీ చదవలేదు. ముందుగా ఈ ప్రపంచాన్ని చదవాలనుకుంటున్నాను. ఈ రాగద్వేషాల మూలం శోధించాలనుకుంటున్నాను. దీనికి మీరు వైరాగ్యమనో, వేదాంతమనో... ఏ పేరు పెట్టుకున్నా నాకభ్యంతరం లేదు. ముందుగా నాలో ఉన్న 'నేను' అనే భావం గురించి తెలుసుకోవాలి. అంతే!"

ఆ తరవాత నేను బయటకు వచ్చాను. కారులో వస్తుంటే ఒక వాక్యం గుర్తొచ్చింది అతడు రాసిందే.

"జ్ఞానమేమీ లేనప్పుడు నేను గొప్ప జ్ఞానిని అనుకున్నాను. కొద్దిగా జ్ఞానమొచ్చాక నా అంత మూర్ఖుడెవడూ లేడని తెలుసుకున్నాను."

నేను సాంఘికంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలనుకున్నాను కానీ, ఎదుగుదల అనేది ఒక వృత్తం లాంటిదనీ, అది మళ్ళీ కిందికి వచ్చి బయలుదేరిన చోటే ఉంచుతుందని, అదే పరిపూర్ణమయిన వేదాంతమనీ.. అతను తెలుసుకున్నంత తొందరగా నేను తెలుసుకోలేకపోయాను.

ఎప్పుడూ నాకన్నా అతనొక అడుగు ముందే ఉన్నాడు. నాకన్నా వెనుక ప్రారంభించాడు. నన్ను దాటి వెళ్ళాడు. నాకన్నా తొందరగా 'మానసికంగా' ఎదిగాడు. బహుశా నేను వేదాంతిగా మారొచ్చు.

కానీ, అందులో కూడా అతను నా కన్నా ఒక్క అడుగు ముందే ఉన్నాడు.

# నీకస్సలు బుద్ధుందా?

"నేను మెడిసినూ, ఐ.ఐ.టీ చదవను. బి.ఏ. సైకాలజీ చదువుతాను"

"నీకస్సలు బుద్ధుందా? బి.ఏ. చదువుతావా? మెడిసిన్ గానీ, ఐ.ఐ.టి గానీ చదివితే పేరుకి పేరు, డబ్బుకి డబ్బు" నాగేశ్వరరావు కోపంగా, విసుగ్గా అన్నాడు.

సుమద్యుతి తలెత్తి తండ్రి వైపు ఓ క్షణం చూసి తల దించుకుంది.

"ఏం మాట్లాడవేం?"

"ఆలోచిస్తున్నాను"

"గుడ్..! తీరిగ్గా ఆలోచిస్తే పెద్దలు ఎందుకు చెప్తున్నారో అర్థం అవుతుంది."

"నేను ఆలోచిస్తున్నది అది కాదు నాన్నా. 'నీకస్సలు బుద్ధుందా' అన్న మాట నాకు ఊహ వచ్చినప్పటి నుంచీ అమ్మతో ఎన్నిసార్లు అని ఉంటావా? అని ఆలోచిస్తున్నాను. ఇప్పుడీ రోజు నాక్కూడా బుద్ధి లేదన్న నిర్ణయానికి వచ్చేసావు."

షాక్ తగిలినట్టు కూతురి వైపు చూసాడు రావు. మొన్నటి వరకూ చెడ్డీలు వేసుకు తిరిగిన కూతురు ఈ రోజు ఇలా వాదిస్తూ ఉంటే అతడికి ఏం మాట్లాడాలో తెలియలేదు. దూరంగా ఓ మూల తల దించుకుని ఫోన్ తుడుస్తూ ఈ సంభాషణ అంతా వింటూన్న భార్య

వైపు చూసాడు. ఆమె పెదాల మీద నవ్వు కదులుతున్నట్టు అనుమానం వచ్చింది. సంభాషణ మారుస్తూ, "సర్లే. ఇదంతా తరువాత మాట్లాడుకుందాం. తయారవ్వు. ఫ్లయిట్ కి టైమయింది" అన్నాడు.

\+ + +

ఘాట్ రోడ్ మీద కారు బాగ్‌డోగ్రా విమానాశ్రయానికి వెళ్తోంది. డార్జిలింగ్ టీ తోటల మధ్య నుంచి దూరంగా కాంచనగంగ శిఖరం ఎత్తుగా కనపడుతోంది. ఓక్ చెట్లు, పక్కనే ఆర్కిడ్స్ పూలు... వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంది. ఆమె దాన్ని ఆస్వాదిస్తూ ఉండగా, "హైదరాబాదు ఎయిర్-పోర్ట్ లో నిన్ను రిసీవ్ చేసుకోవటానికి మన మేనేజర్ని కి పంపుతానంటే "ట్రిప్ లో థ్రిల్ ఉండదు, వద్ద"న్నావ్. నీ మాట నీదే కానీ నాది ఎప్పుడు విన్నావ్ కనుక? విమానం దిగ్గానే జాగ్రత్తగా సికింద్రాబాదు స్టేషన్ కి వెళ్ళు. నర్సాపూర్ ట్రెయిన్ గుర్తుంచుకో. నువ్వు వెళ్ళే ప్లేస్ ని కోనసీమ అంటారు. ఏం అవసరం వచ్చినా ఫోన్ చెయ్యి. అడ్వంచర్లు ఏమీ చెయ్యకు".

"డార్జిలింగ్ అన్న పేరు బ్రిటీషువాళ్ళు పెట్టారా?" అని అడిగింది.

"కాదు. డోర్జీ అంటే నేపాలీలో పర్వతాల్ని ఏలే దేవుడు... శివుడు".

"శివుడి లింగం డార్జిలింగం అయ్యిందన్నమాట" అంటూ నవ్వింది.

అతడు చిరాగ్గా, "నేనేదో చెప్తూంటే నువ్వేదో అడుగుతావేమిటి?" అన్నాడు.

అమె కారు దిగి బ్యాగ్ అందుకుంటూ, "నీ పెట్టెలో మందులు సర్దుతూ ఇవే జాగ్రత్తలూ అమ్మ చెప్తూంటే నువ్వేమంటావ్ నాన్నా? 'ప్రయాణాలు నాకు కొత్త కాదు. కొత్త కోడలికి చెప్పినట్టు అన్ని సార్లు చెప్పనవసరం లేదు' అని విసుక్కుంటావు. మరి ఇప్పుడు అవే మాటలు నాకు ఎందుకు చెప్తున్నావు?" అంటూ ఓ క్షణం ఆగి పూర్తి చేసింది. "...అది జాగ్రత్తలు చెప్పటం కాదు నాన్నా. నా మీద నీకున్న ప్రేమ..! అవునా..! అదే ప్రేమ అమ్మకీ నీ మీద ఉన్నది. అందుకే జాగ్రత్తలు చెపుతోంది. వెళ్లొస్తాను. బై" అంది.

★★★

ఏ.సి. కంపార్ట్‌మెంటులో కూర్చున్నా ఆదిత్యకి విసుగ్గా ఉంది. అది భయమూ, టెన్షనూ కాదు. ఏదో తెలియని ఇబ్బంది. ఫోన్ చేసి, "మావయ్యా. మీ ఊరు వచ్చేస్తున్నాను. అక్కడి నుంచే ఉద్యోగాలు వెతుక్కుంటాను" అన్నాడు.

"రావోయ్ రా. యు ఆర్ ఆల్వేస్ వెల్-కమ్"

"తిరిగి హైదరాబాదు వెళ్ళను" అంటూ ఇంకా ఏదో చెప్పబోతూ చప్పున ఆగిపోయాడు. ముందు ఒక రకమైన సిగరెట్టు వాసన వచ్చింది. ఎవరో తనలాంటి కుర్రాడు వస్తున్నాడేమో అనుకుంటూ ఉండగా, ఓ పదహారేళ్ళ అమ్మాయి స్లయిడ్-డోర్ పక్కకి జరుపుతూ హడావుడిగా లోపలి ప్రవేశించింది. 'ఎక్కేసాను నాన్నా...' అంటూ కాబిన్ లోకి వచ్చి ఎదుటి బర్త్ మీద కూర్చుంది. తెల్లటి పాల మీద ఎర్రగా కట్టిన మీగడలా ఉంది. జీన్స్ ప్యాంట్ లోకి షర్టు దోపింది. పై బటన్ పెట్టుకోలేదు. లోపల బ్రా లేదు. చేతులు దగ్గరగా పెట్టుకోవటంతో, భుజాలు మరింత దగ్గరగా అయి, మెడ క్రింద గీత లోతుగా కనపడుతోంది. అతడిని చూసి "హాయ్" అంది. ఆ పలకరింపు ఊహించని అతను తడబడి "హలో" అన్నాడు. ట్రయిన్ కదిలింది.

"మైగాడ్. ఇంకో నిముషం లేట్ అయివుంటే రైలు మిస్సయ్యేదాన్ని. ఫ్లయిట్ 'ల్యాండ్' అవటం ఆలస్యం అయిందన్నా వినకుండా నాన్న క్లాసు పీకేవాడు. బైదిబై నా పేరు సుమద్యుతి. డార్జిలింగ్ నుంచి వస్తున్నాను. మీరు?" చక చకా చెప్పేసి చెయ్యి అందిస్తూ అన్నది.

షేక్ హ్యాండ్ ఇస్తూ, "నా పేరు ఆదిత్య. ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్. మీరు... ద్యుతి... అంటే?" అని అడిగాడు.

"ద్యుతి అంటే కాంతి. సుమద్యుతి అంటే పూల కాంతి. పూలకి కాంతి ఏమిటి అని అడక్కండి. వెరైటీ అని అమ్మ పెట్టింది. సుమద్యుతి అనేది ఒక రాగం."

"మీరు ఎక్కడి వరకూ?"

"నరసాపురం. అక్కడి నుంచి ఎదుర్లంక" అన్నది.

"ఓ మై. నేనూ అక్కడికే. ఎదుర్లంక వెళ్ళటం కోసం నర్సాపురం వరకూ ఎందుకు? పాలకొల్లులో దిగిపోండి."

"మా నాన్నగారు కూడా పాలకొల్లులోనే దిగమని చెప్పారు. వెరైటీగా ఉంటుందని ఇలా ప్లాన్ చేసుకున్నాను."

"మీకు ఆ ఏరియా గురించి సరీగ్గా తెలీదనుకుంటాను. నర్సాపురం వరకూ వెళ్ళటం దండగ. దాని ముందు స్టేషనే పాలకొల్లు. అక్కడ దిగితే 'చించి'నాడు వంతెన. అది దాటితే సఖినేటిపల్లి. పక్కనే ఎదుర్లంక"

ఆమె తలపట్టుకుని, "మా నాన్న పోలికలే మీకూ ఉన్నట్టున్నాయి. మీ ధ్యాస మీదే తప్ప అవతలివారు చెప్పేది వినరు. వెరయిటీగా ఉంటుందని చెప్పానుగా. గూగుల్ మ్యాప్ చూసాను. రైల్లో కాస్త ముందుకెళ్ళి నర్సాపురంలో దిగితే అక్కడి నుంచి అంతర్వేది పడవ, ఆ పై వెనక్కి సఖినేటిపల్లి వరకూ బస్సు, చివర్లో ఎడ్లబండి... ఇలా అన్ని రకాలూ ప్లాన్ చేసుకున్నాను" అంది.

ఆమె అలా చెప్తూ ఉండగా టికెట్ కలెక్టర్ లోపలికి వచ్చి, "ఇందులోకి ఇంకెవరూ రావటం లేదు మాడం. మీరు మార్చమంటే పక్క కూపే ఖాళీగా ఉంది" అన్నాడు.

"ఎందుకు? నాకేమీ ప్రాబ్లెమ్ లేదు. ఇక్కడ కంపెనీ ఉందిగా" అంటూ ఆదిత్య వైపు తిరిగి, "నీకేమయినా ఇబ్బందా?" అని అడిగింది. ఊహించని ఆ ప్రశ్నకి ఆదిత్య కంగారు పడి, "అబ్బే... లేదు లేదు" అన్నాడు.

ట్రెయిన్ వేగం పుంజుకుంది. కిటికీలో నుంచి బయటకు చూస్తూంటే ఆమెకి అమ్మ గుర్తొచ్చింది. అమ్మకి తెలుగంటే చాలా ఇష్టం. 'రైల్లో వెళ్తూంటే రాత్రి పూట దూరంగా కనపడే దీపాలు, చెట్ల ఆకుల ప్రమిదల మీద వత్తులు వెలిగించి ప్రవాహంలో వదిలినట్టు ఉంటాయి' అంటుంది. అమ్మా... నాన్నా... ఇద్దరూ మంచివాళ్ళే. తల్లి మంచి సంసారి. తండ్రి గొప్ప వ్యాపారి. కానీ ఇద్దరికీ మధ్య విభేదాల గోదారి.

"ఎదుర్లంకలో ఎవరింటికి?" ఆదిత్య అడిగిన ప్రశ్నకి ఈ లోకంలోకి వచ్చి "మా బాబాయి ఇంటికి" అంటూ వివరాలు చెప్పింది. అతడు కళ్ళు పెద్దవి చేసి దాదాపు అరుస్తున్నట్టు, "ఆయన మా టీచరు గారు"" అన్నాడు. ఒకరికొకరు మరికొన్ని వివరాలు తెలుసుకున్నాక, "మీరు డార్జిలింగ్‌లో ఉన్నారని ఆయన చెప్పేవాడు. అంత వరకే తెలుసు. అసలు ఎలా దూరం అయ్యారు?" అని అడిగాడు.

"ఏముంది? పెద్దలకి ఇష్టం లేని ప్రేమ వివాహం. అమ్మని తీసుకుని నాన్న డార్జిలింగ్ వచ్చేసాడు. ఆ పై అక్కడే టీ-ఎస్టేట్స్. కోట్లు సంపాదన. అమ్మ మాత్రం కోనసీమనీ, కల్చర్‌నీ మర్చిపోలేదు. మొన్నే బాబాయ్‌తో మాట్లాడి నన్ను తన దగ్గరికి పంపుతోంది. 'కోనసీమ వెళ్తున్నావు. కోతి వేషాలు వెయ్యకు' అని హెచ్చరించింది. అఫ్-కోర్స్ నాకూ ఉత్సాహంగానే ఉందనుకో."

"నేను మిమ్మల్ని 'మీరు' అంటూంటే, మీరు నన్ను 'నువ్వు' అంటున్నారేమిటి?"

"ఇద్దరం ఒకే వయసు వాళ్ళం కదా. మీరూ-మీరూ ఏమిటి" అంటూ నవ్వింది. అతడికి ఎక్కడో ఏదో కదిలినట్టయింది. ఆమె వైపు చూసాడు. ఎత్తయిన కొండపై సెలయేరులా క్రిందికి జారిన అందం. క్రింద లోయలా లోతైన నాభి. అతడు బలవంతంగా కళ్ళు తిప్పుకున్నాడు. ఈ లోపులో ఆమె ముందుకు వంగి, "నీ వివరాలు చెప్పు. శలవులకి మావయ్య దగ్గరికి వెళ్తున్నావా? ఆయనకి కూతుర్లున్నారా?" అని కొంటెగా ప్రశ్నించింది.

"లేరు. అక్కడ ఉండి పోవటానికి వెళ్తున్నాను" సీరియస్ గా అన్నాడు.

"అదేమిటి?" అంది ఆశ్చర్యంగా.

"సరే. మొత్తం చెప్తా విను. నువ్వు మీ నాన్న గురించి చెప్తూ, 'తన ధ్యాస తనదే తప్ప అవతలివారి మాట వినరు' అన్నావు చూడు. మా ఇంట్లో పరిస్థితి కూడా అదే. మా తాత ఇంకా ఘోరం. ఇద్దరూ చేరో వైపూ కూర్చుని నాకు క్లాసు పీకుతారు."

"ఎందుకు?"

"ఒకటని కాదు. థ్రిల్ కోసం ఏదో ఒకసారి సిగరెట్ తాగానని తెలిసి తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు నాన్న. ఈ జుట్టు చూడు. ఇప్పుడు మా క్లాసులో అందరికీ ఇది ఫ్యాషన్. ఆడ సన్యాసుల్లా ఆ జడ ఏమిటి అంటాడు. ఒక్క రోజు గెడ్డం గీసుకోకపోతే ఇక ఆ రోజు ఇంట్లో యుద్ధమే. ఇక మా తాతయ్య అయితే తన జ్ఞానాన్నంతా నా మీద వొలక పోస్తాడు. కాస్త ఆవకాయ తింటే ఆరోగ్యం పాడవుతుందంటాడు. కంప్యూటర్ గేమ్స్ ఆడితే కాన్సంట్రేషన్ తగ్గుతుందంటాడు. ఎదురు తిరిగి ఇంకా ఏదైనా మాట్లాడితే 'నా మీసం అంత అనుభవం లేదు' అంటాడు. ఆ ఇంట్లో ఎవరూ నన్ను నాలా బ్రతకనివ్వరు అమ్మతో సహా..! భరించలేక వెళ్ళిపోతున్నాను."

"పెద్ద వాళ్ళు అంతే" అన్నది ఆమె. మరో అయిదు నిముషాల సంభాషణ జరిగాక, "సిగరెట్ ఉందా?" అని అడిగింది. ఊహించని అతడు కంగారు పడి, "లేదు. లేదు. నేను రెగ్యులర్ గా తాగను" అన్నాడు.

"నేను తాగుతాను" అంది.

అతడు మాట్లాడలేదు. ఆమె ఫ్రెష్ రూమ్ కి వెళ్ళింది. అతడు కిటికీలోంచి బయటకు చూసాడు. ట్రెయిన్ లేటుగా నడుస్తున్నట్టుంది. బీబీ నగర్ స్టేషన్ బోర్డు కనపడుతోంది. ఆమె లోపలికి వస్తూ, "అటెండర్ చెప్పాడు. నల్గొండ దగ్గర ఏదో ఆక్సిడెంట్ అనుకుంట. మరో రెండు గంటలు ఈ స్టేషన్ లోనే. అలా బయటకు వెళ్లి వద్దామా? రెండు గంటలు టైముంది కదా. వెళ్లి సిగరెట్లు కొనుక్కొద్దాం."

"నువ్వు రెగ్యులర్ గా సిగరెట్లు తాగుతావా?"

"నిజం చెప్పనా? అబద్ధం చెప్పనా?"

"నిజమే చెప్పు"

"రాత్రిళ్ళు కాస్త డ్రింక్ కూడా"

"పదహారేళ్ళకే డ్రింకా? అయినా ఈ అర్ధరాత్రి సిగరెట్లు ఎక్కడ దొరుకుతాయి?"

"వెతుకుదాం"

"మనం దిగాక ట్రయిన్ కదిలితే?"

ఆమెకు కోపం రాలేదు. నవ్వేసింది. "నీ ప్రశ్నలకి వరుసగా సమాధానాలు చెపుతాను విను. నేను పుట్టింది పెరిగింది హిల్–స్టేషన్స్ లో. అక్కడ డ్రగ్స్ తో సహా ఇవన్నీ మామూలే. అర్ధరాత్రి సిగరెట్లు ఎక్కడ దొరకుతాయన్నావు. వెతికితే కదా దొరికేది. ట్రెయిన్ వెళ్లి పోతే ఏమి చేస్తామన్నది నీ మూడో ప్రశ్న. పదివేలు పడేస్తే టాక్సీ వస్తుంది. అందులో వెళ్తాం. పాలకొల్లు రైల్వేస్టేషన్ కి ఫోన్ చేసి ఫలానా కంపార్ట్‌మెంటులో బ్యాగులున్నాయని చెప్తాం. వాళ్ళు తీసి పెడతారు. ఆ తరువాత జీవితాంతం ఈ అడ్వెంచర్ గురించే చెప్పుకుంటాం. అర్థమయిందా? సరే. నేను వెళ్తున్నాను. నువ్వు వస్తే రా..."

ఇద్దరూ స్టేషన్ బయట కొచ్చి నడవటం మొదలుపెట్టారు. చుట్టూ చీకటి. గాలి బలంగా వీస్తోంది. అతడు నిశ్శబ్దంగా ఉండటం చూసి, “నా గురించి నీకు దాదాపు అంతా చెప్పేసాను. నువ్వు ఏమీ చెప్పలేదేమిటి?” అని అడిగింది.

“నేను ఇంట్లోంచి వచ్చేయ్యటానికి మరో కారణం కూడా వుంది. మా క్లాస్-మేటూ నేనూ ప్రేమించుకున్నాం. ఇళ్ళల్లో వప్పుకోవటం లేదు. బావిలో దూకుతానని అమ్మ ఎమోషనల్ గా బెదిరించింది. పెళ్ళికి వప్పుకోకపోతే ఆ ఇంట్లో ఉండనని నేను కూడా బెదిరించి వచ్చేసాను”

ఆమె కొద్ది సేపు మవునంగా ఉండి, “మంచి పని చేసావ్. ఈ పెద్దలు ఎప్పుడూ ఇంతే. ప్రేమని అర్థం చేసుకోరు. ఏమన్నా అంటే... ‘చిన్నపిల్లవి నీకేం తెలుసు’ అంటారు” అన్నది.

“నువ్వూ ఎవర్నైనా ప్రేమించావా?”

“నాకీ ప్రేమల మీద నమ్మకం లేదు బాస్. అనుభవించు-ఆనందించు అన్నది మన పాలసీ. పోతే... నాకు ఒకందుకు సంతోషంగా ఉంది. చాలామంది పిల్లలు తమ ప్రేమ వ్యవహారం ఇంట్లో చెప్పరు. రెక్కలొచ్చేవరకూ ఆగి, ‘వప్పుకుంటారా? ఇంట్లోంచి వెళ్ళిపోమా?’ అని బెదిరిస్తారు. మీరలా కాదు. ముందే చెప్పారు. అయితే ఒక అనుమానం. పెళ్లి చేసుకోవచ్చుగా. ఎందుకు ఆలస్యం?”

“ముందు స్థిరపడాలిగా. మా ఇద్దరికీ మంచి ఉద్యోగాలు వచ్చేవరకూ ఆగుదామని అనుకున్నాం. నెలకి చెరో యాభై వేలూ లేకపోతే ఎలా బ్రతుకుతాం చెప్పు? నా స్నేహితురాలు కూడా అదే అంటోంది”

“మీ ఆలోచన అక్షరాలా కరెక్ట్.”

“మేము మిగతా ప్రేమికుల్లా కాదు. ఫ్యూచర్ థాట్ ఉంది. ఛాలెంజులు ఎదుర్కోటానికి సిద్దంగా ఉన్నాం.”

“కానీ ఫ్రెష్ ఇంజనీర్లకి అంత జీతం రావటానికి కనీసం అయిదారు సంవత్సరాలు పట్టదూ?”

“ఆగుతాం. ఈ లోపులో వస్తే సరే సరి...”

“రాకపోతే?”

“మా తాత కూడా సరిగ్గా ఈ ప్రశ్నే అడిగాడు. ‘రాకపోతే మీరు చెప్పిన సంబంధమే చేసుకుంటా. లేదా బ్రహ్మచారి గా ఉండిపోతా’ అని చెప్పా. అమ్మా నాన్నలను బాగా చూసుకోవటమే నా ఆశయం.”

“నీ మాటలన్నీ కన్ఫ్యూజింగ్ గా ఉన్నాయి. ఒక వైపు ఇంట్లోంచి వెళ్లి పోతానంటావు. మరోవైపు అమ్మానాన్నల్ని బాగా చూసుకోవాలి అంటావు”.

“మంచి ఉద్యోగం వచ్చి పెళ్లి చేసుకున్నాక... పెద్దలు వాళ్ళే దిగి వస్తారు. అప్పుడు అందరం కలిసి ఉంటాం. పెద్ద జీతం రాకపోతే మాత్రం పెళ్లి చేసుకోము. స్నేహితుల్లా ఉంటాం. ఆ అమ్మాయి ఎవర్నైనా చేసుకుంటుందా... నాలాగే ఉండిపోతుందా... అన్నది తన ఇష్టం. ”

అతడి మాటలతో ఏకీభవిస్తున్నట్టు తలూపి, “మీరిద్దరూ అదృష్టవంతులు. పెళ్లికి ముందు డేటింగ్, రొమాన్స్ చాలా బావుంటుంది కదా. మా క్లాసులో చాలామంది అదే చేస్తారు. మంచి ఫ్రెండ్ ని ఎన్నుకుని ఎంజాయ్ చేస్తారు. ఆ తరువాత బుద్ధిగా పెద్దలు చూపించిన సంబంధం చేసుకుంటారు. ఆ అమ్మాయి మాత్రం ప్రెగ్నెన్సీ రాకుండా చూసుకోవాలి” అంది.

“ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు. మేము అంత నిగ్రహం లేని వాళ్ళం కాదు. మీ కల్చర్ వేరు. మాది వేరు.”

దానికి ఆమె తల అడ్డంగా ఊపుతూ, "ముందు అలాగే అనుకుని ప్రారంభం అవుతుంది. అనుభవం మీద చెపుతున్నాను. అయిదు సంవత్సరాలు కలిసి ఉంటారు కదా. ముందు చేతుల్లో చేతులు వేసుకోవటం, ఆ తరువాత బుగ్గ మీద ముద్దే కదా అని సర్దుకోవటం, శీలం పోనంత వరకూ పవిత్రత పోదు అనుకోవటం, ఆ తరువాత మరి కాస్త ముందుకి వెళ్ళటం... దీని కన్నా మా కల్చరే మంచిది కదా"

ఆ మాటలకి అప్పటి వరకూ పెరుగుతున్న అతడి ఆవేశం ఒక్కసారిగా అగ్నిపర్వతంలా బ్రద్దలైంది. "వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. ఏమిటి మీ కల్చరు? ఏం మంచిది? పధ్నాలుగేళ్ళకి సిగరెట్ మంచిదా? పదహారేళ్ళకే రొమాన్స్ మంచిదా? పైగా దాన్ని సమర్థించుకుంటూ ఒక వాదనా? నిన్ను చూస్తూంటే జాలి వేస్తోంది. చూడూ... నేనూ నా అనుభవంతో చెపుతున్నాను. ఇలా బ్రతికితే పాతికేళ్ళకే జీవితం నిస్సారం అయిపోతుంది. శూన్యంగా బ్రతుకుతావు. చిన్నపిల్లవి. ఆలోచించుకో" అంటూ అతడింకా ఏదో చెప్పబోతూ ఉంటే ఆమె చూపుడు వేలు పైకెత్తి, "అదిగో షాపు" అంటూ అరుస్తూ అటు పరుగెత్తింది. అతను "అది మెడికల్ షాపు" అని అంటున్నా పట్టించుకోలేదు.

తిరిగి రావటానికి అయిదు నిముషాలు పట్టింది. "ఏమిటి ఆ షాపు వాడితో అంత వాదిస్తున్నావ్?" అని అడిగాడు.

"మెడికల్ షాపులో సిగరెట్లు ఉండవ్ అంటూ వెకిలిగా నవ్వాడు. నిరోధ్ ఉందా అని అడిగాను. బిత్తరపోయాడు. అప్పుడు చూడాలి వాడి మొహం. ఓ అరడజను కొన్నాను" అంటూ, మారుతున్న అతడి ముఖ కవళికలు గమనించకుండా, "మా సీనియర్ చెప్తూ ఉంటుంది... ఆడపిల్లల బ్యాగ్ లో ఎప్పుడూ ఒక ప్యాకెట్ నిరోధ్, ఒక పెప్పర్ స్ప్రే ఉండాలట. ఇష్టమైతే మొదటిది, ఇష్టం లేకపోతే రెండోది ఉపయోగించాలట. రెండూ రక్షణకే..."

అతడు అడ్డంగా నిస్పృహగా తల ఊపుతూ, "నీకస్సలు బుద్ధి లేదు. నువ్వీ జన్మలో బాగుపడవ్" అన్నాడు. 'నిజమే. మా నాన్నా అదే అంటూ ఉంటారు' అన్నట్టు ఆమె నవ్వేసింది. ఇద్దరూ వచ్చి కూర్చున్న అరగంటకి రైలు కదిలింది.

మరో గంట గడిచింది. అతడికి నిద్ర పట్టలేదు. పక్క బెర్త్ మీద పడుకున్న ఆమె కదలికలు చూస్తూ ఉంటే, ఆమెది కూడా తన పరిస్థితే అనిపించింది. ఆమె శరీరంలో ఆ ఇబ్బంది కదలిక తన సామీప్యం వల్లనో, డ్రింక్ లేకపోవటం వల్లనో తెలీదు. మొదటిదే కారణం అనుకున్నాడు. ఇంతలో ఆమె కుడిపక్క నుంచి వెల్లకిలా తిరిగింది. కంపార్టుమెంటు నీలి రంగు లైటు వెలుతురు కొండల మధ్య చంద్రకిరణంలా ఆమె మెడ క్రింద తళుక్కున మెరిసింది. అందంతో పాటూ ఆ అమ్మాయి మాట తీరూ, ఈజ్, ముఖ్యంగా... బాడీలాంగ్వేజి లో ఒక స్టైల్ అతడిని ముగ్ధుణ్ణి చేసింది.

లేచి ఆమె దగ్గరకు వెళ్ళాడు.

ఆమె రెండు పెదవుల మధ్య సన్నటి ఖాళీ ఆహ్వానిస్తున్నట్టు కవ్విస్తోంది.

అతడు ముందుకు వంగి ఆమెని ముద్దు పెట్టుకోబోతూ ఉండగా కళ్ళు విప్పింది.

అతడు అలాగే ఆగి ఆమె వైపు చూస్తూ ఉండిపోయాడు.

అతడి ఆవేశపు ఊపిరి మోహానికి వెచ్చగా తగులుతోంది.

ఆమె మొహం పక్కకి తిప్పుకోలేదు.

అతడివైపే కన్నార్పకుండా చూస్తూ, స్పష్టమైన సన్నటి స్వరంతో "ఇదేనా మీ కల్చరు?" అంది.

...

ఆమె నిద్ర లేచే సరికి నరసాపురం వస్తోంది. అతడింకా క్యాబిన్ లో ఉండటం చూసి, "అదేమిటి? పాలకొల్లులో దిగలేదా?" అని ఆశ్చర్యంగా అడిగింది. అతడు సమాధానం చెప్పలేదు. రాత్రంతా నిద్ర లేనట్టు అతడి కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఆమె ఫ్రెష్ అయ్యేసరికి

నరసాపురం వచ్చింది. కారుని అక్కడి వరకూ రమ్మన్నట్టున్నాడు. స్టేషన్ బయట అది రెడీగా ఉంది. అందులో రేవు వరకూ వెళ్లి, అవతలి గట్టు పడవ ఎక్కారు. వశిష్ట గోదారి సముద్రంలో కలిసే చోటు అంతర్వేది. పడవ నెమ్మదిగా వెళ్తోంది. చల్లటి గాలి తెరలు తెరలుగా వస్తోంది. అప్పటి వరకూ మాట్లాడని ఆదిత్య అప్పుడు నోరు విప్పాడు.

"రాత్రంతా ఆలోచించాను. నిన్నటి చర్యకి సిగ్గు పడుతున్నాననీ, నిన్న రాత్రి నీ ఒక్క మాటతో గొప్పగా మారిపోయాననీ... పెద్ద పెద్ద డైలాగులు వాడను. అసలు నేను చెప్పదల్చుకున్నది కూడా అది కాదు. నాకు కారవాన్ సినిమా గుర్తొస్తోంది. నువ్వు నాకన్నా జస్ట్ నాలుగైదేళ్ళు చిన్నదానివి. అయినా నువ్వు సిగరెట్ తాగుతూంటే నాకు నేనే పెద్దరికం ఆపాదించుకుని "పదహారేళ్ళ వయసులో సిగరెట్లేమిటి" అని తిట్టాను. అదే... నాకన్నా యాభై ఏళ్ళు పెద్దయిన తాతయ్య 'కాణీకి ఠికాణా లేకుండా ప్రేమించటం ఏమిటని' తిడితే భరించ లేకపోయాను. మెచ్యూరిటీ అనేది ఎంత రిలేటివ్ టర్మ్..! బ్యాగులో నిరోధ్ పెట్టుకునే నీ కల్చర్ నాకు హీనంగా తోచింది. ఇరవై నాలుగు నెలల క్రితం పరిచయమైన అమ్మాయి కోసం ఇరవై నాలుగేళ్ళు పెంచిన అమ్మని వదిలేద్దామనుకున్న నా కల్చర్ దాని కన్నా ఏవిధంగా గొప్పదో నాకు అర్థం కావటం లేదు. ఇది చెప్పటానికే పాలకొల్లులో దిగకుండా ఇక్కడి వరకూ వచ్చాను".

ఆమె కళ్ళు విప్పారితమయ్యాయి. మనసులో భావాన్ని అంత చక్కగా చెప్పినందుకో, ఆ నిజాయితీకో ఫిదా అయినట్టు అభినందన పూర్వకంగా అతడి వైపు చూసింది.

"సమస్యకి పరిష్కారం వెతకటం వేరు. సమస్య నుంచి పారిపోవటం వేరు. నేను చేసింది అదే" అన్నాడతను. "...ఆర్థికంగా స్థిరపడ్డాక పెళ్లి చేసుకుందామనీ, అప్పటివరకూ ప..వి..త్రం..గా బ్రతుకుదామనీ నేనూ నా గర్ల్-ఫ్రెండూ తీసుకున్న నిర్ణయం ఎంత పెళుసైందో నిన్న రాత్రి నేను చేసిన పనితో అర్థమయింది. పెద్దలు రాజీకి రాకపోతే కలో గంజో తాగి బ్రతకాలా? ఇప్పుడే ఆరోగ్యంగా విడిపోవాలా? నా ఫ్రెండ్ తో చర్చిస్తాను."

"రాత్రి విషయం మర్చిపో ఆదిత్యా..!"

"ఇంకొక్క అనుమానం"

"చెప్పు"

"సిగరెట్లు, డ్రింకు... అంతా అబద్ధం కదూ"

"మన కథకి అది అంత అవసరం కాదనుకుంటున్నాను" నవ్వింది.

అతడు దాని గురించి మరి రెట్టించకుండా, "నేను నీకేం చెయ్యగలను? ఐ మీన్... గిఫ్ట్? ఏదో ఒకటి అడుగు ప్లీజ్. నా సంతృప్తి కోసం" అని అడిగాడు.

ఏమి అడగాలా అన్నట్టూ ఆమె ఒక క్షణం ఆలోచించింది. వాళ్ళని రేవులో దింపిన పడవ సరంగు అవతలి గట్టు గమ్యం చేరుకోవటానికి బలంగా తెడ్డు వేస్తూ ప్రవాహ వేగానికి ఎదురుగా వెళ్తున్నాడు. ఎదురు గాలి వీస్తూనే ఉంది. అయినా పడవ గమ్యం వైపు వెళ్తోంది.

"నన్ను తీసుకు వెళ్ళటానికి మా నాన్న వస్తాడు. నన్ను సైకాలజీ చదివించటానికి ఆయన్ని వప్పించమని మీ మాస్టారుగారికి చెప్పు. అదే నువ్వు చెయ్యగల సాయం" అన్నది సుమద్యుతి.

# ఒక గమ్యం.. రెండు దార్లు

జైలర్ రూమ్ విశాలంగా ఉంది. గదిలో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. ఆ నిశ్శబ్దాన్ని గడియార శబ్దం భంగపరుస్తోంది.

జైలర్ ఎదురుగా ఒక యువతి తెల్లని దుస్తుల్లో కూర్చుని ఉంది. సుదీర్ఘమైన ఆలోచనలో ఉన్నట్లు తల దించుకొని చేతి వేళ్ళ వైపు చూసుకుంటూ ఉన్నది.

ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ 'నమస్తే సర్' అన్న శబ్దం బయటి నుంచి వినబడింది.

జైలర్, అతని ఎదురుగా కూర్చున్న యువతి తల తిప్పి అటు చూశారు.

అక్కడ నిలబడి ఉన్నాడు ఆలీ.

"లోపలికి రా" అన్నాడు జైలర్

ఆలీ లోపలికి వచ్చి వారి టేబుల్ పక్కనే చేతులు కట్టుకొని అభావంగా నిలబడ్డాడు.

"మీరు మాట్లాడుకోండి" అంటూ జైలర్ బయటకి వెళ్ళాడు.

ఒక్క క్షణం అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలింది.

ఆమె సన్నటి స్వరంతో "నా భర్త ని ఎందుకు చంపేశావ్?" అని అడిగింది.

అప్పుడు అర్థం అయింది అతడికి... వచ్చినదెవరో.

రెండు సంవత్సరాల క్రితం జడ్జీ అడిగాడు. అయిదు సంవత్సరాల తరువాత ఇప్పుడు ఈమె అడుగుతోంది.

అతడు  సమాధానం అప్పుడూ చెప్పలేదు. ఇప్పుడూ చెప్పలేదు.

ఆమె లేచి నిలబడింది. గొంతులో సుడులు తిరుగుతున్న దుఃఖాన్ని అతి కష్టం మీద ఆపుకుంటూ, "నా భర్తలో ఏ దుర్గుణాలూ లేవు. అందరికీ ఉపయోగపడే మనస్తత్వం. అలాంటి మనిషిని చంపటానికి నీకు మనసెలా వచ్చింది?" అంది.

అతడు తల దించుకొని మాట్లాడలేదు.

"నాకు సమాధానం కావాలి. రేపు నా ఇద్దరు పిల్లలు ఎదిగిన తర్వాత 'మా తండ్రిని ఎందుకు చంపారు? ఎవరు చంపారు?" అని  అడిగితే ఏమి చెప్పాలి? నీకు ఇప్పటికే శిక్ష పడింది.  ఇదేం కోర్టు కాదు. నిజం చెప్పు. హత్య చేసేటంత ద్రోహం నా భర్త ఏం చేశాడు?"

"నాకేమీ తెలియదు. నన్ను నమ్మండి" అంటూ అతను ఏదో చెప్పబోతుండగా జైలర్ వచ్చి, "మీకు ఇచ్చిన టైం అయింది. వెళ్ళమ్మా" అన్నాడు.

"ఇంకొక నిమిషం సార్. జరిగినదేమిటో ఇతను చెప్తున్నాడు. అది తెలుసుకొని వెళ్ళిపోతాను".

"జైలర్ రూమ్ లో ములాఖాత్ ఏర్పాటు చేయకూడదు. మీ భర్త రాజకీయాల్లో చేరక ముందు నుంచీ, స్టూడెంటు రోజుల్లోనూ నాకు తెలుసు. చాలా మంచివాడు. ఆ గౌరవంతోనే మీరు వీడిని నా గదిలో కలుసుకోవటానికి ఏర్పాటు చేసాను. ఇక మీ అనుమానం గురించి వస్తే... వీడు మీ భర్తని చంపటానికి ఏమీ పెద్ద కారణమంటూ ఏమీ ఉండనక్కర్లేదమ్మా. కాలేజీ రోజుల నుంచే వీడు పెద్ద రౌడీ. మీ భర్త రోజు రోజుకీ ఎదగటం చూసి ఈర్ష్య పడి ఉంటాడు. హత్య చేయటానికి ఇలాంటి వాళ్లకి ఆ మాత్రం కారణం చాలు. వీడు చేసిన పాపానికి మరో పదేళ్లు ఈ జైల్లోనే ఉండాలి. అయినా వీళ్ళు మారరు. వెళ్లిరండి" అన్నాడు.

ఆమె తల ఎత్తి సలీం వైపు చూసి అక్కడి నుంచి కదిలింది. పోలీసు సలీంని తిరిగి సెల్ కి తీసుకెళ్ళాడు.

++ ++ ++

పై సంఘటన జరిగి పది రోజులు అయి ఉంటుంది. సలీం తన సెల్ లో ఉండగా సెంట్రీ వచ్చి ఎవరో ములాఖాత్ కి వచ్చారని చెప్పాడు. సలీం ఆశ్చర్యపోయాడు. వచ్చింది ఎవరో అర్థం కాలేదు. ఆ అయోమయ స్థితిలోనే హాల్లోకి వచ్చిన అతను అక్కడున్న స్త్రీని చూసి మరింత ఆశ్చర్యపోయాడు. ఆమె శ్రీకర్ భార్య.

అతన్ని చూసి లేచి నిలబడి “క్షమించండి. మీ అనుమతి తీసుకోకుండా వచ్చాను” అంది.

సాధారణంగా జైల్లో ఖైదీని కలుసుకోవాలంటే అప్లికేషన్ పెట్టాలి. కలుసుకోవటానికి ఆ ఖైదీ ఒప్పుకోవాలి. అయితే ఇదంతా పేపర్ మీద రూల్ మాత్రమే. ప్రాక్టికల్ గా ఇలా జరగదు.

ఆమె చేతిలో గిన్నె కిటికీ గుండా అతడికి అందిస్తూ, “పండుగ రోజులు కదా. మీ కోసం హలీం తీసుకొచ్చాను” అంది.

అతడు భరించలేనంత విస్మయంతో ఆమె వైపు చూసి, “మీ భర్తని ఎందుకు చంపాను అన్న కారణం తెలుసుకోవడానికి ఆ రోజు వచ్చిన మీరు, ఈ రోజు నాకోసం హలీం తీసుకొచ్చారా?” అడిగాడు.

“మీరు నా భర్తను చంపలేదు”.

అతడు తన చెవుల్ని నమ్మలేనట్టు ఆమెవైపు చూశాడు

“పది రోజుల క్రితం నేను అడిగినప్పుడు మీరు అదే చెప్పారు కదా. అలా చెపుతున్నప్పుడు మీ కంఠంలో నిజాయితీ కనబడింది. దాన్ని నేను నమ్ముతున్నాను. నేను ఈ రోజు వచ్చింది ‘నా భర్తని ఎవరు చంపారు?’ అని అడగటానికి కాదు. ‘ఎందుకు చంపారు?’ అని తెలుసుకోవటానికి. నాకు తెలిసినంతలో నా భర్త అందరికీ ఉపయోగపడే మనిషి. ఎవరికీ హాని చేసే వ్యక్తి కాదు. అలాంటి వారిని ఎందుకు చెప్పారు? ఆర్థికపరమైన ఇబ్బందులు... వయసు వస్తున్న ఇద్దరు ఆడపిల్లలు... ఒంటరి తనం... ఇదంతా ఎవరు చూసుకుంటారు?” ఆమె బాధగా అన్నది

“శ్రీకర్ హత్య మిమ్మల్ని ఎంత బాధ పెట్టిందో అంతకన్నా ఎక్కువ హాని నాకు చేసింది”.

ఆమె ఆశ్చర్యంగా “నా భర్త మరణం నాకన్నా మిమ్మల్ని మీకు ఎక్కువ హాని చేసిందా?” అడిగింది

“అవును.”

“ఎలా?”

“అల్లా మీద ప్రమాణం చేసి చెప్తున్నాను. నాకూ, ఈ హత్యకూ ఏ సంబంధమూ లేదు. నిజానికి హత్య జరిగిన రోజు నేనసలు ఈ ఊర్లోనే లేను. ఒకవేళ ఆ హత్య నేను చేసి ఉంటే ‘నేనే చేశా’నని చెప్పటం వల్ల కొత్తగా వచ్చే నష్టం ఏమీ లేదు. ఎలాగూ శిక్ష పడిపోయింది. జీవితంలో అత్యంత విలువైన సమయం కోల్పోయాను. హంతకుడు అనే ముద్ర పడింది. ఉద్యోగం పోయింది.” ఒక క్షణం ఆగాడు. “... నేను జైలుకి వచ్చాక నా భార్య అనాథ అయింది. కొంతకాలం ఫ్యాక్టరీలో కూలిగా పని చేసిందట. ఆరోగ్యం పాడైంది. దాంతో ఆ ఉద్యోగం కూడా పోయింది. గుడిసెలో చూసుకునే దిక్కు లేక... పది రోజుల క్రితమే...” అతడు నెమ్మదిగా పూర్తి చేశాడు “ఆకలితో చనిపోయింది”

తనలో తనే గొణుక్కుంటున్నట్టు ‘ఐ యాం సారీ’ అన్నది.

“చనిపోయిన రెండు రోజుల వరకూ ఆ పాకలో శవం ఉన్నదన్న విషయం బయట వారికి తెలియ లేదు. వాసన రావటంతో...” కంఠంలో ఏదో అడ్డు పడ్డట్టు, భార్య తాలూకు స్మృతులతో అతడు చాలా సేపు మౌనంగా ఉండిపోయాడు.

భర్త జైల్లో ఉంటే, బయట భార్య ఆకలితో అనాథగా చనిపోవటం ఎంత వ్యధాభరితంగా ఉంటుందో ఆమె ఊహించగలదు. అందుకే అతడిని మరేమీ ప్రశ్నించకుండా సెలవు తీసుకుని వెళ్లిపోయింది.

తనని కలుసుకోవడానికి ఆమె మళ్ళీ వస్తుందో లేదో తెలీదు కానీ, కనీసం ఆమె దగ్గర అయినా తన నిర్దోషత్వం నిరూపించుకోవాలని చిన్న ఆశ..!

ఆ రాత్రి అతడు ఆమెకు ఒక సుదీర్ఘమైన ఉత్తరం రాశాడు.

“మా ఊళ్లో గుడి, మసీదు పక్క పక్క నే ఉండేవి. ఇరు మతాల వాళ్ళూ తమ తమ ప్రార్థనా స్థలాల నుంచి బయటకు రాగానే ఆప్యాయంగా పలకరించుకోవటం, పండుగ రోజుల్లో కౌగిలించుకొని ‘ఈద్ ముబారక్’ చెప్పుకోవటం, ఇప్పటికీ నా కళ్ళకి కట్టినట్టే ఉన్నాయి. మా తాతగారి పేరు గఫర్

ఖాన్. నేను ఆయన దగ్గరే పెరిగాను. మా తాతగారు నన్ను ప్రతిరోజు నమాజ్ కి తీసుకెళ్లేవారు. ఆయన ప్రవచనాలు వల్ల నాకు మతం మీద నమ్మకం పెరిగింది. వయసు వచ్చే కొద్దీ ఆ సిద్ధాంతాలు నా మీద ప్రభావం చూపసాగాయి ఎవరికీ భయపడేవాడిని కాను. స్కూల్లోనూ, బయటా ఏ అన్యాయం జరిగినా ఎదిరించే మనస్తత్వం అలవడింది. కాలేజీకి వచ్చేసరికి అది మరింత బలపడింది. బహుశా నేటి నా ఈ స్థితికి కారణం అదేనేమో.

మీ భర్త, నేనూ కాలేజీలో క్లాస్‌మేట్స్. మతాలు వేరైనా అభిరుచులు ఒకటే అవటంతో స్నేహంగా ఉండేవాళ్ళం. ఒకరికొకరం ఎంతో గౌరవం ఇచ్చుకునేవాళ్ళం. ఆ సమయంలో ఒకసారి కాలేజీలో గొడవలు జరిగాయి. విద్యార్థులు రెండుగా విడిపోయారు. ఒక వర్గానికి మీ భర్త శ్రీకర్ నాయకత్వం వహించాడు. అతడికి ప్రత్యర్థిగా అవతలి వర్గంలో హేమంత్ అనే కుర్రవాడు నాయకుడు. నేను తటస్థంగా ఉండిపోయాను. రెండు రాజకీయ పార్టీల దన్ను రెండు వర్గాలకీ విడివిడిగా ఏర్పడింది.

ఈ మధ్య కాలంలో హేమంత్, డబ్బు వల్ల వచ్చిన దర్పంతో ముంతాజ్ బేగం అనే మా అమ్మాయి దగ్గర చేయగలిగినంత అనర్థం చేశాడు. వెళ్లి వాడిని కొట్టాను. ఆరోజుల్లో నా ఆవేశం అలా ఉండేది. హేమంత్ నా మీద కక్ష పెంచుకున్నాడు.

కాలేజి ఎలెక్షన్స్ పూర్తి అయ్యాయి. డబ్బు లేకపోయినా మీ ఆయన కేవలం తన మంచితనంతో నెగ్గాడు.

మా ఇద్దరి గ్రాడ్యుయేషన్ పూర్తయింది. నేను పై చదువులకి వెళ్లాను.

మీ భర్త రాజకీయాల్లో చేరి ఎం.ఎల్.ఏ. ఎన్నికల్లో నిలబడే సమయానికి నేను పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నాను. అప్పటికి నాలో మొండితనం మరింత పెరిగింది. ఎక్కడ ఉద్యమం ఉన్నా ముందుండి నడిపించేవాడిని. ఆ క్రమంలో ఒక లంచగొండి రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా పోరాడవలసి వచ్చింది. నా పేరు పోలీస్ స్టేషన్‌లో నమోదు చేశారు. "రౌడీ షీటర్" అని ముద్ర వేశారు.

ఎన్నికల హడావిడి మొదలయింది. అధికార పక్షంలో ఇద్దరు వ్యక్తులు ఎం.ఎల్.ఏ టికెట్ ఆశించారు. అందులో మీ ఆయన ఒకరు. మరో వ్యక్తి హేమంత్. పార్టీ మీ భర్తని ఎంపిక చేసింది. ఆయన నామినేషన్ వేశాడు. నన్ను అడిగితే 'నీకు తప్ప ఇంకెవరికి చేస్తాను' అని వాగ్దానం చేసాను.

మా ఊళ్ళో ముస్లింల సంఖ్య బాగానే ఉండేది. ఓట్ల రాజకీయాలు మొదలయ్యాయి. అప్పుడే నాకొక విషయం తెలిసింది. మా మతానికి సంబంధించిన ఒక ప్రముఖ వ్యక్తి మీ ఆయనకు ఎదురుగా ఎన్నికల్లో నిలబడుతున్నాడని..! ఇబ్బందికరమైన స్థితే. కానీ, నేను మీ ఆయనకి మాటిచ్చాను కాబట్టి మావారి నుంచి దూరంగా వచ్చి, మీ ఆయన తరపున ప్రచారం చేయ సాగాను.

ఇక్కడే ఎవరూ ఊహించని సంఘటన జరిగింది. నామినేషన్ ఆఖరి రోజు దగ్గర్లో ఉందనగా, గుడి జంక్షన్ దగ్గర ఒక ముస్లిం యువకుడిని నలుగురు కొట్టారు. పెద్ద గొడవ జరిగింది. కొంతమంది కుర్రాళ్ళతో పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి గొడవ చేశాను. రౌడి షీటర్ ని కాబట్టి నా మాట ఎవరూ వినలేదు. మరుసటిరోజు గుడి దగ్గర ఆవుని చంపి పడేశారు. దాంతో షాపులు తగలబెట్టారు. ముస్లిం అభ్యర్థికి వ్యతిరేకంగా ధర్నాలు మొదలయ్యాయి. పై సంఘటనతో మీ ఆయన గెలవటం నూరు శాతం ఖరారైపోయింది.

ఇదంతా రాజకీయమా, అరాచకీయమా అన్నది నాకు అర్థం కాలేదు.

మీ ఆయన ఇలాంటి పనులు చేయడనీ, చేయించడనీ నాకు తెలుసు. మరి ఎవరు చేసారు? ఎందుకు చేసారు?

అప్పుడే చూచాయిగా నాకో విషయం తెలిసింది.

అలా కొట్టించింది, మతకలహాలు రేపిందీ హేమంత్..! పార్టీ తరపున ఎం.ఎల్.ఏ. సీట్ ఆశించిన హేమంత్..!!

అతడి ప్లాన్ నాకు అప్పట్లో అర్థం కాలేదు.

నామినేషన్ గడువుకి ఇంకా రెండు రోజులు ఉందనగానే మీ ఆయన్ని హత్య చేశారు.

అనుకున్నట్టే ఆ సీటు హేమంత్ కి వచ్చింది. మత ప్రాతిపదిక మీద అప్పటికే ఊరు రెండుగా విడిపోయింది. అతడి విజయం నల్లేరు నడకలా సాగింది.

అప్పుడు అర్థం అయింది అతడి ప్లాన్. ఒక దెబ్బకి రెండు పక్షులు.

మాట ద్వేషాలు రెచ్చగొట్టి, ఆ తరువాత మీ ఆయన్ని చంపేస్తే, సీటు తనకి దక్కుతుందనీ, సానుభూతి ఓట్లన్నీ తనకే పడతాయనీ హేమంత్ ప్లాన్ వేసాడు.

ఇదంతా జరుగుతున్న సమయానికి నేను ఈ ఊళ్ళోనే లేను. అంతకు ముందు నాలుగు రోజుల క్రితమే నాకు ఉద్యోగం వచ్చినట్టు తెలిసి, సర్టిఫికెట్ల కోసం పట్నం వెళ్లాను. అక్కడ టీ.వీ. చూస్తూ ఉండగా "ఎం.ఎల్.ఏ. అభ్యర్థిని ఎవరో ముసుగు వ్యక్తి చంపేశాడు" అని స్క్రోలింగ్ కనబడింది. మీ ఆయన నాకు అంత ఆప్త మిత్రుడు కాకపోయినా, ఆ వార్త వల్ల మనసు వికలమై వెనక్కి వచ్చేసాను కూడా.

మరుసటి రోజు పోలీసులు వచ్చి నన్ను అరెస్ట్ చేశారు. ఎందుకు చేశారో కూడా నాకు తెలీదు. ఆ తరువాత విషయం అర్థమయింది. నేను మీ ఆయన పార్టీలో ఒక కోవర్టుగా చేరాననీ నా మతమూ, నా ఉద్దేశ్యాలూ వేరనీ, మీ ఆయన గెలవకుండా ఉండటం కోసం ఆయన్ని చంపేశాననీ ఒక వాదన లేవదీశారు. ఈ లోపులో హేమంత్ ఎం.ఎల్.ఏ. అయ్యాడు. నాకు పది సంవత్సరాలు శిక్ష పడింది.

ఇదీ జరిగింది. నేను చెప్పింది మా అమ్మతో సహా ఎవరూ నమ్మలేదు. నేను జైలుకి వెళ్ళిన కొన్నిరోజులకి ఆమె మరణించింది. ఇదిగో... ఇప్పుడు నా భార్య కూడా నన్ను వదిలి వెళ్ళిపోయింది. కనీసం మీరైనా నేను చెప్పింది నమ్ముతారని ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. శ్రీకర్ ఎప్పటికీ నా స్నేహితుడే. మతాలు వేరైనా మా ఇద్దరి మధ్యా మమతలు అలాగే ఉంటాయి – సలీం"

- అంటూ ఉత్తరం పూర్తి చేశాడు.

++ ++ ++

మెలోడ్రామా ఎక్కడో పుస్తకాల్లో ఉంటుందని అనుకుంటాం కానీ, మన జీవితాల్లో ఉన్నంత డ్రామా మరి ఎక్కడా ఉండదు.

ఏదో చిన్న కేసులో దొరికిన దొంగ... పోలీస్ ఇంటరాగేషన్లో... తనూ మరో స్నేహితుడూ కలిసి మొదట్లో చిన్న చిన్న దొంగతనాలు చేసేవాళ్ళమనీ, అతడు కిరాయి హంతకుడిగా మారి హత్యలు చేసాడని చెప్పాడు. మరింత తగిలిస్తే, శ్రీకర్ని హత్య చేసింది కూడా అతడే అని వెల్లడి అయింది. మరిన్ని రుజువులు దొరికాయి. ఎమ్మెల్యే హేమంత్ మీద కేసు రిజిస్టర్ అయింది.

అప్పుడు ఆమె అతడిని కలుసుకుంది.

"నిజం నిప్పులాంటిది అంటారు. మీరు తప్పకుండా ఈ కేసు నుంచి బయటకు వస్తారు అంతే కాదు. చేయని నేరానికి ఇన్నాళ్లు శిక్ష అనుభవించేలా చేసినందుకు కోర్టు మీకు క్షమాపణ చెప్పుకున్నా ఆశ్చర్యం లేదు" అన్నదామె సంతోషం నిండిన కంఠంతో.

అయితే అతడిలో అటువంటి సంతోషం ఏమీ కనబడలేదు. "నాకంటూ బయటి ప్రపంచంలో ఎవరూ లేరు. జైల్లో ఉన్నా, బయటికి వచ్చినా పెద్ద తేడా ఏమీ లేదు" అన్నాడు.

"ఎందుకంత నెగిటివ్ గా ఆలోచిస్తున్నారు?"

అతడు ఆమె వైపు అభావంగా చూసి "ఇందులో నెగిటివ్ ఏముంది? అంతా వాస్తవమే కదా" అన్నాడు నిర్లిప్తంగా.

"నాలుగు గోడల మధ్య కాకుండా... బయటి ప్రపంచంలోకి వస్తే, మతద్వేష రహిత సమాజం పట్ల మీరు నమ్మిన సిద్ధాంతాలను సమాజానికి ప్రచారం చెయ్యవచ్చు"

ఆ మాటలకి అతడు ఆమె వైపు ఆశ్చర్యంగా చూసాడు.

ఆమె కొనసాగించింది. "... *కొండ శిఖరం మీద చీకటిలో ఉన్నప్పుడు, తిమిరాన్ని తిడుతూ కూర్చుంటే జీవితాంతం అక్కడే ఉండిపోతామట. అలా కూర్చోవడం కంటే, అడుగు ముందుకు వేస్తే కింద మెట్టు తగలవచ్చు. లేదా గాలిలో ఎగరడం తెలియవచ్చు*' అని ఎక్కడో చదివాను. నాది శ్రీకర్ ది ప్రేమ వివాహం. మా వాళ్ళందర్నీ వదిలి వెళ్లి పెళ్లి చేసుకున్నాను. నా కళ్ళ ముందే అతడు అంచెలంచెలుగా ఎదిగి గొప్ప రాజకీయ నాయకుడు అయ్యాడు. అతడు మరణించేసరికి మా కలల భవంతి గాజుబొమ్మలా కూలిపోయింది. మరణించే సమయానికి నాకు నాలుగో నెల. ఎన్నో అవమానాలు భరించాను. 'విధవరాలి కూతురికి బారసాల కూడానా' అన్నారు. దగ్గరికి తీసుకునే వాళ్లు కూడా లేరు. అర్ధరాత్రి నా పెద్ద కూతురు లేచి 'నాన్న కావాలి' అంటూ ఏడ్చేది.

శ్రీకర్ ఏమీ సంపాదించ లేదు. దాంతో ఆర్థిక ఇబ్బందులు. టీచర్ గా చేరాను. ఇద్దర్ని పెంచి పెద్ద చేస్తూ ఉన్నాను. ఒకటే గమ్యం. తండ్రి లేని లోటు తెలియకుండా పిల్లల్ని పెంచాలి..! పాజిటివ్ థింకింగ్ అంటే ఏమిటని మీరన్నారే. ఇంతకన్నా ఏం కావాలి?"

++ ++ ++

జైలు నుంచి గేటు దాటి సువిశాల ప్రపంచంలోకి అడుగు పెట్టాడు అతడు. ఇద్దరు కూతుళ్లతో ఆమె బయట నిలబడి వుంది.

చిన్న కూతురి చేయి పట్టుకున్నాడు. నలుగురూ ముందుకి సాగిపోయారు.

సూర్యుడు పడమటి వైపు క్రుంగి పోతూ ఉన్నాడు.

మతాన్ని రాజకీయం కలుషితం చేసిందా, రాజకీయాన్ని మతం కలుషితం చేసిందా అన్న అయోమయంతో ఉన్నట్టూ ప్రపంచం అనే జైలు మీద చీకటి చాయలు కమ్ముకోసాగాయి.

వారు జైలు నుంచి దూరంగా నడుస్తున్నారు.

**ఈ దశలో** "అమ్మ కడుపు చల్లగా" మొదటి సంపుటాన్ని గురించి రెండు మాటలు చెప్పాలి. మల్లాది సచ్చిదానందమూర్తిగారు సాహిత్యాభిమాని. ప్రత్యేకంగా నాకు. నేను రచన చేయడం ప్రారంభించినప్పటినుంచీ ప్రచురించే అవకాశాన్ని ఆయన అంది పుచ్చుకున్నారు. అంతేకాదు. పుస్తకం ఎక్కువభాగం కొడైకెనాల్‌లో వారి గెస్టు హౌస్‌లో కూర్చుని రాశాను. వారం రోజులయాక రచన ముమ్మరంగా సాగుతుండగా మూర్తిగారికి ఫోన్ చేసి మరో వారం రోజులుంటానన్నాను. ఆయన ఆనందంగా అంగీకరించారు. ఆత్మకథ పూర్తయి ప్రచురితమయాక స్వయంగా తిరుపతి తీసుకువెళ్ళి స్వామివారి పాదాల దగ్గర ఉంచి వచ్చారు. ఈ గ్రంథం శీర్షిక నిర్ణయం దగ్గర్నుంచీ, ప్రూఫ్ రీడింగు వరకూ భరాగోగారు ప్రమేయం ఉంది.

ప్రచురణ పూర్తయాక భరాగో అన్నారు ఒకసారి: "నీ ఆత్మకథ హిట్ అయ్యా" అని.

నాకు నవ్వొచ్చింది. హిట్టో ఫట్టో ఆశించి నేను రాయలేదు. ఆత్మకథ పెరఫార్మెన్స్ కాదు. అలనాటి ప్రధాని ప్రత్యేక కార్యదర్శి హెచ్.వై.శారదా ప్రసాద్ ఒకమాట అన్నారు: A well written life is as rare as a well lived one అని. వెనక్కి చూసుకున్నప్పుడు వివిధ రంగాలలో వివిధ ప్రముఖులతో సాంగత్యం, తెలుసుకున్న విషయాలు ఉత్సాహపరచగా ఆత్మకథ రాయాలనే తలంపు చాలాకాలంగా ఉండేది. అదిలా కార్య రూపం దాల్చింది.

ఈ ఆత్మకథ నాలుగు ముద్రణలకు నోచుకుంది. పుస్తకాలు అయిపోయక ఎందరో ఫోన్లు కద్దు. ఓ రాత్రి మల్లాదిగారు ఫోన్ చేసి: మీ ఆత్మకథను ప్రచురించడం నా అదృష్టం. మన మధ్య స్ట్రాంగ్ వైబ్రేష్సు ఉన్నాయి. రచనలో మీరు పరిపక్వమయిన దశకి వచ్చారు అన్నారు.

ఆత్మకథ చదివి మిత్రులు పి.బి.శ్రీనివాస్ "You are a treasury of talent" అన్నారు.

చాలామంది ప్రముఖుల స్పందన విన్నాక కనీసం కొందరి స్పందనయినా ఒక చిన్న పుస్తకంగా ముద్రించి పెద్ద పుస్తకంతోపాటు ఉచితంగా ఇవ్వాలని ప్రచురణ కర్త సూరిబాబు, మల్లాది నిర్ణయించారు. తత్ఫలితంగా సద్గురు శివానందమూర్తిగారు, మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు, ముళ్ళపూడి వెంకటరమణగారు, డాక్టర్ అనంత పద్మనాభరావుగారు, కిరణ్‌ప్రభ - యిలా కొందరి స్పందనలతో పుస్తకమయింది. ఇందులో చిన్న తమాషా. ఈ పుస్తకంలో మొదటి స్పందన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారిది. ఇదేమిటి? ఆయన దివంగతులు కదా? మాలో ఒక మిత్రుడు అత్యద్భుతంగా వారి శైలిని అనుకరిస్తూ రాశారు. ఆయనెవరో కనుక్కుంటే సముచితమైన బహుమతి యిస్తాం - అన్నారు భరాగో. మొదట పద్యంతో వ్యాసం మొదలయింది.

మారుతియన్న నామమది మానసమందుననేక భావనల్

గారవమొప్ప యేర్పరచు కావ్య మహాద్భుత వీచికాఝురీ

వారణ నిర్విరామ గుణవాగ్విభవైక విలోక డోలికా

ధారణ మొప్ప ఆతనిని ధన్యుడ వంచని మెచ్చరే యటన్

వ్యాసం ఇంకా అల్లరి చేసేశాడు డాక్టర్ పప్పు వేణుగోపాలరావు. తీరా ఎవరూ ఆయన్ని కనిపెట్టలేకపోయారు.

ఆత్మకథ మీద వచ్చిన స్పందనలలో తలమానికంగా చెప్పుకోదగినది చాలాకాలం తరువాత వచ్చిన ప్రొఫెసర్ తంగిరాల సుబ్బారావుగారి ఆరుపేజీల ఉత్తరం. ఎన్నో సూచనలు చేస్తూనే "ఇటువంటి అత్యాధునిక గ్రంధం నేను చదవలేదు. దీని గొప్పతనాన్ని చెప్పడానికి నాకు మాటలు రావడంలేదు. ముళ్ళపూడి వెంకటరమణగారు తన ఆత్మకథని (కోతికొమ్మచ్చి") హాస్యరసభరితంగా చెబితే, మీరు నవరసభరితంగా చెప్పారు. ప్రాచీన సాహిత్యంలో చాలా గొప్ప గొప్ప గ్రంధాలు నన్ను తన్మయీభూతుణ్ణి చేసినవి చాలా ఉన్నాయి. ఆధునిక కవులలో శ్రీశ్రీ తిలక్, శేషేంద్ర కవిత్వాలు నాకు చాలా యిష్టం. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి "అనుభవాలూ - జ్ఞాపకాలూను" చాలా బాగుంది. కానీ మీ గ్రంధం ఇచ్చినంత పరిపూర్ణమైన ఆనందాన్ని ఆ గ్రంధం ఇవ్వలేదు."

ఇలా సాగింది. తెలుగు సాహిత్యానికే మకుటాయమాన మనదగ్గ రచన శ్రీపాదవారి "అనుభవాలూ - జ్ఞాపకాలూను". అలాగే ముళ్ళపూడి "కోతికొమ్మచ్చి" వారి ధోరణిలో ఆత్మకథకి కొత్త ఒరవడి. ఏమయినా అంతటి పండితుడిని నా రచన అలరించడం నా అదృష్టం.

ఇలా ఎన్నో స్పందనలు. మూడు పునర్ముద్రణలు పూర్తిచేసుకుని నాలుగో ముద్రణ ఇటీవలే జరిగింది. నాలుగు ముద్రణలూ మల్లాదివారి ఆధ్వర్యంలోనే జరిగాయి.

మిత్రుడు, పాత్రికేయుడు పి.నాగేంద్రకుమార్ చదివి ఒకే ఒక కార్డు అర్జంటుగా పోస్టు చేసాడు. "ఇది పుస్తకం కాదు - పూనకం" అని.

మాలతీచందూర్ ఫోన్ చేశారు: "చేతికందగానే పుస్తకం తిప్పాను. మనం ఉండకపోయినా పుస్తకం మరో 200 ఏళ్ళు ఉంటుంది. ఇది తెలుగువారి చరిత్ర. ఇంత చక్కగా వేసిన ఆత్మకథని నేను చూడలేదు" అంతేకాదు స్వాతి మాసపత్రికలో ఆరు పేజీల సమగ్ర సమీక్షని రాశారు.

మిత్రుడు, సినీ నిర్మాత మురారి ఫోన్ చేశాడు - పుస్తకం చదవడాన్ని మధ్యలో ఆపి" "మీ పుస్తకాన్ని బతికించినవాడు మీ వాసూ. ఇప్పుడు మాట్లాడగలిగే స్థితిలో లేను" అని ఫోన్ పెట్టేశాడు. అసలు పుస్తకం చేతికి రాగానే ప్రచురణ కర్త సూరిబాబు ఆవురావురుమని చదివేసి ఫోన్ చేశాడు: "ఇదొక కళాఖండం. ఆశ్చర్యం, కన్నీళ్ళు, ఉత్సుకత - అన్నీ తోసుకు వస్తున్నాయి. ఎంతోమంది మహానుభావులతో సాంగత్యం. పరిచయాలు. ఇది పాఠ్యపుస్తకం కావాలి" అన్నాడు ఆవేశంగా.

జీవా పార్కులో నాతో రోజూ నడిచే మిత్రులు, బాబా భక్తులు రంగారావుగారు అన్నారు: "Whether you love God or not, God loves you. మనిషి ఇంతకన్నా సార్థకంగా జీవించలేడనిపించింది" ఇప్పుడాయన కీర్తిశేషులు.

ఆత్మకథ చదివాక యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారు విశాఖపట్నం కళాభారతిలో లోక్ నాయక్ ఫౌండేషన్ సభకి నాతోపాటు వస్తున్న మా ఆవిడకి సరాసరి వచ్చి పాదాభివందనం చేశారు. అంతేకాదు. ఆనాటి సభలో గర్వంగా చెప్పుకున్నారు.

ఇలాగే మరొక వ్యక్తి అవసరాల రామకృష్ణారావుగారు. మద్రాసు నుంచి వస్తూనే ఒకసారి ఆయనకి ఫోన్ చేశాను. "మీ ఆత్మకథ చదివిన మొదటి ప్రేక్షకుడు కావడం నా అదృష్టం" అంటూనే "మీ ఆవిడ వచ్చారా?" అన్నారు.

వచ్చారన్నాను.

"మీ ఆత్మకథ చదివాక మీ ఆవిడ మీద గౌరవం పెరిగింది. ఇంటికి వస్తాను" అన్నారు.

ఆత్మకథ గురించి నాకు వచ్చిన ఒక ఫోన్ ముఖ్యమైనది. పెద్దలు, రేడియోలో చేరిన తొలిరోజుల్నుంచీ, ఆయన స్టేషన్ డైరెక్టరయి విజయవాడ వచ్చిన వరకూ కలిసి పనిచేసిన బాలాంత్రపు రజనీకాంతరావుగారు (ఆయనకప్పుడు తేలిగ్గా 95 ఉంటాయి.) "మీ ఆత్మకథ చదవాలని ఉంది. ఒక కాపీ పంపగలరా?" అనడిగారు.

క్రియేటివ్ లింక్స్ సూరిబాబుకి ఫోన్ చేశాను. ఆయన భరాగో పర్సనల్ కాపీ తీసుకుని వెంటనే పంపించాడు. సరిగ్గా వారం రోజులకి రజనీకాంతరావుగారి దగ్గర్నుంచి మళ్ళీ ఫోన్: "మీ ఆత్మకథ చదివాను. చాలా బాగుంది. ఇది భరాగోకి మీరు ఆత్మీయంగా ఇచ్చిన పుస్తకం. నాకో కాపీ పంపగలరా?".

"మొదటి ముద్రణ అయిపోయింది. మీరా కాపీని ఉంచేసుకోండి" అన్నాను.

ఈ గ్రంధాన్ని ప్రశంసాపత్రం చేయడం ఉద్దేశం కాదు. ఇవి కేవలం నమూనా స్పందనలు.